


మా కలం - సామాన్యుడి బలం

# నంది పత్రిక

జాతీయ తెలుగు దిన పత్రిక

RNI-APTEL/2023/88162

GSTIN 37AMRPM5719R1ZX

ఎడిటర్: మహేష్ యాదవ్ | తెలంగాణ , ఆంధ్ర ప్రదేశ్ | సంపుటి : 4 | సంచిక : 180 | సోమవారం 06- 07 -2026 | పేజీలు : 12 | వెల-3 | No: KNL/3-77(D)/2026-2028


మరోసారి ప్రపంచకప్ విజేతగా ఆస్ట్రేలియా..



# కుప్పంలో సీఎం చంద్రబాబు
# డబుల్ ఫోకస్

**పేదరిక నిర్మూలనకు పీ4 కార్యక్రమాన్ని ప్రకటించిన సీఎం చంద్రబాబు**

**బంగారు కుటుంబాలకు అండగా నిలుస్తున్న మార్గదర్శులు, కార్పొరేట్ సంస్థలు**

**కుప్పం ఉద్యాన ఉత్పత్తుల మార్కెటింగ్ కోసం ఐటీసీ సంస్థతో ఒప్పందం**

**గంగా-కావేరి నదుల అనుసంధానం జరగాలని ఆకాంక్షించిన ముఖ్యమంత్రి**

**రైతులు ప్రకృతి సేద్యం వైపు మళ్లాలని, ఆధునిక పద్ధతులు పాటించాలని పిలుపు**

పేదరిక నిర్మూలనకు ప్రజల భాగస్వామ్యంతో కూడిన శాశ్వత పరిష్కారం చూపడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం'పీ4' (పబ్లిక్- ప్రైవేట్- పీపుల్ పార్ట్‌నర్‌షిప్ ఫర్ ప్రాస్పెరిటీ) కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్తోందని ముఖ్యమంత్రి చంద్రబాబు ఉద్ఘాటించారు. ఒకవైపు పేద కుటుంబాలను ఆర్థికంగా బలోపేతం చేస్తూనే, మరోవైపు రైతుల ఆదాయాన్ని పెంచేలా వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టామని తెలిపారు. తన కుప్పం పర్యటనలో భాగంగా ఆదివారం ఆయన వేర్వేరు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. పీ4 కార్యక్రమంలో భాగంగా 'బంగారు కుటుంబాలు', 'మార్గదర్శుల'తో సమావేశమవగా, అనంతరం రైతులతో ఆత్మీయ పలకరింపులో మాట్లాడారు.



**నంద్యాల జిల్లాలో ఘోర రోడ్డుప్రమాదం... ఏఎస్పై సురేశ్ రెడ్డి దుర్మరణం**



నంద్యాల-కర్నూలు జాతీయ రహదారిపై ప్రమాదం

ప్రమాదంలో ఆళ్లగడ్డ రూరల్ ఏఎస్పై సురేశ్ రెడ్డి అక్కడిక్కడే మృతి

టైరు పేలడంతో అదుపుతప్పిన క్రెటా కారు

మరో నలుగురికి తీవ్ర గాయాలు, ఆసుపత్రికి తరలింపు

# కన్నెపల్లి పర్యటన

## కేటీఆర్ కాన్వాయ్‌ను అడ్డుకున్న పోలీసులు



-కన్నెపల్లి పంప్‌హౌస్ పర్యటనకు బయలుదేరిన కేటీఆర్

-జనగామ జిల్లా పెంబర్తి వద్ద కాన్వాయ్‌ను అడ్డుకున్న పోలీసులు

-భారీ కాన్వాయ్‌కు అనుమతి లేదంటూ పోలీసుల అభ్యంతరం

-కేటీఆర్, బీఆర్ఎస్ నేతలతో పోలీసుల స్వల్ప వాగ్వాదం

-చర్చల తర్వాత కేటీఆర్ పర్యటనకు అనుమతి

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ కాన్వాయ్‌కు జనగామ జిల్లాలో పోలీ సుల నుంచి అడ్డంకి ఎదురైంది. కన్నెపల్లి పంప్ హౌస్ పర్యటనకు భారీ కాన్వాయ్‌తో బయలుదేరిన ఆయనను పెంబర్తి వద్ద పోలీసులు అడ్డుకున్నారు. దీంతో అక్కడ కొద్దిసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఆదివారం మధ్యాహ్నం కేటీఆర్ తన పర్యటనలో భాగంగా భారీ సంఖ్యలో వాహనాలతో కూడిన కాన్వాయ్‌తో కన్నెపల్లికి బయలుదేరారు. 2లో



## అర్హులైన ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇల్లు మంత్రి జూపల్లి

**ఇందిరమ్మ ఇండ్ల గృహ ప్రవేశ వేడుకలో పాల్గొన్న మంత్రి**

అర్హులైన ప్రతి పేద కుటుంబానికి రాజకీయాలకు అతీతంగా ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తామని పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తెలియజేసినారు. కొల్లాపూర్ మున్సిపా లిటీ పరిధిలో 9వ వార్డుకు సంబంధించిన రేణుక రామ నరసింహకు చెందిన ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశానికి మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ రహీం పాషాతో కలిసి మంత్రి జూపల్లి కృష్ణారావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల దంపతులకు మంత్రి జూపల్లి కృష్ణారావు నూతన వస్త్రాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కొత్త ఇంటిలో కుటుంబ సభ్యులు సుఖసంతో షాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షించారు. కులం, మతం, వర్గం, రాజకీయ అనుబంధం చూడకుండా అర్హులైన ప్రతి పేదవారికి ఇంది రమ్మ ఇల్లు అందజేస్తున్నామని చెప్పారు. ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ. 5 లక్షలు ప్రభుత్వం వెచ్చిస్తోందన్నారు. పేదల మిగతా2లో

## రాష్ట్రంలో ప్రతి రంగాన్ని అభివృద్ధి చేస్తూ ప్రజా పాలన సాగిస్తున్నాం



**ఉద్దేశపూర్వకంగా బురదజల్లే ప్రయత్నాలు చేస్తున్నారు**

రాష్ట్రంలోని ప్రతి రంగాన్ని అభివృద్ధి చేయడంతో పాటు ప్రజా సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తూ ప్రజా పాలన కొనసాగించడం జరుగుతుందని రాష్ట్ర కార్మిక,ఉపాధి శిక్షణ, కర్మాగార,గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకట స్వామి అన్నారు. ఆదివారం జిల్లాలోని భీమారం మండల కేంద్రంలో అభివృద్ధి పనులకు మిగతా2లో



## ప్రజా ప్రభుత్వంలో సంక్షేమం అభివృద్ధి రెండింటికీ సమ ప్రాధాన్యత

**కల్లూరు మండలంలో 15 కోట్ల వ్యయం తో నిర్మించనున్న పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి**

**రైతుల ఖాతాల్లో రైతు భరోసా నిధులు జమ..**

**అర్హులైన ప్రతి పేద కుటుంబానికి దశలవారీగా ఇందిరమ్మ ఇళ్లు..**

**రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి..**

ప్రజా ప్రభుత్వం ఏర్పడి రెండున్నరేళ్లు లలోనె ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో సంక్షేమం, అభివృద్ధి రెండింటికీ సమ ప్రాధాన్యత ఇస్తున్నామని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు. ఆదివారం సత్తుపల్లి నియోజకవర్గంలో మంత్రి విస్తృతంగా పర్యటించారు. ముందుగా కల్లూరు మండలం చిన్నకోరుకొండ గ్రామం లో రూ. 5 కోట్ల అంచనా వ్యయంతో నిర్మాణం మిగతా2లో



## సర్కారు బడుల వైపు ప్రజల అడుగులు

**రేవంత్ రెడ్డి పాలనలో పూర్వ వైభవం పొందుతున్న ప్రభుత్వ పాఠశాలలు**

రేవంత్ రెడ్డి ప్రభుత్వం చేపట్టిన విద్యా సంస్కరణల ఫలితంగా తెలంగాణలో ప్రభుత్వ పాఠశాలలకు మళ్లీ పూర్వ వైభవం వస్తోంది. ఒకప్పుడు విద్యార్థుల కొరతతో మూతపడిన సర్కారు బడులు ఇప్పుడు తిరిగి కళకళలాడుతున్నాయి. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ఏళ్లుగా మూతబడి ఉన్న పాఠశాలలు ఈ విద్యా సంవత్సరం నుంచి మళ్లీ తెరుచుకుంటుండటం విశేషం. జగిత్యాల జిల్లాలోనే 13 ప్రభుత్వ మిగతా2లో

## ఆంధ్రప్రదేశ్‌కు కొరియా దిగ్గజ కంపెనీలు...



## తెలంగాణలో పెన్షన్ల స్కామ్‌కు చెక్

**3 లక్షల మంది అర్హులకు కొత్తగా ఆసరా!**



- తెలంగాణలో భారీ పెన్షన్ల కుంభకోణం గుర్తింపు
- లక్ష మంది అనర్హులు, మృతుల పేర్లతో డబ్బు డ్రా చేస్తున్నట్లు వెల్లడి
- అనర్హులను తొలగించి, వారి స్థానంలో కొత్తవారికి అవకాశం
- రాష్ట్రవ్యాప్తంగా కొత్తగా 3 లక్షల మందికి పెన్షన్ల మంజూరుకు నిర్ణయం
- ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్న అర్హులకు ప్రభుత్వ నిర్ణయంతో ఊరట

తెలంగాణలో అర్హులైన నిరుపేదలకు అండగా ఉండాల్సిన సామాజిక భద్రతా పెన్షన్ల వ్యవస్థలో ఏళ్లుగా జరుగుతున్న భారీ దోపిడీకి రాష్ట్ర ప్రభుత్వం అడ్డుకట్ట వేసిం ది. సంక్షేమ ఫలాలు దుర్వినియోగం కాకుండా చూడా లనే లక్ష్యంతో చేపట్టిన ప్రత్యేక తనిఖీల్లో దిమ్మతిరిగే వాస్తవా లు వెలుగుచూశాయి. రాష్ట్రవ్యాప్తంగా లక్ష మందికి పైగా అనర్హులు ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా పెన్షన్లు పొం దుతున్నట్లు అధికారికంగా నిర్ధారించారు. మిగతా2లో




## ప్రతి 12 ఏళ్లకోసారి శివలింగంపై పిడుగు పడుతుంది అయినా చెక్కుచెదరని ఈ శివాలయం రహస్యం ఏంటి.?

హిమాచల్ ప్రదేశ్‌లోని బిజ్లీ మహాదేవ్ ఆలయంలో ప్రతి 12 ఏళ్లకోసారి పిడుగు నేరుగా శివలింగంపై పడుతుందని స్థానిక విశ్వాసం. పిడుగుతో శివలింగం విరిగిపోయినా, ప్రత్యేక పూజలతో తిరిగి పూర్వస్థితికి రావడం ఈ ఆలయాన్ని ప్రపంచవ్యాప్తంగా ప్రత్యేకంగా నిలబెడుతోంది. మన దేశంలో ఎన్నో పురాతన దేవాలయాలు తమ చరిత్ర, ఆధ్యాత్మికత, రహస్యాలతో భక్తులను, పరిశోధకులను ఆశ్చర్యపరుస్తుంటాయి. అలాంటి అద్భుత క్షేత్రాల్లో మిగతా2లో

# రాష్ట్రవ్యాప్తంగా అన్ని సంప్రదాయ కుల వృత్తుల కళాకారులకు స్టాల్స్

బోనాల పండుగకుఅవసరమైన అన్ని రకాల చేతి వృత్తుల ఉత్పత్తులు ఒకే వేదికపై ప్రజలకు అందుబాటులో ఉండేలా ఈ మేళాను ఏర్పాటు చేస్తున్నామని మంత్రి పేర్కొన్నారు. తెలంగాణ సంప్రదాయ కళలు, గ్రామీణ వృత్తిదా రులకు ఈ మేళా గొప్ప వేదికగా నిలుస్తుందని, బోనాలు కేవలం ఆధ్యాత్మిక ఉత్సవమే కాకుండా తెలంగాణ సంస్కృతి, కళలు, చేతివృత్తుల వైభవాన్ని ప్రతిబింబించే మహోత్సవమని అన్నారు .రాష్ట్రవ్యాప్తంగా కుమ్మరి, కమ్మరి, వడ్రంగి, విశ్వబ్రాహ్మణ, పద్మశాలి, నేత కళాకారులు, బంగారు పనివారు, రాతి శిల్పులు, బుట్టల తయారీదారులు, తోలు కళాకారులు తదితర సంప్రదాయ కులవృత్తులకు చెందిన కళాకారులు తమ ఉత్పత్తులను నేరుగా ప్రజలకు విక్రయించేఅవకా శాన్ని ఈ మేళా కల్పిస్తోందని తెలిపారు. బోనాల సందర్భంగా అవసరమయ్యే మట్టి బోనం కుండలు, మట్టి దీపాలు, వెదురు బుట్టలు, గంపలు, జల్లెడలు, పిత్తళి ,రాగి చెంబులు, కలశాలు, ఘటాలు, గంటలు, పూజా సామగ్రి, వెదురు అలంకరణ వస్తువులు, పూల దండలు, తోరణాలు, బోనం అలంకరణ వస్త్రాలు, గాజులు, పూసల అలంకరణ సామగ్రి, పోతురాజు ఉపయోగించే కొరడాలు, కాళ్ల గజ్జెలు, డప్పులు, డోలు వంటి సంప్రదాయ వాద్యాలు, చెక్కతో తయారుచేసిన పూజా పీటలు, చిన్న మండపాలు తదితర అనేక వస్తువులు ఈ మేళాలో అందుబాటులో ఉంటాయని మంత్రి వివరించారు.బోనాల పండుగతో కుమ్మరి, మేదరి, కంసాలి, వడ్రంగి, డప్పు కళాకారులు, పూల వ్యాపారులు, వస్త్ర కళాకారులు తదితర వేలాది మంది సంప్రదాయ చేతివృత్తిదారులకు ఉపాధి లభిస్తుందని, ఈ మేళా వారి ఆర్థికాభివృద్ధికి తోడ్పడటమే కాకుండా తెలంగాణ సాంస్కృతిక వారసత్వాన్ని పరిరక్షించడంలో కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు.గత ఏడాదితో పోలిస్తే ఈసారి మరింత ఎక్కువ మంది చేతివృత్తి కళాకారులకు అవకాశం కల్పిస్తూ, అధిక సంఖ్యలో స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నామని మంత్రి తెలిపారు. గతంలో కుమ్మరి, మేదరి, వడ్రంగి, గీత కార్మికులు, పూసల కళాకారులు, కంచరి, నేత తదితర వృత్తుల వారు విజయవంతంగా తమ ఉత్పత్తులను విక్రయించారని, ఈసారి ఇంకా ఎక్కువ కులవృత్తులకు ప్రాధాన్యం కల్పిస్తున్నామని చెప్పారు.ప్రజా ప్రభుత్వం చేతివృత్తుల పరిరక్షణకు, సంప్రదాయ కళాకారుల జీవనోపాధి బలోపేతానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, వారి ఉత్పత్తులకు మార్కెట్ కల్పించడం, ఆదాయాన్ని పెంచడం, యువతను సంప్రదాయ వృత్తుల వైపు ప్రోత్సహించడం ఈ మేళా ప్రధాన లక్ష్యమని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. గ్రామీణాభివృద్ధి శాఖ, సెర్ప్ ఆధ్వర్యంలో వివిధ కుల వృత్తుల కళాకారులకు హైదరాబాద్‌లోని హెచ్ఎండీఏగ్రౌండ్స్‌లో నేరుగా అమ్మకాలు నిర్వహించే అవకాశం కల్పిస్తున్నామని చెప్పారు. బోనాల ఉత్సవాలసందర్భంగా నగరానికి వచ్చే లక్షలాది మంది భక్తులు ఈ మేళాను సందర్శించిచేతివృత్తుల ఉత్పత్తులను కొనుగోలు చేయడం ద్వారా కళాకారుల కుటుంబాలకు అండగా నిలవాలని మంత్రి విజ్ఞప్తి చేశారు. మనం కొనుగోలు చేసే ప్రతి చేతి ఉత్పత్తి ఒక కళాకారుడికుటుంబానికి భరోసా, ఒక సంప్రదాయ వృత్తికి జీవం అని పేర్కొన్న మంత్రి, తెలంగాణ సంస్కృతిని కాపాడుతూ చేతివృత్తులకు కొత్త ఊపునిచ్చే ఈ మేళానువిజయవంతం చేయడంలో ప్రతి ఒక్కరూభాగస్వాములు కావాలని కోరారు. బోనాల ఉత్సవాల నేపథ్యంలోనిర్వహిస్తున్న ఈ రాష్ట్రస్థాయి చేతివృత్తుల మేళాను ప్రోత్సహించేందుకు రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు పాల్గొంటారని మంత్రి తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు పెద్ద ఎత్తున ఈ మేళాను సందర్శించి సంప్రదాయ చేతివృత్తులను ఆదరించివిజయవంతం చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు.

# రాష్ట్రంలో ప్రతి రంగాన్ని అభివృద్ధి చేస్తూ ప్రజా పాలన సాగిస్తున్నాం

ఆదివారం జిల్లాలోని భీమారం మండల కేంద్రంలో అభివృద్ధి పనులకు జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, అధికారులతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి మాట్లాడుతూ...రాష్ట్రంలో ప్రజల సంక్షేమంలో భాగంగా ప్రతి రంగంపై ప్రత్యేక దృష్టి సారించి అభివృద్ధి దిశగా చర్యలు తీసుకుం టున్నామని తెలిపారు.మండల కేంద్రంలో మురుగు కాలువ నిర్మాణ పనులను ప్రారంభించడం జరిగిం దని, 143 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్లు అందించడం జరిగిందని తెలిపారు. అర్హులైన పెంకు టిల్లు ఉన్నవారికి,సొంత స్థలం కలిగిన వారికి ఇందిర మ్మ ఇండ్ల పథకం వర్తింప చేయడం జరుగుతుందని తెలిపారు. అర్హులందరికీ 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందించడం జరుగుతుందని, రేషన్ కార్డులు జారీ చేసి చౌక ధరల దుకాణాల ద్వారా సన్న బియ్యం పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి అందించేలా క్షేత్రస్థాయిలో కృషి చేస్తున్నామని తెలిపారు. చెన్నూరు నియోజకవర్గ పరిధిలో పంచాయతీరాజ్ ఆధ్వర్యంలో 36 కోట్ల రూపాయలతో 56 కిలోమీటర్ల మేర రహదారులు, రోడ్లు భవనాల శాఖ ఆధ్వర్యంలో 63 కోట్ల రూపాయల వ్యయంతో రహదారులు నిర్మించడం జరుగుతుందని, భీమారం మండల పరిధిలో 6 కిలోమీటర్ల మేర రోడ్డు పనులు చేపట్టడం జరుగుతుందని తెలిపారు.అమృత్ 2.0 పథకం క్రింద ప్రతి ఇంటికి నల్లా కనెక్షన్ ద్వారా నిరంతరం త్రాగునీటి సరఫరా చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.సుమారు 100 కోట్ల రూపాయల వ్యయంతో పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ వసతి గృహంలో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్నం భోజనంపై కొందరు ఉద్దేశపూర్వకంగా గొడవలు సృష్టించి ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నా రని, సోషల్ మీడియాలో అవాస్తవాలను ప్రచారం చేస్తూ ప్రజలలో ఆందోళనలు కలిగిస్తున్నారని, ఈ విషయాన్ని ప్రభుత్వం పరిగణలోకి తీసుకుని కఠిన చర్యలు చేపడతామని తెలిపారు. చెన్నూర్ పట్టణంలో రహదారి విస్తరణలో వ్యాపారులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చారని,1 కోటి 60 లక్షల రూపాయల డి.ఎం.ఎఫ్.టి నిధులతో బైపాస్ రోడ్డు నిర్మించడం జరుగుతుందని, 1 కోటి 20 లక్షల రూపాయల వ్యయంతో నిర్మిస్తున్న 20 షాపులలో పేద వ్యాపార స్తులకు ప్రాధాన్యత ఇచ్చి కేటాయించడం జరుగుతు ందని తెలిపారు.జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ...12 కోట్ల రూపాయల సి.ఎస్.ఆర్. నిధులతో చెన్నూర్ నియోజకవర్గంలో రహదారులు, మురుగు కాలువల ఏర్పాటుకు చర్యలు తీసుకోవడంతో పాటు అన్ని గ్రామాలలో రహదారులు, మురుగు కాలువల వ్యవస్థ అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. సి.సి. మురుగు కాలువలలో మ్యాజిక్ సోక్ ఫీట్ ఏర్పాటుకు కృషి చేస్తున్నామని, తద్వారా భూగర్భ జల శాతాన్ని పెంపొందించే విధంగా చర్యలు చేపడుతున్నామని తెలిపారు.డిఎంఎఫ్ టి,సిఎస్ ఆర్ నిధులతో భీమారంలో అభివృద్ధి పనులు చేపట్టి ఆదర్శ గ్రామపంచాయతీగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. మైనారిటీ సంక్షేమ వసతి గృహంలో మధ్యాహ్న భోజనం విషయంలో ఏర్పడిన గందరగోళంలో ఎలాంటి వాస్తవం లేదని, కొంతమంది ఉద్దేశపూర్వకంగా పిల్లలతో అబద్ధాలు చెప్పించారని, సంబంధిత వ్యక్తులపై క్రిమినల్ చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు. విద్యారంగంలో మంచిర్యాల జిల్లా 3వ స్థానంలో ఉందని, జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు,సంక్షేమ వసతి గృహాలు, కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాలు, ఆదర్శ పాఠశాలలు ఇతర ప్రభుత్వ సంబంధిత విద్యా సంస్థలలో ఈ సంవత్సరం నో అడ్మిషన్ బోర్డులు పెట్టడం జరిగిందని తెలిపారు. ఈ విద్యా సంవత్సరంలో 3 వేల మంది విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలల నుండి ప్రభుత్వ పాఠశాలలలో చేరారని తెలిపారు. ప్రభుత్వం విద్య, వైద్య రంగాల అభివృద్ధి ప ప్రత్యేక దృష్టి సారిస్తుందని, విద్యాసంస్థలలో సి.సి. కెమెరాల తో పర్యవేక్షించడం జరుగుతుందని, విద్యార్థులకు 200 శాతం కాస్మోటిక్, 40 శాతం డైట్ చార్జీలు పెంచి అందించడం జరుగుతుందని, కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాలు, ఆశ్రమ పాఠశాలలో విద్యార్థుల సౌకర్యార్థం భోజనశాలలు,అదనపు తరగతి గదులు నిర్మించడం జరుగుతుందని, ఆర్.ఓ. ప్లాంట్లు ఏర్పాటుచేసి శుద్ధమైన త్రాగునీటిని అందిస్తున్నామని తెలిపారు.అనంతరం చెన్నూర్ మండలం కిష్టంపేట గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారు నిర్మించుకున్న ఇంటిని జిల్లా కలెక్టర్, అధికారులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి మాట్లాడుతూ...చెన్నూరు నియోజకవర్గానికి 3 వేల 500 ఇండ్లు మంజూరు చేయడం జరిగిందని, ఇప్పుడు మరో 2 వేల ఇండ్లు మంజూరు చేయడం జరిగిందని, అర్హత గల ప్రతి ఒక్కరికి కేటాయించడం జరుగుతుందని తెలిపారు.రాష్ట్రంలో పెంకుటిల్లు లేకుండా ప్రతి ఒక్కరికి పక్కా ఇల్లు ఉండే విధంగా ప్రభుత్వం అర్హులకు ఇందిరమ్మ ఇల్లు కేటాయిస్తుందని, పెంకుటిల్లు గల అర్జీదారులు చేసుకున్న దరఖాస్తును మండల పరిషత్ అభివృద్ధి అధికారులు పరిశీలించి ఫోటోలు తీసుకుని అర్హత ప్రమాణాలు పరిశీలించి ఇల్లు కేటాయించాలని తెలిపారు.రాష్ట్రంలో ఇసుక మాఫియా అరికట్టడంపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా ప్రభుత్వంలో సంక్షేమం అభివృద్ధి రెండింటికీ సమ ప్రాధాన్యత

ప్రజా ప్రభుత్వం ఏర్పడి రెండున్నరేళ్లు లలోనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో సంక్షేమం, అభివృద్ధి రెండింటికీ సమ ప్రాధాన్యత ఇస్తున్నామని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు. ఆదివారం సత్తుపల్లి నియోజకవర్గంలో మంత్రి విస్తృతంగా పర్యటించారు. ముందుగా కల్లూరు మండలం చిన్నకోరుకొండ గ్రామంలో రూ.5 కోట్ల అంచనా వ్యయంతో నిర్మాణం చేపడుతున్న చిన్నకోరుకొండి - కిష్టారం మరియు వైరా - నెమలి రహదారులు మధ్య ఉన్న లింక్ రోడ్ కు, తర్వాత రూ. 6కోట్ల 30లక్షల వ్యయంతో లోకవరం పెనుబల్లి రహదారి పై హైలెవల్ బ్రిడ్జి పనులకు ఆనతరం నగరాభివృద్ధి లో భాగంగా కల్లూరు ప్రధాన రహదారి లో రూ.93 లక్షల అంచనా వ్యయంతో చేపట్టిన స్ట్రామ్ వాటర్ డ్రైన్ నిర్మాణ పనులకు, అలాగే తిరువూరు ఎక్స్ రోడ్ కల్లూరు జంక్షన్ వద్ద రూ.8కోట్ల 60 లక్షల అంచనా వ్యయంతో ఖమ్మం నుండి అశ్వరావు పేట జాతీయ రహదారి జంక్షన్ అభివృద్ధి పనులకు జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్, సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్ లతో కలిసి మంత్రి శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ ప్రజల విశ్వాసంతో ఏర్పడిన ఈ ప్రభుత్వం పేదల సంక్షేమం, మహిళల సాధికారత, రైతుల అభ్యున్నతి కోసం నిరంతరం పనిచేస్తోందన్నారు. ప్రజలు అందించిన ఆశీస్సులు, దీవెనల వల్లే కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను మాత్రమే కాకుండా, చెప్పని అనేక సంక్షేమ కార్యక్రమాలను కూడా ప్రజల ఇంటి ముంగిటకు తీసుకెళ్తోందని మంత్రి తెలిపారు. పేదల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ప్రతి కుటుంబం అభివృద్ధి చెందేలా పాలన కొనసాగుతోందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ప్రతి అర్హత కుటుంబానికి 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తున్నామని, గతంలో పేదలకు అందని సన్న బియ్యాన్ని ఇప్పుడు రేషన్ ద్వారా పంపిణీ చేస్తున్నామని పేర్కొన్నారు. పదేళ్లుగా కొత్త రేషన్ కార్డులు ఇవ్వని పరిస్థితిని మార్చి అర్హులందరికీ రేషన్ కార్డులు మంజూరు చేస్తున్నామన్నారు. పేదల చిరకాల స్వప్నమైన సొంత ఇంటిని సాకారం చేసేందుకు ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలు చేస్తున్నామని తెలిపారు. మొదటి విడతలో ప్రతి నియోజకవర్గానికి సుమారు 3,500 ఇళ్లు, రెండో విడతలో మరో 2,000 ఇళ్లు మంజూరు చేశామని, అనంతరం కూడా దశలవారీగా అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇళ్లు అందజేస్తామని స్పష్టం చేశారు. రైతుల సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని పేర్కొంటూ, రూ.2 లక్షల వరకు రైతు రుణమాఫీ అమలు చేశామని తెలిపారు. రైతు భరోసా పథకం కింద అర్హులైన రైతుల ఖాతాల్లో తొలి విడతగా రూ.6 వేల చొప్పున టిగ్..టిగ్ అనె మెసేజ్ ద్వారా జమ అవుతున్నాయని, రెండు మూడు రోజుల్లో పూర్తిగా అందరికీ జమ అవుతాయని వెల్లడించారు. రైతు పండించిన ప్రతి ధాన్యపు గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తోందని, సన్న ధాన్యం సాగు చేసిన రైతులకు క్వింటాల్‌కు రూ.500 ప్రోత్సాహకం అందిస్తున్నామని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా మహిళల ఆర్థిక సాధికారతకు ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ రూపొందించిందని, కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దే దిశగా ప్రణాళికాబద్ధంగా కార్యక్రమాలు అమలు చేస్తున్నామని మంత్రి తెలిపారు. తాను కల్లూరు మండలంలో పుట్టి పెరిగిన వ్యక్తినని, పాలేరు నియోజకవర్గానికి ఎమ్మెల్యేగా ఉన్నప్పటికీ సత్తుపల్లి నియోజకవర్గం కూడా తన సొంత ప్రాంతమేనని అన్నారు. ఈ ప్రాంత అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తానని, ఇప్పటికే సుమారు రూ.15 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశామని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమాన్ని రెండు కళ్లుగా భావించి పాలన సాగిస్తోందని మంత్రి పేర్కొన్నారు. ఈ రూ.15 కోట్ల పనులతోనే అభివృద్ధి ఆగిపోదని, కొత్త మున్సిపాలిటీ అవసరాలను దృష్టిలో ఉంచుకొని భవిష్యత్తులో మరిన్ని నిధులు కేటాయించి ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పిస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి హామీ ఇచ్చారు. పేదల అభివృద్ధి కోసం చిత్తశుద్ధితో పనిచేస్తున్న ప్రజా ప్రభుత్వానికి ప్రజల ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమాల్లో ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## కన్నెపల్లి పర్యటన: కేటీఆర్ కాన్వాయ్‌ను అడ్డుకున్న పోలీసులు

దీంతో అక్కడ కొద్దిసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఆదివారం మధ్యాహ్నం కేటీఆర్ తన పర్యటనలో భాగంగా భారీ సంఖ్యలో వాహనాలతో కూడిన కాన్వాయ్‌తో కన్నెపల్లికి బయలుదేరారు. అయితే, ఇంత పెద్ద కాన్వాయ్‌కు అనుమతి లేదని పోలీసులు పెంబర్తి వద్ద వాహనాలను నిలిపివేశారు. దీనిపై బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు పోలీసులతో వాగ్వాదానికి దిగారు. ఈ క్రమంలో కేటీఆర్ జోక్యం చేసుకుని, తన కాన్వాయ్‌లోని అన్ని వాహనాలను అనుమతించాల్సిందేనని పట్టుబట్టారు. కాన్వాయ్‌ను నిలిపివేయడంపై ఆయన పోలీసు అధికారులతో మాట్లాడారు. కొద్దిసేపటి చర్చల తర్వాత పోలీసులు వెనక్కి తగ్గడంతో, కేటీఆర్ కాన్వాయ్ యథావిధిగా కన్నెపల్లి పంప్‌హౌస్ వైపు తన పర్యటనను కొనసాగించింది.

## అర్హులైన ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇల్లు

ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల దంపతులకు మంత్రి జూపల్లి కృష్ణారావు నూతన వస్త్రాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కొత్త ఇంటిలో కుటుంబ సభ్యులు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షించారు. కులం, మతం, వర్గం, రాజకీయ అనుబంధం చూడకుండా అర్హులైన ప్రతి పేదవారికి ఇందిరమ్మ ఇల్లు అందజేస్తున్నామని చెప్పారు.ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ప్రభుత్వం వెచ్చిస్తోందన్నారు. పేదల సొంతింటి కలను సాకారం చేయడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని, ఇందిరమ్మ ఇండ్ల పథకం ద్వారా వేలాది కుటుంబాలకు శాశ్వత గృహ భద్రత కల్పిస్తున్నామని మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి హనుమంతు నాయక్ కుడికిల్ల సర్పంచ్ రఘుపతిరావు, తొమ్మిదవ వార్డు కాంగ్రెస్ పార్టీ నాయకులు మతిన్, కృష్ణ, మస్తాన్, అహ్మద్, జంబులు, షాకీర్,అజ్మత్ తదితరులు పాల్గొన్నారు.

## సర్కారు బడుల వైపు ప్రజల అడుగులు..

జగిత్యాల జిల్లాలోనే 13 ప్రభుత్వ పాఠశాలలు తిరిగి ప్రారంభమయ్యాయి. గ్రామ పంచాయతీ పాలకవర్గాలు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు, తల్లిదండ్రులు ప్రత్యేక చొరవ తీసుకుని విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో అందిస్తున్న నాణ్యమైన విద్య, మెరుగైన మౌలిక సదుపాయాలు, సంక్షేమ పథకాలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నారు. కొన్ని గ్రామాల్లో ప్రభుత్వ బడుల్లో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు ప్రైవేట్ పాఠశాలల బస్సులు గ్రామాల్లోకి రాకుండా అడ్డుకునే స్థాయిలో ప్రజలు ముందుకొస్తున్నారు. సర్కారీ బడుల అభివృద్ధికి గ్రామస్థులు స్వచ్ఛందంగా సహకరిస్తూ విద్యా విప్లవానికి శ్రీకారం చుడుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల పునరుద్ధరణకు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తుండటంతో రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై ప్రశంసల జల్లు కురుస్తోంది. ప్రభుత్వ విద్యా వ్యవస్థపై పెరుగుతున్న విశ్వాసం తెలంగాణలో విద్యా రంగానికి కొత్త ఊపునిస్తూ, సర్కారు బడుల భవిష్యత్తుకు బలమైన పునాది వేస్తోంది.

## తెలంగాణలో పెన్షన్ల స్కామ్‌కు చెక్..

మరింత దారుణమైన విషయం ఏమిటంటే.. కొన్నేళ్ల క్రితం మరణించిన లబ్ధిదారుల పేర్లను జాబితా నుంచి తొలగించకుండా, వారి స్థానంలో కొందరు అక్రమార్కులు అధికారుల కళ్లుగప్పి నెలనెలా డబ్బులు డ్రా చేస్తున్నట్లు క్షేత్రస్థాయి పరిశీలనలో తేలింది. ఈ భారీ అవినీతిని అరికట్టేందుకు ప్రభుత్వం అత్యాధునిక సాంకేతికతను ఆయుధంగా ప్రయోగించింది. లబ్ధిదారులు జీవించి ఉన్నారో లేదో నిర్ధారించే 'లైఫ్ అథెంటికేషన్' ప్రక్రియను రాష్ట్రవ్యాప్తంగా తప్పనిసరి చేయడంతో దొంగ పెన్షన్ల దందా బట్టబయలైంది. ఈ డిజిటల్ వెరిఫికేషన్ ద్వారా మరణించిన వారి వివరాలు, ఇతర అనర్హుల సమాచారం స్పష్టంగా వెల్లడైంది. దీంతో తక్షణమే స్పందించిన ఉన్నతాధికారులు, గుర్తించిన లక్ష మంది అనర్హుల పేర్లను లబ్ధిదారుల జాబితా నుంచి శాశ్వతంగా తొలగించాలని తుది నిర్ణయం తీసుకున్నారు. ఈ ప్రక్షాళనతో ప్రభుత్వ ఖజానాకు ప్రతి నెలా వృథాగా పోతున్న కోట్ల రూపాయల ప్రజాధనం ఆదా కానుంది. అయితే, అనర్హుల తొలగింపు ద్వారా మిగిలే నిధులను నిజమైన లబ్ధిదారులకే అందించాలని ప్రభుత్వం స్పష్టమైన నిర్ణయం తీసుకుంది. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా కొత్తగా 2 లక్షల మంది అర్హులకు పెన్షన్లు మంజూరు చేసేందుకు ప్రక్రియ కొనసాగుతుండగా, దానికి అదనంగా తాజాగా గుర్తించిన లక్ష మంది అనర్హుల స్థానంలో మరో లక్ష మంది కొత్త లబ్ధిదారులను ఎంపిక చేయనున్నారు. దీంతో రాష్ట్రంలో మొత్తం 3 లక్షల మంది నిరుపేదలకు కొత్తగా ఆర్థిక భద్రత లభించనుంది. ఇందుకు అవసరమైన బడ్జెట్ కేటాయింపులు, నిధుల సర్దుబాటుపై రాష్ట్ర ఆర్థిక శాఖ ఇప్పటికే కసరత్తు పూర్తి చేసినట్లు సమాచారం. ప్రభుత్వం తీసుకున్న ఈ చారిత్రాత్మక నిర్ణయం వల్ల ఏళ్ల తరబడి కార్యాలయాల చుట్టూ తిరుగుతున్న వృద్ధులు, ఒంటరి మహిళలు, వితంతువులు, చేనేత, గీత కార్మికులు, ఎయిడ్స్ బాధితులు, దివ్యాంగుల్లో సరికొత్త ఆశలు చిగురించాయి. ప్రస్తుతం గ్రామ, వార్డు స్థాయిల్లో అర్హులను గుర్తించే సర్వే ప్రక్రియ ముమ్మరంగా సాగుతోంది. అర్హుల వడపోత ప్రక్రియ తుది దశకు చేరుకుందని, త్వరలోనే లబ్ధిదారుల తుది జాబితాను అధికారికంగా విడుదల చేసి, కొత్త పెన్షన్ల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు సచివాలయ ఉన్నత వర్గాలు వెల్లడించాయి.

## ప్రతి 12 ఏళ్లకోసారి శివలింగంపై పిడుగు పడుతుంది..

మన దేశంలో ఎన్నో పురాతన దేవాలయాలు తమ చరిత్ర, ఆధ్యాత్మికత, రహస్యాలతో భక్తులను, పరిశోధకులను ఆశ్చర్యపరుస్తుంటాయి. అలాంటి అద్భుత క్షేత్రాల్లో ఒకటి హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రం కుల్లు జిల్లాలో ఎత్తైన పర్వత శిఖరంపై వెలసిన 'బిజ్లీ మహాదేవ ఆలయం'. 'దేవభూమి'గా ప్రసిద్ధి చెందిన హిమాచల్‌లోని ఈ శివాలయం ప్రకృతి సోయగాలతో పాటు ఒక ఆశ్చర్యకరమైన విశేషం వల్ల ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందింది.ప్రతి 12 ఏళ్లకు ఒకసారి శివలింగాన్ని తాకే పిడుగు స్థానిక విశ్వాసాల ప్రకారం, సుమారు ప్రతి 12 సంవత్సరాలకు ఒకసారి భారీ పిడుగు నేరుగా ఆలయంలోని శివలింగంపై పడుతుంది. ఆ పిడుగుపాటు తీవ్రతకు గర్భగుడిలో ప్రతిష్ఠించిన శివలింగం అనేక ముక్కలుగా విరిగిపోతుంది. అయితే ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే... అంతటి శక్తివంతమైన పిడుగుపాటు జరిగినా ఆలయ నిర్మాణానికి మాత్రం ఎలాంటి నష్టం జరగదని భక్తులు చెబుతారు. భక్తుల నమ్మకం ఇదే... ఈ అద్భుతం వెనుక స్థానికులు ఒక బలమైన విశ్వాసాన్ని కలిగి ఉన్నారు. గ్రామ ప్రజలను, పరిసర ప్రాంతాలను పిడుగుపాటు నుంచి కాపాడేందుకు పరమశివుడే ఆ మెరుపు శక్తిని తనపైకి స్వీకరిస్తాడని వారు నమ్ముతారు. అందుకే ఈ ఆలయాన్ని 'బిజ్లీ మహాదేవ్' (పిడుగు మహాదేవుడు)గా పూజిస్తారు.

## కుప్పంలో సీఎం చంద్రబాబు డబుల్ ఫోకస్

**పేదరికంపై పీ4 అస్త్రం** పేదల జీవితాలను బంగారు మయం చేయాలనే లక్ష్యంతోనే పీ4 విధానాన్ని అమలు చేస్తున్నామని చంద్రబాబు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమం కింద ఎంపిక చేసిన 'బంగారు కుటుంబాల' ఆర్థిక, సామాజిక అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయమన్నారు. ఈ సమావేశంలో బంగారు కుటుంబాలను దత్తత తీసుకున్న మెగా, అదానీ, టీవీఎస్ మోటార్స్ సంస్థల ప్రతినిధులు కూడా పాల్గొన్నారు. "బంగారు కుటుంబాలు కేవలం ప్రభుత్వ సాయంపై ఆధారపడకూడదు. ఆర్థికంగా ఎదిగి ఇతరులకు సాయం చేసే స్థాయికి చేరుకోవాలి. ఇందుకోసం మార్గదర్శులు, బంగారు మిత్రలు ప్రతి కుటుంబాన్ని అధ్యయనం చేసి, వారి అవసరాలకు అనుగుణంగా కార్యాచరణ రూపొందించాలి," అని సీఎం సూచించారు. సమాజంలోని ఉన్నత వర్గాల్లోని 10 శాతం మంది, పేదరికంలో ఉన్న 20 శాతం కుటుంబాలకు అండగా నిలవాలనే 'ఎంబీకే10:20' నమూనాతో ఈ కార్యక్రమాన్ని రూపొందించినట్లు వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటికే 12 లక్షల బంగారు కుటుంబాలను గుర్తించగా, వారికి చేయూతనివ్వడానికి 1.10 లక్షల మంది మార్గదర్శులు

# ఏ క్షణమైనా కూలవచ్చును..!





**శిథిలావస్థలో ఏఓ కార్యాలయం**

**పట్టించుకోని ఉన్నతాధికారులు**

**పిచ్చులూడిపడి పలుమార్లు సిబ్బందికి గాయాలు..**

**నంద్యాల రూరల్, జూలై05, (నంది పత్రిక):-** స్థానిక నూనెపల్లె సమీపంలోని నంద్యాల మండల వ్యవసాయ కార్యాలయం శిథిలావస్థకు చేరుకుంది. చుట్టుపక్కల గ్రామాల నుంచి రైతులు మండల కార్యాలయం కు వివిధ పనుల నిమిత్తం వస్తూ ఉంటారు. అయితే ఈ శిథిలావస్థకు చేరుకున్న భవనాన్ని చూసి రైతులు భయాందోళనకు గురవుతున్నారు. గతంలో ఈ కార్యాలయంలో పై పెచ్చులూడి పలువురు సిబ్బందికి అలాగే రైతులకు గాయాలు అయినట్లు సిబ్బంది ద్వారా తెలుస్తుంది. అయినప్పటికీ ఉన్నత అధికారులు స్పందించకపోవడం గమనార్హం. కూత వేస్తే వినపడేంత దూరంలో జిల్లా కలెక్టర్ కార్యాలయం ఉండడం అలాగే జిల్లా వ్యవసాయ కార్యాలయం ఉండటం గమనర్హం. నిత్యం ఉన్నతాధికారులు ఈ కార్యాలయం వైపు నుంచి చూస్తూ వెళుతుంటారు. కానీ ఈ కార్యాలయం స్థానంలో నూతన భవనాన్ని నిర్మించాలని అధికారులకు ఏమాత్రం పట్టడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.నంద్యాల మండల వ్యవసాయ అధికారి కార్యాలయం ఈ విధంగా ఉండటం సిగ్గుచేటని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిత్యం రైతులతో కిటకిటలాడే

ఈ వ్యవసాయ కార్యాలయం ఎప్పుడూ ఎటువంటి ప్రమాదాన్ని గురిచేస్తుందో అని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏదైనా ప్రమాదం జరగకముందే అధికారుల అప్రమత్తమై నూతన భవనం నిర్మించాలని రైతులు కోరుతున్నారు.

# గురు రాఘవేంద్ర భారత్ గ్యాస్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం





**బండి ఆత్మకూరు నంది పత్రిక జూలై 5 :** తలసేమియాచిన్నారులను ఆదుకునేందుకుగాను గురురాఘవేంద్ర భారత్ గ్యాస్ ఆధ్వర్యంలో బండి ఆత్మకూరులో ఆదివారం రక్త దాన శిబిరాన్ని నిర్వహించారు. నంద్యాల జిల్లా వై ఎస్ ఆర్ పార్టీ మహిళా అధ్యక్షురాలు రాజాంరెడ్డి సుజాతమ్మ నేతృత్వంలో భారత్ గ్యాస్ ఎం డి రాజాంరెడ్డి మనోహర్ రెడ్డి ఆధ్వర్యంలో మెగా రక్త దాన శిబిరాన్ని నిర్వహించారు.బండిఆత్మకూరు మండలంలోని చుట్టు ప్రక్కల గ్రామాల నుండి యువకులు పెద్దఎత్తున పాల్గొని రక్త దాన కార్యక్రమంలో పాలుపంచు కున్నారు. బండిఆత్మకూరు పోలీస్ స్టేషన్లో పనిచేస్తున్న కానిస్టేబుళ్ళు మస్తాన్ రెడ్డి, సురేష్, మనోహర్, ఇప్పటికే అనేక మార్లు రక్త దానం చేశారు. తిరిగి బండిఆత్మకూరులో జరిగిన రక్త దాన శిబిరంలో రక్తదానం చేశారు. ఇలా పోలీసులు అని ఏమిటి, భారత్ గ్యాస్ కంపెనీలో పని చేస్తున్న యువకులతో పాటు, మీసేవ నిర్వాహకుడు శ్రావణ్ కుమార్, రిజిస్టర్ ఆఫీసులో పనిచేసే ముంతల రమేష్, మండల సాక్షి దినపత్రిక విలేకరి దస్తగిరి, ఇలా ఎందరో రక్తదానం చేశారు. శిబిరంలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి భారత్ గ్యాస్ నిర్వాహకులు మనోహర్ రెడ్డి కృతజ్ఞతలు తెలియజేశారు. దాతల నుండి సేకరించిన రక్తాన్ని, తల సేమియా బాధితులకు, రక్తహీనత కలిగిన గర్భిణీ స్త్రీలకు వినియోగించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో నంద్యాల బ్లడ్ బ్యాంక్ నిర్వాహకులు అచ్యుత్, హుస్సేన్ వలి, మురళి, డాక్టర్ షణ్ముఖ, బ్లడ్ బ్యాంక్ ఇబ్బంది శివ మనోహర్ పాల్గొన్నారు.





# ఘనంగా నంద్యాల లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం






**నూతన అధ్యక్ష కార్యదర్శులుగా సందీప్,మేడా చంద్రశేఖర్,కోశాధికారిగా సురేష ప్రమాణ స్వీకారం చేశారు.**

**నంద్యాల లయన్స్ క్లబ్ సేవలు ప్రశంసనీయం: డాక్టర్ రామకృష్ణారెడ్డి, న్యాయవాది వెదుర్ల రామచంద్రరావు.**

**నూతన కార్యవర్గంతో ప్రమాణ స్వీకారం చేయించిన వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ రవి కృష్ణ.**

**నంద్యాల సిటీ బ్యూరో జులై 5 ( నంది పత్రిక )** నంద్యాల లయన్స్ క్లబ్ 2026- 27 వ సంవత్సరానికి నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం స్థానిక రామకృష్ణ పీజీ కళాశాల ఆడిటోరియంలో ఘనంగా జరిగింది.ఈ కార్యక్రమంలో రామకృష్ణ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ రామకృష్ణారెడ్డి, ప్రముఖ న్యాయవాది వెదుర్ల రామచంద్రరావు విశిష్ట అతిథులుగా పాల్గొన్నారు. లయన్స్ క్లబ్ జిల్లా వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్. జి.రవి కృష్ణ నూతన కార్య వర్గంతో ప్రమాణ స్వీకారం చేయించారు.నూతన అధ్యక్షులుగా సందీప్,కార్యదర్శిగా మేడా చంద్రశేఖర్,కోశాధికారిగా సురేష్ పదవీ ప్రమాణ స్వీకారం చేశారు.వివిధ పదవులకు,వివిధ కార్యక్రమాల సబ్ కమిటీ చైర్మన్ లుగా పలువురు సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు.కొత్తగా లయన్స్ క్లబ్ లో చేరిన సభ్యులతో డాక్టర్ సహదేవుడు సభ్యత్వ ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా డాక్టర్ రామకృష్ణారెడ్డి, వెదుర్ల రామచంద్రరావు మాట్లాడుతూ లయన్స్ క్లబ్ సభ్యులు సేవా తత్పరతతో, అంకితభావంతో, నిస్వార్థంగా సేవలు అందిస్తున్నారని ప్రశంసించారు. ఆరోగ్య రక్షణ, విద్యా, స్వయం ఉపాధి కార్యక్రమాలు ప్రధాన ధ్యేయంగా లయన్స్ క్లబ్ పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ సంవత్సరం కూడా ప్రజలకు నిరంతరం విస్తృత సేవా కార్యక్రమాలు నూతన కార్యవర్గం నిర్వహించాలని కోరారు. డాక్టర్ రవి కృష్ణ మాట్లాడుతూ 206 దేశాలలో, 50 వేల క్లబ్ లలో 14 లక్షల మంది పైగా లయన్స్ సభ్యులతో అంతర్జాతీయ లయన్స్ క్లబ్ సేవా సంస్థ ప్రపంచవ్యాప్తంగా ప్రజలకు సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నదని తెలిపారు. "సర్వేజనా సుఖినోభవంతు" అని అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా ఉండాలని, "పరోపకారార్థం ఇదం శరీరం" అని ఇతరులకు సేవ చేయడం కోసమే మానవ జన్మ అని చాటిచెప్పిన భారతీయ సంస్కృతి అందించిన సేవా స్ఫూర్తితో నంద్యాల లయన్స్ క్లబ్ సేవా కార్యక్రమాలు 56 సంవత్సరాలుగా నిర్వహిస్తున్నారని తెలిపారు. నూతన అధ్యక్షుడు సందీప్, కార్యదర్శి మేడా చంద్రశేఖర్ మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలకు ఉపయోగపడే రీతిలో వివిధ సేవా కార్యక్రమాలను ఈ సంవత్సరం చేయడానికి ప్రణాళిక రూపొందిస్తున్నామని, నంద్యాల లయన్స్ క్లబ్ పేరు ఇనుమడింప చేస్తామన్నారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గం అతిథులు డాక్టర్ రామకృష్ణారెడ్డి వెదుర్ల రామచంద్రరావు, వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ రవి కృష్ణ, డాక్టర్ సహదేవుడు,గత సంవత్సరం అధ్యక్ష కార్యదర్శులు గా సేవలు అందించిన సోమేశుల నాగరాజు, తాతి రెడ్డి భాస్కర్ రెడ్డి,కోశాధికారి అమిదేల జనార్ధన్, రీజియన్ చైర్మన్ సుధాకర్ రెడ్డి, జోనల్ చైర్మన్ నిజాముద్దీన్ లను ప్రత్యేక జ్ఞాపికలు, శాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో రీజియన్ చైర్మన్ సుధాకర్ రెడ్డి, జోనల్ చైర్మన్ నిజాముద్దీన్ నంద్యాల లయన్స్ క్లబ్ సీనియర్ సభ్యులు ఆంజనేయులు గుప్తా,రవి ప్రకాష్,భవనాసి నాగ మహేష్, కశెట్టి చంద్రశేఖర్,కశెట్టి వేణుమాధవ్, మహేశ్వర రెడ్డి, కన్నయ్య అధిక సంఖ్యలో లయన్స్ క్లబ్ సభ్యులు కుటుంబాల తో పాటు పాల్గొన్నారు.

# గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి.

**మృతుడు వెంకటశెట్టిపల్లి గ్రామానికి చెందిన దొంతి రెడ్డి తిరుపాల్ రెడ్డి.**



**మర్రిపాడు జూలై 5 నంది పత్రిక:** మర్రిపాడు మండల పరిధిలోని రాజధాని టు రాయలసీమ జాతీయ రహదారి నాగినేని గుంట గ్రామ సమీపంలో బుధవారం నాడు గుర్తుతెలియని వాహనం ఢీకొని అర్ధరాత్రి సమయంలో ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో కడప జిల్లా బద్వేలు నియోజకవర్గం వెంకటశెట్టిపల్లి గ్రామానికి చెందిన దొంతి రెడ్డి తిరుపాల్ రెడ్డి అనే వ్యక్తి కి తీవ్ర గాయాలు కాగా అత్యవసర చికిత్స కొరకు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు ప్రమాదంలో బలమైన గాయాలు తగలగా కోమాలోకి వెళ్లి తదుపరి మరణించినట్లు వైద్యులు ధ్రువీకరించారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీస్ సిబ్బంది కేసు నమోదు చేసి ప్రమాదానికి గల కారణాలను తెలుసుకుంటున్నారు.

# నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక



**నంద్యాల బ్యూరో, జులై 05(నంది పత్రిక):-** జిల్లా ప్రజల సమస్యలను సత్వరంగా పరిష్కరించి, ప్రజలకు ప్రభుత్వ సేవలను మరింత సమర్థవంతంగా అందించాలనే లక్ష్యంతో నేడు (సోమవారం) జిల్లా వ్యాప్తంగా "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమం జిల్లా కలెక్టరేట్‌తో పాటు అన్ని రెవెన్యూ డివిజన్ కార్యాలయాలు, మండల పరిషత్ కార్యాలయాలు మరియు మున్సిపల్ కార్యాలయాల్లో ఒకేసారి నిర్వహించబడుతుందని తెలిపారు. కార్యక్రమాన్ని ఉదయం 9:30 గంటల నుంచి మధ్యాహ్నం వరకు నిర్వహించనున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు. ప్రజలు తమ సమస్యలకు సంబంధించిన వినతిపత్రాలను నేరుగా అధికారులకు సమర్పించవచ్చని, అలాగే వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో కూడా ఫిర్యాదులు నమోదు చేసుకునే అవకాశం కల్పించబడిందని తెలిపారు. సమర్పించిన అర్జీల పరిష్కార స్థితిని అదే వెబ్‌సైట్‌లో లేదా టోల్ ఫ్రీ నంబర్ 1100 ద్వారా తెలుసుకోవచ్చన్నారు. అర్జీదారులు తమ సమస్యలకు సంబంధించిన వినతులను ముందుగా మండల, డివిజన్ లేదా మున్సిపల్ స్థాయి కార్యాలయాల్లో సమర్పించి, అక్కడ పరిష్కారం కాని అంశాలను మాత్రమే జిల్లా స్థాయి ప్రజా సమస్యల పరిష్కార వేదిక దృష్టికి తీసుకురావాలని కలెక్టర్ సూచించారు. జిల్లా కేంద్రంలో ఉదయం 9:30 గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమానికి అన్ని శాఖల జిల్లా స్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరై ప్రజల వినతులను స్వీకరించి, వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు.

# పాణ్యం లో వజ్రప్రహార్





**కార్యక్రమం లో భాగంగా**

**కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ ...**

**ప్రజలకు విస్తృత అవగాహన...**

**నంద్యాల క్రైం, జులై05(నంది పత్రిక):-** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం గంజాయి మరియు ఇతర మాదక ద్రవ్యాల అక్రమ రవాణా, విక్రయం, వినియోగాన్ని అరికట్టేందుకు చేపట్టిన "వజ్రప్రహార్" ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా, నంద్యాల జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో పాణ్యం మండలంలో విస్తృత తనిఖీలు మరియు అవగాహన కార్యక్రమాలు నిర్వహించబడ్డాయి. నంద్యాల జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ ఆదేశాలు, నంద్యాల సబ్ డివిజన్ అడిషనల్ ఎస్పీ కుమారి ఎం జావళి పర్యవేక్షణలో, పాణ్యం సీఐ కిరణ్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో, పాణ్యం ఎస్సై నరేంద్ర కుమార్ రెడ్డి మరియు పోలీసు సిబ్బంది పాణ్యం మండలంలోని చెంచు కాలనీలో కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన ప్రజా అవగాహన సమావేశంలో మాదక ద్రవ్యాల నివారణ, రోడ్డు భద్రత మరియు రోడ్డు ప్రమాదాల నివారణ, బాల్య వివాహాల నిర్మూలన, సైబర్ నేరాలు, లోన్ యాప్ మోసాలు తదితర ప్రజా భద్రతకు సంబంధించిన అంశాలపై గ్రామస్థులకు సమగ్ర అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రజలు చట్టాలను గౌరవిస్తూ, మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని,

అనుమానాస్పద వ్యక్తులు లేదా అక్రమ కార్యకలాపాల గురించి వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. అదేవిధంగా, చెడు ప్రవర్తన కలిగిన హిస్టరీ షీటర్లను పోలీస్ స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ నేర కార్యకలాపాల్లో పాల్గొనరాదని హెచ్చరించి, సత్ప్రవర్తనతో సమాజంలో ఆదర్శ పౌరులుగా జీవించాలని సూచించారు. ప్రజల సహకారంతో మాదక ద్రవ్యాల నిర్మూలనతో పాటు శాంతిభద్రతల పరిరక్షణకు జిల్లా పోలీసు శాఖ నిరంతరం కట్టుబడి ఉంటుందని పోలీసులు తెలిపారు.

# చౌడేశ్వరి అమ్మవారి దేవస్థానంకు విరాళం

**బనగానపల్లె జులై 5నందిపత్రిక** నందవరం శ్రీ చౌడేశ్వరి అమ్మవారి దేవస్థానం అభివృద్ధి కి ఆదివారం కడప జిల్లా జమ్ములమడుగు వాస్తవ్యులు పల్లా లతకృష్ణ ఆలయ అభివృద్ధి కొరకు రూ.50,116 మరియు వారి కుటుంబ సభ్యులు కీ"శే" పోలీసు చిన్న నారాయణ జ్ఞాపకార్థం వారి కుమారుడు పోలీసు మునిచంద్ర ఆలయ అభివృద్ధి కొరకు రూ.25,116 విరాళమును ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ పి.వి.కుమార్ రెడ్డి ,ఆలయ కమిటీ చైర్మన్ పి.వి. నాగార్జున రెడ్డి సమక్షంలో ఆలయ అర్చక వేదపండితులకు అందచేశారు.



నంది పత్రిక
సోమవారం 06 - 07 -2026

# సంజీవ నగర్ కోదండ రామాలయంలో నూతన షెడ్డు నిర్మాణానికి 5,50,000వేల రూపాయల ఆర్థిక సహకారం అందించిన గోళ్ళ రాజేష్..







**పూర్ణకుంభంతో గోళ్ళ రాజేష్ కు ఘన స్వాగతం పలికిన శ్రీ భగవత్ సేవా సమాజ్ పాలక కమిటీ సభ్యులు.. కలియుగ వరదుడు శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలోని ప్రాంగణంలో గోళ్ళ రాజేష్ కు ఘన సత్కారం.. గోళ్ళ రాజేష్ కు పవిత్ర మంత్రోచ్ఛారణలతో ప్రత్యేక ఆశీర్వచనాలు అందించిన అర్చకులు.. స్వామి వారి తీర్థ ప్రసాదాలతో పాటు స్వామి వారి చిత్రం పటము,శేష వస్త్రాలను గోళ్ళ రాజేష్ కు అందించిన అర్చక స్వాములు..**

**నంద్యాల సిటీ బ్యూరో జులై 5 ( నంది పత్రిక )** పట్టణంలోని స్థానిక సంజీవ్ నగర్ లో వెలసిన శ్రీ కోదండ రామాలయం దేవస్థానం లో భక్తుల సౌకర్యార్థం, వాతావరణ మార్పులతో ఇబ్బంది కలగకుండా ఉండాలని మన ఓపెన్ గ్రౌండ్ కు నూతన శాశ్వత షెడ్డు నిర్మాణానికి తన వంతు సహాయంగా 5,50,000వేల రూపాయల ఆర్థిక సహకారాలు అందించారు నంద్యాల వాసి ప్రముఖ వ్యాపారవేత్త సామాజిక సేవకులు గోళ్ళ రాజేష్ .ఈ కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక అతిథిగా విచ్చేసిన గోళ్ళ రాజేష్ కు దేవస్థాన శ్రీ భగవత్ సేవా సమాజ్ పాలకమండలి కమిటీ సభ్యులు పూర్ణకుంభంతో ఘనస్వాగతం పలికారు.వేద మంత్రోచ్చారణలతో శుభకరంగా అర్చక స్వాములు మేళాలతో దేవస్థాన ఆలయంలోనికి స్వాగతించారు."భూమి పూజకు" విచ్చేసిన భూరి విరాళ దాత, ఆపద్బాంవుడిగా ప్రజలకు మేలు చేసే పలు కార్యక్రమాల రూపశిల్పి నంద్యాల వాసి ప్రముఖ పారిశ్రామికవేత్త గోళ్ళ రాజేష్ కి శ్రీ భగవత్ సేవా సమాజ్ పాలకవర్గ సభ్యుల హృదయపూర్వక ఆత్మీయ స్వాగతం పలికారు.ఈ కార్యక్రమంలో ముందుగా గణపతి ప్రార్ధన నిర్వహించి షెడ్డు నిర్మానం చేపట్టనున్న సందర్భంగా భూమి పూజ పంచలోహ, నవరత్న సమర్పణలతో అర్చకులు మంత్రోచ్చారణలతో శుభకరంగా నిర్వహించారు.అదేవిధంగా దేవస్థానం నందు ప్రతి శనివారం జరిగే శ్రీ వినాయక, శ్రీ సుదర్శన,

శ్రీ ధన్వంతరి హోమంలో గోళ్ళ రాజేష్ ప్రత్యేకంగా పాల్గొన్నారు. అనంతరం కలియుగ వరదుడైన ప్రత్యక్ష దైవం శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి విశేష అర్చనలతో పాటు మహా మంగళ నీరాజనం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో అశేష భక్త జనసదోహం మద్యలో గోళ్ళ రాజేష్ ని దేవస్థాన పాలకవర్గ సభ్యులు ప్రత్యేక పూల మాల, స్వామి వారి శేష వస్త్రంతో పాటు కిరీట దారణను నిర్వహించి ఆ దేవదేవుని ఆశీస్సులు గోళ్ళ రాజేష్ కి ఎల్లవేళలా ఉండాలని పాలకవర్గం వారు ఆకాంక్షిస్తూ ఘనమైన సత్కారాన్ని ఏర్పాటు చేసి గోళ్ళ రాజేష్ పై ఉన్న వారి ప్రేమాభిమానాలను తెలిపారు.







## కె.వి.ఆర్. ఆస్పత్రిలో న్యూరాలజీ, నియోనేటల్, పీడియాట్రిక్ క్రిటికల్ కేర్ యూనిట్ ప్రారంభం

**డాక్టర్ జయ రామ కృష్ణ ఆధ్వర్యంలో ఇంటర్వెన్షనల్ న్యూరాలజీ సెంటర్**
**డాక్టర్ నిత్య ఆధ్వర్యంలో నియోనేటల్, చిన్నపిల్లల క్రిటికల్ కేర్ యూనిట్**
**ప్రారంభించిన డాక్టర్ రవి కృష్ణ**





**నంద్యాల సిటీ బ్యూరో జూలై 5 ( నంది పత్రిక )** నంద్యాల సంజీవనగర్ లో డాక్టర్ సోమశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కె.వి.ఆర్ ఆసుపత్రిలో నూతనంగా న్యూరాలజిస్ట్ డాక్టర్ జయ రామ కృష్ణ ఆధ్వర్యంలో ఇంటర్వెన్షనల్ న్యూరాలజీ విభాగం, నవజాత శిశు మరియు చిన్న పిల్లల వైద్య నిపుణురాలు డాక్టర్ నిత్య ఆధ్వర్యంలో నియోనేటల్ , చిన్నపిల్లల క్రిటికల్ కేర్ యూనిట్ ఆదివారం ఐఎంఏ జాతీయ కేంద్ర కమిటీ సభ్యులు,మాజీ రాష్ట్ర ఐఎంఏ అధ్యక్షులు డాక్టర్ రవి కృష్ణ ప్రారంభించారు. డాక్టర్ మధుసూదనరావు, డాక్టర్ సహదేవుడు, డాక్టర్ మధుసూదన రెడ్డి, డాక్టర్ నాగమణి,డాక్టర్ అనిల్,డాక్టర్ పనిల్ కుమార్ ఓ పి డి విభాగం, న్యూరాలజీ వార్డ్, నియోనేటల్, పీడియాట్రిక్ క్రిటికల్ కేర్ యూనిట్ విభాగాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ జయ రామకృష్ణ, డాక్టర్ నిత్య మాట్లాడుతూ అత్యాధునిక పరికరాలు, వసతులతో ఇంటర్వెన్షనల్ న్యూరాలజీ కేంద్రంలో పక్షవాతం వచ్చిన వారికి చికిత్సలు,నవజాత శిశువుల, చిన్నపిల్లల క్రిటికల్ కేర్ సేవలు అందిస్తామన్నారు. డాక్టర్ రవి కృష్ణ మాట్లాడుతూ నంద్యాలలో అత్యాధునిక వసతులతో న్యూరాలజీ కేంద్రం ఏర్పాటు చేయడం హర్షనీయమన్నారు. అనేకమంది వైద్యులు అన్ని రకాల స్పెషాలిటీ, సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు ఇప్పుడు నంద్యాలలోనే అందిస్తున్నారని,కర్నూల, హైదరాబాదు నగరాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా ప్రజలు ఇక్కడే వైద్య సేవలు పొందుతున్నారని తెలిపారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో డాక్టర్ రాజశేఖర్ రెడ్డి, డాక్టర్ రామ సుబ్బారెడ్డి, డాక్టర్ మురళీకృష్ణ, డాక్టర్ తనూజ, డాక్టర్ వసుధ, డాక్టర్ మాధవి, డాక్టర్ రాకేష్ రెడ్డి అధిక సంఖ్యలో వైద్యులు పాల్గొన్నారు.

## మోత్కూరులో వాల్మీకి మహర్షి విగ్రహ ప్రతిష్ఠాపన..

**తిమ్మనపల్లెలో మినరల్ వాటర్ ప్లాంట్ ప్రారంభం:**
**ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి.**






**వెలుగోడు జులై 05 (నంది పత్రిక):** వెలుగోడు మండలంలో ఆదివారం శాసనసభ్యులు బుడ్డా రాజశేఖర రెడ్డి విస్తృతంగా పర్యటించారు. మండలంలోని మోత్కూరు గ్రామంలో శ్రీ వాల్మీకి మహర్షి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవంలో పాల్గొనడంతో పాటు, తిమ్మనపల్లె గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఆయన ప్రారంభించారు. మోత్కూరు గ్రామంలో జరిగిన శ్రీ వాల్మీకి మహర్షి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవానికి ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేశారు. గ్రామస్తులు, వాల్మీకి సంఘం నాయకులు ఆయనకు పూర్ణకుంభంతో, మంగళవాయిద్యాలతో ఘన స్వాగతం పలికారు. అనంతరం నూతన విగ్రహాన్ని దర్శించుకున్న ఎమ్మెల్యే, వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పవిత్ర రామాయణాన్ని జగత్తుకు అందించిన వాల్మీకి మహర్షి బోధనలు, ఆశయాలు నేటి సమాజానికి ఎంతో ఆదర్శనీయమని కొనియాడారు. మహర్షి ఆశీస్సులు నియోజకవర్గ ప్రజలపై ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు. కీ.శే. దివంగత మాజీ మంత్రి బుడ్డా వెంగళరెడ్డి జ్ఞాపకార్థం, గ్రామ ప్రజల తాగునీటి అవసరాల కోసం ఎమ్మెల్యే తన సొంత నిధులతో తిమ్మన పల్లెలో నూతనంగా ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్‌ను రిబ్బన్ కట్ చేసి ఘనంగా ప్రారంభించారు.గ్రామ ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించాలనే సంకల్పంతోనే ఈ ప్లాంట్‌ను ఏర్పాటు చేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు. మాజీ మంత్రి బుడ్డా వెంగళరెడ్డి నియోజకవర్గ అభివృద్ధికి చేసిన సేవలను ఈ సందర్భంగా పలువురు స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో పెద్ద సుధాకర్ రెడ్డి, రామానాయుడు, రాజు, గ్రామ సర్పంచ్ సుధాకర్ రెడ్డి, పరమేష్‌లతో పాటు తిమ్మనపల్లి గ్రామ నాయకులు శివారెడ్డి, అశోక్, శ్రీను, వాల్మీకి సంఘం ప్రతినిధులు, భక్తులు మరియు టిడిపి నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.



# కూర్చుంటే... కిందపడాల్సిందే...!





**రూరల్ తహసీల్దార్ కార్యాలయ ఆవరణంలో ప్రమాదకరంగా వున్న కుర్చీలు పట్టించుకోని రెవెన్యూ అధికారులు**

**నంద్యాల రూరల్, జూలై,05(నంది పత్రిక):–** నంద్యాల జిల్లా కేంద్రలో రెండు మండల రెవెన్యూ కార్యాలయాలు ఉన్నాయి. అందులో ఒకటి అర్బన్, మరొకటి రూరల్ తహసిల్దార్ కార్యాలయాలలో తహసిల్దారులు విధులు నిర్వహిస్తున్నారు. అయితే రూరల్ మండల రెవెన్యూ కార్యాలయంలో కూర్చోవడానికి గత కొన్ని నెలల క్రితం అర్జీదారులు, ప్రజల కోసం కుర్చీలు ఏర్పాటు చేశారు. ప్రస్తుతముఆ కుర్చీలు ప్రమాదకరంగా మారాయి. ఆ కుర్చీలలో ఎవరైనా కూర్చుంటే కింద పడాల్సిందేనని ఆ కార్యాలయంలో పనిచేసే సిబ్బంది చెబుతుండడం విశేషం. రూరల్ కార్యాలయం ఆవరణంలో సరైన వసతులు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అధికారులు చూసి చూడనట్టు వ్యవహరించడం ఏమిటి అని పలువురు విశ్లేషకులు చర్చించుకుంటున్నారు. ఇప్పటికైన మండల రెవెన్యూ అధికారులు స్పందించి సరైన వసతులు ఏర్పాటు చేయాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. నిత్యం ప్రజలు పలు గ్రామాల నుంచి మండల రెవెన్యూ అధికారుల వద్దకు వస్తూ ఉంటారు. కార్యాలయానికి అధికారులు ఎప్పుడు వస్తారో తెలియక అక్కడ కొంచెం సేపు సేద తీరడానికి కూర్చోవడానికి కూడా కనీసం వసతులు ఏర్పాటు చేయలేని స్థితిలో మండల రెవెన్యూ అధికారులు ఉన్నారంటే వాళ్ళ పనితీరు ఏ విధంగా ఉన్నదో ఒక్కసారి ఉన్నతాధికారులు గమనించవలసిన అవసరం ఉందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు స్పందించి కూర్చుంటే కిందబడే కుర్చీలను తొలగించి వాటి స్థానంలో నూతన కుర్చీలను ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.



# కార్యకర్తలకు అండగా ఉంటాం..



**మాజీ ఎమ్మెల్యే గంగుల**

**చాగలమర్రి , జూలై 5 నంది పత్రిక** కార్యకర్తలకు అన్నివేళలా అందుబాటులో ఉండి ప్రతి సమస్యను పరిష్కరించుటకు అండగా ఉంటానని మాజీ ఎమ్మెల్యే గంగుల బ్రిజేంద్రారెడ్డి అన్నారు. ఆదివారం వివాహ కార్యక్రమానికి హాజరైన సందర్భంగా వైసిపి కార్యకర్త సుబ్బరాయుడు, మరి కొంతమంది ఘనంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా బ్రిజేంద్రారెడ్డి మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో వైయస్ రాజశేఖర్ రెడ్డి ఆశయ సాధనలో భాగంగా మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీ అన్ని వర్గాలలోని పేదలకు చేసిన సంక్షేమ పథకాల గురించి, ఆయన చేసిన అభివృద్ధి గురించి ప్రజలు మరిచిపోలేదన్నారు. రానున్న ఎన్నికల్లో రాజన్న రాజ్యం రాక తప్పదని ఆయన జోష్యం చెప్పారు. గంగుల వెంట వైసీపీ రాష్ట్ర మైనారిటీ విభాగ ప్రధాన కార్యదర్శి షేక్ బాబూలాల్, వివిధ గ్రామ నాయకులు, కార్యకర్తలు, గంగుల అభిమానులు ఉన్నారు.

# 43 ఏళ్ల ఉపాధ్యాయ సేవలకు ముగింపు..

## కోడూరు సుబ్బమ్మకు ఘన పదవీ విరమణ సన్మానం

**పోరుమామిళ్ల , జూలై 5: (నంది పత్రిక):** 43 సంవత్సరాల పాటు ఉపాధ్యాయ వృత్తిలో విశిష్ట సేవలు అందించి 2026 జూన్ 30న పదవీ విరమణ పొందిన కోడూరు సుబ్బమ్మకు సీసీఆర్ కాంప్లెక్స్‌లో ఘన సన్మాన మహోత్సవం నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కె. గంగయ్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు పాల్గొని సుబ్బమ్మ సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా మాట్లాడిన పలువురు వక్తలు, 43 ఏళ్ల ఉపాధ్యాయ జీవితంలో వేలాది మంది విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించి వారిని సమాజంలో ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడంలో సుబ్బమ్మ కీలక పాత్ర పోషించారని తెలిపారు. సహనం, క్రమశిక్షణ, అంకితభావం, ఓర్పుతో విధులు నిర్వహిస్తూ ఉపాధ్యాయులకు ఆదర్శంగా నిలిచారని ప్రశంసించారు. విశిష్ట అతిథిగా హాజరైన పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎం.వి. రామచంద్రారెడ్డి మాట్లాడుతూ, నేటి పరిస్థితుల్లో నాలుగు దశాబ్దాలకు పైగా ఉపాధ్యాయ వృత్తిలో కొనసాగడం ఎంతో గొప్ప విషయమని అన్నారు. పాఠశాల విధులతో పాటు కుటుంబ బాధ్యతలను సమర్థంగా నిర్వహిస్తూ అందరి మన్ననలు పొందడం అభినందనీయమని పేర్కొన్నారు. బీరం శ్రీధర్ రెడ్డి విద్యాసంస్థల అధినేత బీరం సుబ్బారెడ్డి మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన విద్యార్థులు సర్వతోముఖాభివృద్ధి సాధిస్తున్నారని, సమాజంలో ఎలా జీవించాలో ప్రభుత్వ పాఠశాలలే మెరుగైన విలువలను నేర్పుతున్నాయని అన్నారు. చిన్నారులను సెల్‌ఫోన్లు, కంప్యూటర్లు, ల్యాప్‌టాప్‌లకు దూరంగా ఉంచాలనే ఉద్దేశంతో హాస్టళ్లలో చేర్పించడం వల్ల వారి బాల్యం దెబ్బతింటోందని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి ఏ. కొండిశెట్టి, బి. మఠం ఎంఈవో వెంకటేశ్వర్లు, రాజుపాలెం ఎంఈవో ప్రసాద్, ప్రధానోపాధ్యాయులు ఎ. బాల అంకిరెడ్డి, సుమలత, పోలిరెడ్డి, కరిముల్లా, జేమ్స్, సి.వి. రమణ, వాకా చంద్రశేఖర్, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సంటప్ప, మాజీ ఎంఈవోలు రత్నస్వామి, పుల్లయ్య, ఉపాధ్యాయులు వెంగల్ రెడ్డి, హరినాథరెడ్డి, సుమలత, చంద్రశేఖర్, ఓబులమ్మ, రాజగోపాల్, వారణాసి రవి, సిద్దవరం క్లస్టర్ సెక్రటరీ మహానంది, వివిధ సంఘాల నాయకులు బాలరాజు, చంద్రహాసరెడ్డి, పుల్లయ్య, చెన్నయ్య, శ్రీనివాసులు, వెంకటరెడ్డి, అబ్దుల్ హుసేన్, ఈశ్వరరావు, రాంబూపాల్ రెడ్డి, క్లస్టర్ ఉపాధ్యాయులు పాల్గొని కోడూరు సుబ్బమ్మను ఘనంగా సన్మానించారు.



# సర్' ప్రక్రియను సకాలంలో పారదర్శకంగా నిర్వహించండి : తహసిల్దార్.



**శిరివెళ్ల (నంది పత్రిక):** సిరివెళ్ల మండల పరిధిలోని గోవిందపల్లె శిరివెళ్ల వనికందిన్నె జీనపల్లి గుంపురమాను దీన్నే బోయలకుంట్ల తదితర గ్రామాలలో జరుగుతున్నటువంటి స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్(ఎస్ఐఆర్) నమోదు ప్రక్రియను తహసిల్దార్ ఐ విజయశ్రీ మరియు రెవెన్యూ ఇన్స్పెక్టర్ సి రాఘవేంద్ర కుమార్ ఆదివారం వేరువేరు గ్రామాలలో పర్యవేక్షించారు. ప్రత్యేక ఓటరు జాబితా సవరణలో అర్హత కలిగి ఉన్న పౌరుల ఓటు జాబితా నుంచి తప్పిపోకుండా చూడాల్సిన బాధ్యత బీఎల్వోలపై ఉందని తాసీల్దార్ పలు సూచనలు సలహాలతో పాటు అవగాహన కల్పించారు. బీఎల్‌ఓలు, బీఎల్ఎలకు తాసీల్దార్ ఐ విజయశ్రీ ఒక వైపు ప్రత్యేక అవగాహన కల్పిస్తూ మరోవైపు ఫారం ఏ విధంగా నింపాలి ఓటర్ల నుండి ఎటువంటి వివరాలు సేకరించాల్సి ఉందని సూచించారు. బీఎల్‌ఓ, బీఎల్ఎలు సర్ ప్రక్రియలో భాగంగా ఓటరు ఇంటికి వెళ్లిన సమయంలో వారికి ఎన్యుమరేషన్ ఫారాలు అందించి వాటిని అవసరమైతే పూర్తి చేయాలని, దానిపై ప్రత్యేకంగా వారికి అవగాహన కల్పించి దగ్గరుండి తప్పులు లేకుండా ఫారం -నింపేలా చూడాలన్నారు. సర్ ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించినప్పుడే అర్హత కలిగిన పౌరుల ఓట్లు జాబితా నుంచి పోకుండా ఉంటయాన్నారు.బీఎల్‌ఓ, బీఎల్ఎలు ఈ సర్వేను పకడ్బంధీగా నిర్వహించి జిల్లా అధికారులు నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాలన్నారు. కుటుంబంలో ఓటర్ల వివరాలు ఒకే చోట నమోదు చేసే ఫ్యామిలీ మ్యాపింగ్ అత్యంత కీలకమని, 2002 ఓటర్ల జాబితాను ప్రామాణికంగా పరిగణిస్తారని, ఆదార్‌లో ఉన్న వివరాలకు అనుగుణంగానే ఫారం నింపాలని, అవసరమైన డిక్లరేషన్‌పై సంతకం చేయించాలన్నారు. ఎక్కడైనా సమస్యలు ఎదురైతే తమ దృష్టికి తీసుకురావాలని తహసిల్దార్ పేర్కొన్నారు.

# సర్ పై బిజెపి ఇన్చార్జి షబానా విస్తృత ప్రచారం



**బండి ఆత్మకూరు నంది పత్రిక జూలై 5 :** ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ( సర్ )కార్యక్రమం పై ఓటర్లను జాగృతం చేసేందుకు గాను భారతీయ జనతా పార్టీ శ్రీశైలం నియోజకవర్గం ఇన్చార్జి మోమిన్ షబానా ఆదివారం బండి ఆత్మకూరు మండలంలో పర్యటించారు. మండల పరిధిలో ఉన్న సింగవరం ఈర్నపాడు కాకనూరు, బండి ఆత్మకూర్ గ్రామాలలో పర్యటించారు. ఓటరు జాబితాలో అర్హులైన ప్రతి ఒక్కరూ తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. ఓటర్ నమోదు మార్పులు చేర్పులకు సంబంధించి న ప్రక్రియను ప్రజలకు వివరించారు అనంతరం బూత్ లెవెల్ ఏజెంట్లతో ఒక సమావేశాన్ని నిర్వహించారు. సర్ కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాలని, అవసరమైన పత్రాలను సక్రమంగా సేకరించాలని సూచించారు. బూతు స్థాయిలో నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని దిశా నిర్దేశం చేశారు. ప్రజాస్వామ్యంలో ప్రతి ఓటు అమూల్యమైనదని అర్హులైన ప్రతి ఒక్క ఓటరు కూడా తన ఓటు హక్కు కోల్పోకుండా చూడటం ప్రతి బిజెపి కార్యకర్త బాధ్యత అని అన్నారు. 159, 160,161, 162, 163,164, 165 బూత్ లెవెల్ ఏజెంట్లతో కలిసి గ్రామాలలో పర్యటించి ఓటర్లను ప్రజలను జాగృతం చేశారు. ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షులు ప్రభాకర్ రెడ్డి, ధనుంజయ రెడ్డి, నారాయణతోపాటు బూత్ లెవెల్ ఏజెంట్ల తో పాటు పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.



# జెడ్పీ హైస్కూల్ డైమండ్ జూబ్లీకి పూర్వ విద్యార్థులంతా కదలిరావాలి

## ఆగస్టు 9న కమిటీల ఏర్పాటుకు 3వ సమావేశం

## ఘనంగా నిర్వహించేందుకు పూర్వ విద్యార్థుల పిలుపు



**వెలుగోడు, జులై 5 (నందిపత్రిక):** వెలుగోడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 75వ వార్షికోత్సవం (డైమండ్ జూబ్లీ) వేడుకల నిర్వహణపై ఆదివారం పాఠశాల ఆవరణలో రెండవ సన్నాహక సమావేశం అత్యంత ఉత్సాహభరితంగా జరిగింది. మండ్ల చంద్రశేఖర్ రెడ్డి, ఎం. భాస్కర్ రెడ్డి, యాదాటి రవి, వేల్పుల జైపాల్, డాక్టర్ శంకర్ రెడ్డి, రామలింగారెడ్డి, మక్బుల్ భాష, జయరామిరెడ్డిల ఆధ్వర్యంలో ఈ సమావేశాన్ని నిర్వహించారు.

**పూర్వ వైభవానికి కలిసికట్టుగా కృషి..** ఈ సందర్భంగా ముఖ్య వక్తలు మాట్లాడుతూ.. పాఠశాల డైమండ్ జూబ్లీ వేడుకలను చారిత్రాత్మకంగా, అత్యంత ఘనంగా నిర్వహించడంలో పూర్వ విద్యార్థుల భాగస్వామ్యం ఎంతో అవసరమని నొక్కి చెప్పారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన పాఠశాలకు పూర్వ వైభవం తీసుకురావడానికి, మౌలిక వసతుల కల్పనకు అందరూ కలిసికట్టుగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.“ఈ పాఠశాలలో చదివిన వారందరూ ఒకటే.. ఈ మహోత్సవ కార్యక్రమ నిర్వహణలో ప్రతి ఒక్కరూ సమానులే. అందరి సమిష్టి కృషితోనే ఈ వేడుకను విజయవంతం చేయగలం“ అని వారు పేర్కొన్నారు.

**ఆగస్టు 9న 3వ సమావేశం కమిటీల ఏర్పాటు** డైమండ్ జూబ్లీ వేడుకల ప్రణాళికను పక్కాగా అమలు చేసేందుకు ఆగస్టు 9వ తేదీ ఉదయం 10 గంటలకు పాఠశాల ఆవరణలో మూడవ సమావేశాన్ని నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ప్రకటించారు. ఈ సమావేశంలో వేడుకల నిర్వహణకు సంబంధించిన వివిధ రకాల కమిటీలను అధికారికంగా ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ లోగా దేశ, విదేశాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులందరినీ సమన్వయం చేయాలని నిర్ణయించారు. ఆగస్టు 9న జరిగే సమావేశానికి పాఠశాలలో చదువుకున్న ప్రతి ఒక్కరూ విధిగా హాజరై, తమ వంతు భాగస్వామ్యాన్ని అందించాలని కోరారు. ఈ సన్నాహక కార్యక్రమంలో పాఠశాల పూర్వ విద్యార్థులైన జెఎండి రఫీ, పార్థసారధి రెడ్డి, ఖలీల్ ఖాన్, మొయినుద్దీన్, అతావుల్లా, శ్రీనివాసులు, షంషుద్దీన్, సుల్తాన్ మొహిద్దిన్, నజీర్, సాబీర్, నూరుల్లా, నారాయణ, కుద్రతుల్లా, డబ్ల్యూ. చంద్రశేఖర్ రెడ్డి, పాల్గొన్నారు.

# శిరివెళ్లలో ఘనంగా సహకార్ సే సమృద్ధి వారోత్సవాలు.

## ముఖ్యఅతిథిగా హాజరైన డివిజనల్ సహకార సంఘం అధికారిని రుక్సానా బేగం



**శిరివెళ్ల (నంది పత్రిక):** సిరివెళ్ల మండల కేంద్రంలోని శిరివెళ్ల విరారెడ్డిపల్లె పిఏసిస్ సహకార సంఘ సొసైటీలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సహకార్ సే సమృద్ధి ప్రత్యేక వారోత్సవాలలో భాగంగా సొసైటీ సీఈవో మీర్జా మహబూబ్ బేగ్ అధ్యక్షతన సహకార సంఘ వారోత్సవాలను సొసైటీ చైర్మన్ కొండమడుగుల శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిదులుగా డివిజనల్ సహకార సంఘ అధికారిని రుక్సానా బేగం ఇతర అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా డివిజనల్ అధికారిని మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం సహకార మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేసి 5 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రత్యేక వారోత్సవాలను నిర్వహించాలని ఆదేశించడంతో జూలై 1 నుండి 6 వరకు దేశవ్యాప్తంగా ప్రత్యేక సహకార సంఘం వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు అమే పేర్కొన్నారు. సహకార సంఘాలు అంటే రుణాలు ఇచ్చే సంస్థలే కాదు అందరి కోసం ఒకరు ఒకరి కోసం అందరూ అన్న భావనతో అభివృద్ధి సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నదని అన్నారు. సహకారంతో సమృద్ధి యోజనలో భాగంగా గ్రామీణ స్థాయి ప్రజలకు డిజిటల్ సేవలను సైతం త్వరలో అందించబోతున్నట్లు డివిజనల్ సహకార అధికారిని తెలియజేశారు. శిరివెళ్ల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం జిల్లా స్థాయిలోనే ఆదర్శంగా నిలిచినదని పేర్కొంటూ సహకార సంఘ సీఈవో మీర్జా మహబూబ్ బేగ్ మరియు ఇతర సిబ్బందిని సహకార సంఘం జిల్లా మరియు డివిజన్ అధికారులు ప్రత్యేకంగా అభినందించారు.. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ రిజిస్టార్ లు రషీద్,రాములు సబ్ డివిజనల్ ఆఫీసర్ నాగరాజు సూపర్వైజర్ సుబ్బరాయుడు సహకార సంఘ సీఈఓ లు మహబూబ్ బేగ్ దస్తగిరి నాగ ప్రసాద్ కుళాయి అక్తర్ అన్వర్ భాస్కర్ మరియు హుస్సేన్ భాష నాగులయ్య సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

# మంత్రి బీసీతోనే బనగానపల్లె అభివృద్ధి దివ్యాంగుల అసోసియేషన్ అధ్యక్షులు



**బనగానపల్లెజులై 5నందిపత్రిక** రాష్ట్ర రోడ్లు మరియు భవనాలు పెట్టుబడులు మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి పుట్టినరోజు పురస్కరించుకొని నా ఆరోగ్యంబి నా బనగానపల్లె కార్యక్రమంలో భాగంగా సయ్యద్ హైదర్ సంగం హోటల్ సహకారంతో బనగానపల్లె పట్టణంలోని దివ్యాంగుల అసోసియేషన్ ప్రెసిడెంట్ అబ్దుల్ అజీజ్ ఆధ్వర్యంలో ఔటర్ రింగ్ రోడ్డు వద్ద మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి బనగానపల్లె నియోజకవర్గంను అభివృద్ధిలో అగ్రగామిగా నిలుపుతున్నారని, ఆయన ఆయురారోగ్యాలతో సుఖ సంతోషాలతో మరిన్ని ఉన్నత పదవులు అలంకరించాలని ఆకాంక్షిస్తూ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో హనీఫ్, మా భాష, సుబ్బయ్య, హసన్ భాష, హుస్సేన్ వారు పాల్గొన్నారు.

# ఉమామహేశ్వర స్వామిని దర్శించుకున్న జిల్లా ఎస్పీ దంపతులు



**బనగానపల్లె జులై 5నందిపత్రిక** నంద్యాల జిల్లా ఎస్పీ సునీల్ షరాన్ దంపతులు ఆదివారం కుటుంబసమేతంగ యాగంటి ఉమామహేశ్వర స్వామి ని దర్శించుకున్నారు. అంతకు ముందు ఆలయానికి చేరుకున్న ఎస్పీ దంపతులకు ఆలయ సిబ్బంది ఆలయ మర్యాదాలతో స్వాగతం పలికారు. అనంతరం వారికీ ప్రత్యేక పూజలు నిర్వహించి వేదాశీర్వచనం, శేషవస్త్రములు తీర్థప్రసాదాలు అందజేశారు . కార్యక్రమము నందు ఆలయ చైర్మన్ బండి మౌళేశ్వర రెడ్డి, సభ్యులు శ్రీరాములు, ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొనడం జరిగినది.



# ఘనంగా మంత్రి జన్మదిన వేడుకలు





**బనగానపల్లె జూలై 5 నంది పత్రిక** రాష్ట్ర రోడ్డు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి పుట్టినరోజు వేడుకను పార్టీ నాయకులు కార్యకర్తలు, అభిమానులు ఘనంగా నిర్వహించారు. మంత్రి పుట్టినరోజు సందర్భంగా ఆయన సతీమణి బీసి ఇందిరారెడ్డి రవ్వలకొండ పై ఉన్న బీసీ హాస్టల్ లో విద్యార్థులకు క్రీడా సామాగ్రి పంపిణీ చేశారు. కోయిలకుంట్ల పట్టణంలోని గవర్నమెంట్ హాస్పటల్ నందు తెలుగుదేశం పార్టీ నాయకులు మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గువ్వల సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి మంత్రికీ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్బంగా హాస్పిటల్ లో ఉన్న పేషెంట్లకు బ్రెడ్డు మరియు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గువ్వల సుబ్బారెడ్డి తో పాటు కరిమద్దుల మురళి కృష్ణ, పెనుగొండ రాజశేఖర్, వెంకట సుబ్బా రెడ్డి(గుండయ్య), సింగారెడ్డి. రామమోహన్ రెడ్డి, కొమ్ము రాజు, పూజారి బాలరాజు, వాసగిరి అమర్నాథ్,కరిమద్దుల నాగేంద్ర బాబు మరియు ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కార్యకర్తలు బీసీ అభిమానులు పాల్గొన్నారు.



## నేడు (జూలై 6న) జిల్లా, డివిజన్, మండల కేంద్రాలలో

# ప్రజా సమస్యల పరిష్కార వేదిక

### జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి



**భీమవరం బ్యూరో చీఫ్ జూలై 5, నంది పత్రిక** జిల్లా ప్రజల సమస్యలను వేగవంతంగా పరిష్కరించేందుకు ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) కార్యక్రమం జూలై 6న తేదీన జిల్లా కలెక్టరేట్‌తో పాటు అన్ని డివిజన్ మరియు మండల కేంద్రాలలో నిర్వహించబడుతుందని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. అదేవిధంగా రెవెన్యూ సమస్యల పరిష్కారం కోసం రెవెన్యూ క్లినిక్ కార్యక్రమం కూడా నిర్వహించబడుతుందని పేర్కొన్నారు. ప్రజలు తమ సమస్యలకు సంబంధించిన అర్జీలను సంబంధిత ఆధార పత్రాలతో సమర్పించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. అర్జీల స్వీకరణ, పరిశీలన మరియు పరిష్కార ప్రక్రియను మరింత పారదర్శకంగా నిర్వహించేందుకు జిల్లా మరియు మండల స్థాయి అధికారుల సమన్వయంతో ప్రత్యేక ఏర్పాట్లు చేయబడినట్లు తెలిపారు. అర్జీదారులు తమ ఫిర్యాదులను అధికారిక వెబ్‌సైట్ ఎవవఎశీయఎ.ఖజూ.స్త్రశీజ.ఱఅ ద్వారా కూడా నమోదు చేసుకోవచ్చని తెలిపారు. అర్జీల స్థితి, పరిష్కార ప్రక్రియ లేదా ఇతర సమాచారం కోసం "మీకోసం" టోల్ ఫ్రీ హెల్ప్‌లైన్ నంబర్ 1100 ను సంప్రదించవచ్చని సూచించారు. వేసవి ఎండలు తీవ్రంగా ఉన్న నేపథ్యంలో పిజిఆర్ఎస్‌కు హాజరయ్యే ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ముఖ్యంగా నడవలేని వారు, మంచానికే పరిమితమైన వారు, తీవ్రమైన అనారోగ్యంతో బాధపడుతున్న వారిని పిజిఆర్ఎస్ కేంద్రాలకు తీసుకురావద్దని తెలిపారు. అలాంటి వారి సమస్యలను కుటుంబ సభ్యులు లేదా ప్రతినిధుల ద్వారా తెలియజేయవచ్చని పేర్కొన్నారు. పిజిఆర్ఎస్‌కు హాజరయ్యే ప్రజల కోసం తాగునీరు, అల్పాహారం, భోజనం వంటి సౌకర్యాలతో పాటు వికలాంగులకు ప్రత్యేక ఏర్పాట్లు చేయబడినట్లు తెలిపారు. అందిన అర్జీలపై నిరంతర పర్యవేక్షణ చేపట్టి, సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకుంటామని కలెక్టర్ స్పష్టం చేశారు. అదేవిధంగా ప్రతి శుక్రవారం నియోజకవర్గ స్థాయిలో నిర్వహిస్తున్న ప్రత్యేక పిజిఆర్ఎస్ కార్యక్రమాలను కూడా ప్రజలు వినియోగించుకొని తమ సమస్యలను పరిష్కరించుకోవాలని కలెక్టర్ కోరారు.

## సాంస్కృతిక కార్యక్రమాలు






**శ్రీశైలం జూలై 05(నంది పత్రిక)** దేవస్థానము నిర్వహిస్తున్న ధర్మపథంలో భాగంగా (నిత్యకళారాధన) ఈ (05.07.2026) శ్రీహరి ఆర్ట్స్, హైదరాబాదు వారిచే కూచిపూడి నృత్య ప్రదర్శన కార్యక్రమం ఏర్పాటు చేయబడింది. ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్యకళారాధన వేదిక వద్ద ఈ రోజు సాయంకాలం నుండి ఈ కూచిపూడి నృత్య ప్రదర్శన కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమములో భో..శంభో, వినాయకకౌత్వం, అయిగిరినందిని, కాలభైరవాష్టకం, శివతాండవం, శివస్తుతి తదితర గీతాలకు విజయమాధవి, అభిన్య, సింధుజ, మేఘన, తేజస్విని, నిత్యశ్రీలక్ష్మి, వైదసంహిత, భవిష్య, నందిని, నిత్యశ్రీ తదితరులు నృత్యప్రదర్శన చేయనున్నారు. కాగా ఈ నిత్య కళారాధనలో ఆయా రోజులలో హరికథ, బుర్రకథ, సంప్రదాయ నృత్యం, వాయిద్య సంగీతం, భక్తిరంజని లాంటి కార్యక్రమాలు ఏర్పాటు చేయబడుతున్నాయి. శ్రీస్వామిఅమ్మవార్లకు ఆయా కైంకర్యాలన్నీ పరిపూర్ణంగా జరగాలని మరియు ప్రాచీన సంప్రదాయ కళల పరిరక్షణలో భాగంగా ఈ నిత్యకళారాధన కార్యక్రమాలు నిర్వహించబడుతున్నాయి.

# సర్ ప్రక్రియ ఓటుకు రక్షణ కవచంల నిలుస్తుంది





### స్వచ్ఛమైన ఓటర్ల జాబితా రూపకల్పనకు 'సర్' ప్రక్రియ కీలకం
### 18 ఏళ్లు నిండిన ప్రతి అర్హుడూ ఓటరుగా నమోదు కావాలి ఓటర్లకు 'సర్' ప్రక్రియ ద్వారా మరో అవకాశం
### క్షేత్రస్థాయిలో పారదర్శకంగా, వేగవంతంగా ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ పూర్తి చేయాలి
### జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి

**భీమవరం బ్యూరో చీఫ్ జూలై 5 నంది పత్రిక** దేశవ్యాప్తంగా భారత ఎన్నికల కమిషన్ చేపట్టిన ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్ స్పెషల్ ఇంటెన్సీ రివిజన్) ప్రక్రియను అత్యంత పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించి స్వచ్ఛమైన, తప్పులులేని ఓటర్ల జాబితాను రూపొందించాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి సంబంధిత అధికారులను ఆదేశించారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడం, అనర్హ పేర్లను తొలగించడం, ఓటర్ల వివరాలను కచ్చితంగా నమోదు చేయడం ద్వారా ప్రజాస్వామ్య వ్యవస్థను మరింత బలోపేతం చేయడమే ఈ ప్రక్రియ ప్రధాన ఉద్దేశమని ఆమె తెలిపారు. భీమవరం పట్టణంలోని చిగుడీలుపేట పద్మశాలీల బజార్ ప్రాంతంలో ఆదివారం జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆకస్మికంగా సందర్శించి బూత్ లెవల్ అధికారులు (బీఎల్ఓలు) నిర్వహిస్తున్న (ఎస్ ఐ ఆర్) ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఇంటింటికీ వెళ్లి ఓటర్లతో మాట్లాడిన ఆమె, ఎన్రోల్మెంట్ ఫారాలు అందజేశారా, పూర్తిచేసిన ఫారాలను తిరిగి సేకరిస్తున్నారా, వాటి డిజిటలైజేషన్ ఎంతవరకు పూర్తయింది, పురోగతి శాతం ఎందుకు తక్కువగా ఉందని బీఎల్ఓలను ప్రశ్నించారు. విధి నిర్వహణలో ఉన్న అధికారులు తప్పనిసరిగా గుర్తింపు కార్డులు ధరించాలని స్పష్టం చేసిన జిల్లా కలెక్టర్, ప్రతి ఇంటికి వెళ్లి ప్రజలకు ఎన్రోల్మెంట్ ఫారాలు అందజేయడంతో పాటు వాటిని త్వరగా పూర్తిచేసి అందజేసేలా అవగాహన కల్పించాలని సూచించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలతో మాట్లాడిన జిల్లా కలెక్టర్, "ఎస్ఐఆర్ ప్రక్రియ ఎందుకు నిర్వహిస్తున్నారో మీకు తెలుసా?" అని ప్రశ్నిస్తూ, ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణలో భాగంగానే ఈ కార్యక్రమం చేపట్టినట్లు వివరించారు. ఈ ప్రక్రియపై ఎలాంటి అపోహలు, అనుమానాలు పెట్టుకోవద్దని స్పష్టం చేశారు. చనిపోయిన ఓటర్ల పేర్ల తొలగింపు, ఒకే వ్యక్తికి వేర్వేరు ప్రాంతాల్లో నమోదైన ఓటర్ల వివరాలను ఒకే చోటకు పరిమితం చేయడం, అర్హత కలిగిన ప్రతి పౌరుడిని ఓటరుగా నమోదు చేయడం, ఓటర్ల జాబితాను మరింత పారదర్శకంగా రూపొందించడం ఈ ప్రత్యేక కార్యక్రమం ప్రధాన లక్ష్యాలని ఆమె వివరించారు. ప్రతి కుటుంబం బీఎల్ఓలకు పూర్తి సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. ఎస్ఐఆర్ ప్రక్రియను వేగవంతం చేసేందుకు బీఎల్ఓలకు బూత్ లెవల్ సూపర్వైజర్లు, అంగన్‌వాడీ టీచర్లు, ఆర్‌పీలు, ఇతర సహాయక సిబ్బందిని సమన్వయం చేయాలని ఆదేశించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ ఫారాల పంపిణీ, సేకరణ, డిజిటలైజేషన్ పనులను గడువులోపు పూర్తిచేయాలని అధికారులకు సూచించారు.

పర్యటన సందర్భంగా ప్రాంతంలో వీధి కుక్కల సంఖ్య అధికంగా ఉండటాన్ని గమనించిన జిల్లా కలెక్టర్, వాటికి స్టెరిలైజేషన్ కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. స్థానికులతో మాట్లాడి తాగునీటి సరఫరా, ఇతర మౌలిక వసతులపై ఆరా తీశారు. పద్మశాలీల బజార్‌లో రహదారి నిర్మాణం చేపట్టాలని స్థానికులు కోరగా, సంబంధిత ప్రతిపాదనలను పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్‌కు సూచించారు. ఈ పర్యటనలో భీమవరం మున్సిపల్ కమిషనర్ కె.రామచంద్రారెడ్డి, సహాయ కమిషనర్ ఎ.రాంబాబు, బూత్ లెవల్ అధికారులు, మున్సిపల్ సిబ్బంది, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు...



## నూతన వధువు వరులను ఆశీర్వదించిన బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యురాలు మోమిన్ షబానా



**బండి ఆత్మకూరు జూలై 05 (నంది పత్రిక):-** బండి ఆత్మకూరు మండలం లోని ఓంకారం సిద్దేశ్వర స్వామి ఆలయంలో జరిగిన వివాహానికి బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యురాలు,శ్రీశైలం అసెంబ్లీ ఇన్చార్జి మోమిన్ షబానా హాజరై నూతన వధువు వరులను ఆశీర్వదించారు.మహానంది మండలం తిమ్మాపురం గ్రామానికి చెందిన భానుముక్కల వెంకటేశ్వర్లు ,శ్రీవాణి దంపతుల వివాహానికి హాజరై నూతన వధువు వరులను ఆశీర్వదించారు.ఈ కార్యక్రమంలో బండి ఆత్మకూరు మండలం బీజేపీ అధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి,మహానంది మండల బీజేపీ అధ్యక్షుడు కేశ కిరణ్ కుమార్ గౌడ్,బీజేపీ నాయకులు



## కసాపురం ఆంజనేయ స్వామిని దర్శించుకున్న ఎంపీ బస్తిపాటి నాగరాజు



**కర్నూలు సిటీ నందిపత్రిక** అనంతపురం జిల్లా, గుంతకల్లు మండలం కసాపురంలోని శ్రీ నెట్టికంటి ఆంజనేయ స్వామివారిని ఎంపీ బస్తిపాటి నాగరాజు దర్శించుకున్నారు.. దర్శనార్థం ఆలయానికి చేరుకున్న ఆయనకు ఆలయ అధికారులు, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు.. ఆలయంలో ఆంజనేయ స్వామి వారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు.. దర్శనం అనంతరం అధికారులు స్వామి వారి శేషవస్త్రం, చిత్రపటం, తీర్థప్రసాదాలు అందజేశారు.. ఎంపీ వెంట స్థానిక టీడిపి నాయకులు పాల్గొన్నారు...

# మీ కోసం కాల్ సెంటర్ 1100 సేవలను వినియోగించుకోండి

**జూలై 06వ తేదీన జిల్లా కలెక్టరేట్ లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహణ**
**జిల్లా,డివిజన్,మండల కేంద్రాలలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహణ**
**ప్రతి సోమవారం ఉ. 9.30 నుంచి ఉ.10 గంటల వరకు డయల్ యువర్ కలెక్టర్**
**ఫోన్ చేయవలసిన ల్యాండ్ లైన్ నెం.08562-244437**
**జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి**
**డిఆర్ఓమల్లికార్జునుడు**

**వై ఎస్ ఆర్ బ్యూరో చీఫ్ జూలై 5: నంది పత్రిక** జూలై 06వ తేదీన జిల్లా కలెక్టరేట్ లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కు ప్రజలు వినియోగించుకోవాలని డి ఆర్ ఓ మల్లికార్జునుడు ఆదివారం ఒక ప్రకటన లో తెలిపారు. అర్జీదారులు దాఖలు చేసిన తమ అర్జీలు ఇప్పటికీ పరిష్కారం కాకపోయినా,లేదా తమ ఫిర్యాదులకు సంబంధించిన సమాచారం తెలుసుకోవడానికి 1100 నంబర్ కు కాల్ చేయవచ్చునన్నారు. అర్జీదారులు వారి యొక్క అర్జీలు నమోదు చేసుకోవడానికి వీవవఎశీయఎ.ఖజూ.స్త్రశీజ.ఱఅ (మీకోసం డాట్ ఏపీ డాట్ జివో వి డాట్ ఇన్) వెబ్సైట్ నందు వారి యొక్క అర్జీలు నమోదు చేసుకోవచ్చన్నారు.ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ సమస్యలకు పరిష్కారం పొందాలని విజ్ఞప్తి చేశారు.లిజూలై 06 వతేదీన సోమవారం కలెక్టరేట్ లోని సభా భవన్ నందు ప్రజాసమస్యలపరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రసెల్ సిస్టం, పిజిఆర్ఎస్) కార్యక్రమం నిర్వహించడంజరుగుతుందని, ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని కలెక్టరేట్ లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందని, ఈ కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లాఅధికారులు పాల్గొంటారని తెలిపారు.ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం లో తమ వివరాలతో పాటు వారి సమస్యలకుసంబంధించి అర్జీలను అందజేయాలన్నారు. అర్జీదారులు గతంలో ఇచ్చిన అర్జీలకు సంబంధించిన స్లిప్పునుతీసుకురావాలని సూచించారు.సమస్య పరిష్కారమైనప్పుడు ఫోన్ కి మెసేజ్ వస్తుందని,అర్జీదారులు వారి ఫోన్ ను చెక్ చేసుకోవాలన్నారు. నోటీసులు,ఎండార్స్మెంట్ ను వాట్సఅప్ లో పంపిస్తున్నామని, ఎండార్స్మెంట్ బై రిజిస్టర్ పోస్ట్ మీరు ఇస్తున్న అడ్రస్ కు పంపిస్తున్నామన్నారు. అర్జీ ఇచ్చేటప్పుడు దానిని కరెక్ట్ గా పూరించాలన్నారు.రిపీటెడ్ అర్జీదారులు పాత రసీదును తీసుకురావాలన్నారు. జిల్లా ప్రజలు పిజిఆర్ఎస్ కార్యక్రమాన్ని సద్విని యోగం చేసుకోవాలని కోరారు." ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (గ్రా+=వా)" అర్జీల స్వీకరణ కార్య క్రమాన్ని జిల్లా కేంద్రంతో పాటు మండల,మున్సిపల్ స్థాయి లో కూడా నిర్వహిస్తామన్నారు. అర్జీదారులు ఈ విషయాన్ని గమనించి తమ ఫిర్యాదులను సమీపంలోని మండల కార్యాలయాలు లేదా మున్సిపల్ కార్యాలయాలలో కూడా సమర్పించుకోవచ్చునన్నారు డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమం: డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమాన్ని సోమవారం ఉదయం 9.30 నుండి ఉ.10 గంటల వరకు జరుగుతుందన్నారు.ప్రజలు 08562-244437 ల్యాండ్ లైన్ నెంబరుకు ఫోన్ చేసి తమ సమస్యలను విన్నవించుకోవచ్చునన్నారు

## చంద్రబాబు హయాంలో పోలీసు వ్యవస్థ ప్రమాదకర దిశలో పయనిస్తోంది: జగన్

ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలోని ప్రభుత్వంలో పోలీసు యంత్రాంగం అత్యంత ప్రమాదకరమైన దిశగా పయనిస్తోందని వైసీపీ అధినేత జగన్ ఆందోళన వ్యక్తం చేశారు. ఆదివారం ఆయన 'ఎక్స్' వేదికగా చంద్రబాబు పాలనపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. తనను ప్రశ్నించిన వారిని, రాజకీయంగా వ్యతిరేకించే వారిని అణచివేసేందుకు చంద్రబాబు పోలీసు

# జూలై 19 న చలో నంద్యాల





## గ్రేటర్ రాయలసీమ బహుజన ఉద్యమాల న్యాయగర్జన

**నంద్యాల సిటీ బ్యూరో జూలై 5 ( నంది పత్రిక )** సామాజిక న్యాయం,రాజకీయాల్లో సమాన వాటా,ఆర్థిక సమానత్వంకోసం గ్రేటర్ రాయలసీమ బహుజన ఉద్యమాల గర్జనను విజయవంతం చేయాలని మాజీ ప్రభుత్వ ఉపాధ్యాయులు,హై కోర్టు న్యాయవాది,రిజర్వేషన్ ఎంప్లాయిస్ ఫెడరేషన్,రిజర్వేషన్ల పరిరక్షణ సమితి వ్యవస్థాపకులు డాక్టర్ పోతుల నాగరాజు పిలుపునిచ్చారు. నంద్యాలలోనీ మున్సిపల్ కార్యాలయ ఆవరణలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి మీడియా సమావేశం ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివారం, ఉదయం 10:30 గంటలకు గోల్డెన్ ఫంక్షన్ హాల్ లో గ్రేటర్ రాయలసీమ బహుజన ఉద్యమాల న్యాయగర్జన ఏర్పాటు చేస్తున్నామని అన్నారు.సామాజిక న్యాయం కోసం, రాజకీయాలలో సమాన వాటా కోసం, ఆర్థిక సమానత్వం కోసం భారత రాజ్యాంగ నిర్మాత డా. బి.ఆర్. అంబేద్కర్ రచించిన రాజ్యాంగంలో లిఖించిన అంశాలు అమలు అవుతున్నాయా అని ప్రశ్నించారు..రాజకీయ పరిరక్షణ,.న్యాయ వ్యవస్థలో బీసీలకు అమలు ,ప్రభుత్వ ఉద్యోగాల్లో చట్టం అమలు చేయాలి,గ్రేటర్ రాయలసీమ గిరిజనులకు 5 ఎమ్మెల్యే 2ఎంపీ స్థానాలు కేటాయింపు, చెట్టి కులాలకు బీసీలకు 44% రిజర్వేషన్ కోసం, ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణ కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ ఉద్యోగాలకు బదులుగా శాశ్వత ఉద్యోగాలు,విద్య, వైద్య రంగాలలో సమాన అవకాశాలు,బీసీ, ఎస్సీ, ఎస్టీ మైనారిటీ నిధుల కోసంబహుజనులకు అన్ని రంగాలలో జనాభా దామాషా ప్రకారం వాటాలన్ని వర్గాల బహుజన ఉద్యమకారులు, ప్రజాసంఘాల అధ్యక్ష సభ్యులు పాల్గొనండి అని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్.పి.ఎఫ్ స్టేట్ యువత కన్వీనర్ శివకృష్ణ, శ్రీనివాసులు, బోయ పులికొండన్న,కుమ్మరి ప్రసాద్, మహేంద్ర, రామయ్య, ఇజజ్ ఖాదర్, చిన్న, హుస్సేనయ్య రమణ్యయ్య గౌడ్, వెంకట కృష్ణ, వర ప్రసాద్, రఫీ, నాయక్, మహేంద్ర నాథ్ పాల్గొన్నారు.



## కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలి

### ఎన్ యస్ యు ఐ ,యూత్ కాంగ్రెస్ డిమాండ్

### ఛాత్రోన్ కీ గూంజ్" పోస్టర్ల విడుదల

### దేశ విద్యార్థుల గళం ఇక మౌనంగా ఉండదు!



**కర్నూలు సిటీ నందిపత్రిక** "ఛాత్రోన్ కీ గూంజ్" కార్యక్రమంలో ఆల్ ఇండియా కాంగ్రెస్ సెక్రటరీ, ఏపీ కాంగ్రెస్ ఇంచార్జి గణేష్ యాదవ్, ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ మస్తాన్ వలి కర్నూలు డిసిసి అధ్యక్షులు బి క్రాంతి నాయుడు, యువజన కాంగ్రెస్ జాతీయ కార్యదర్శి నాగ మధు యాదవ్ ఆదివారం కర్నూల్ లో పోస్టర్లు విడుదల చేసి మాట్లాడుతూ దేశ విద్యావ్యవస్థ ఎదుర్కొంటున్న తీవ్రమైన సంక్షోభంపై గళం ఎత్తడం జరిగిందని, మోదీ ప్రభుత్వ హయాంలో వరుసగా జరిగిన పరీక్షా పత్రాల లీకులు, పరీక్షల నిర్వహణలో వైఫల్యాలు, నియామక ప్రక్రియల్లో జాప్యాలతో లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని ఆమె ఆందోళన వ్యక్తం చేస్తున్న సందర్భం గా మూడు ప్రధాన డిమాండ్లను ముందుంచారు కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలి.దేశ పరీక్షా వ్యవస్థలో సమగ్ర సంస్కరణలు తీసుకురావాలి.ప్రతి ఏడాది పరీక్షలు, ఉద్యోగ నియామకాల కోసం వార్షిక క్యాలెండర్ అమలు చేయాలి.దేశవ్యాప్తంగా విద్యార్థుల సమస్యలను ప్రజల ముందుకు తీసుకెళ్లేందుకు "ఛాత్రోన్ కీ గూంజ్" ఉద్యమాన్ని 28 నగరాలకు విస్తరించనున్నట్లు తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం జరుగుతున్న ఈ పోరాటం ఆగదని, వారి స్వరం దేశమంతా వినిపించే వరకు కాంగ్రెస్ పార్టీ పోరాడుతుందని స్పష్టం గా తెలియ చేయడం జరిగింది . "విద్యార్థుల భవిష్యత్తు ప్రమాదంలో ఉంది... నేడు దేశ విద్యావ్యవస్థ ఐసీయూ లో ఉంది. దానిని కాపాడటం మనందరి బాధ్యత అని తెలిపారు. ఎన్ యస్ యు ఐ , యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు వీరేష్ యాదవ్, ఎ ప్రదీప్, తెలుగు విజయ్,శ్రీనిథ్, తదితర కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## గల్లంతయిన మత్స్యకారులను కాపాడేందుకు ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలి

### - సీపీఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య



**కర్నూలు సిటీ నందిపత్రిక** విశాఖ ఫిషింగ్ హార్బర్ నుంచి సముద్రంలో చేపల వేటకు వెళ్లి గల్లంతైన ఏడుగురు మత్స్యకారులను రక్షించేందుకు ప్రభుత్వం తక్షణమే స్పందించి, యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.తమ దైనందిన జీవన భృతి కోసం సముద్రంలోకి వేటకు వెళ్లిన మత్స్యకారులు గల్లంతై, వారి సమాచారం ఇప్పటివరకు తెలియకపోవడంతో కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళన చెందుతున్నారని తెలిపారు. ప్రభుత్వం ఒకవైపు కోస్టుగార్డు, నేవీ, మెరైన్ పోలీసు విభాగాలతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి సముద్రంలో గాలింపు చర్యలను ముమ్మరం చేయాలని కోరారు. అవసరమైతే అదనపు నౌకలు, హెలికాప్టర్లను కూడా రంగంలోకి దించి, గల్లంతైన మత్స్యకారులను సురక్షితంగా గుర్తించి రక్షించేందుకు సాధ్యమైన అన్ని ప్రయత్నాలు చేయాలన్నారు. మరోవైపు తీవ్ర ఆందోళనలో ఉన్న బాధిత మత్స్యకారుల కుటుంబాలకు ప్రభుత్వం తగిన భరోసా కల్పించి, ధైర్యం చెప్పాల్సిన అవసరం ఉందని గుజ్జుల ఈశ్వరయ్య పేర్కొన్నారు.

## ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ పై ప్రత్యేక శ్రద్ధ పెట్టి పనిచేయాలి

### జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి

**వై ఎస్ ఆర్ కడప, బ్యూరో చీఫ్ జూలై 5 నంది పత్రిక** ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ పై ప్రత్యేక శ్రద్ధ పెట్టి పని చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు.ఆదివారం టెలి కాన్ఫరెన్స్ ద్వారా ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ నిర్వహణ పై జిల్లా కలెక్టర్ ఆర్ డి ఓ లు, తహసీల్దార్ ల తో సమీక్షించారు.

**జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ..** ఓటరు జాబితా పారదర్శకం గా, తప్పులు లేకుండా చేయాలని ఆదేశించారు.జిల్లా లో జరుగుతున్న ఇంటింటా సర్వేని మరియు ఓటరు మ్యాపింగ్ ప్రక్రియ ను అధికారులుపరిశీలించాలన్నారు.అర్హులైన ప్రతి ఒక్కరూ తమ వివరాలను సక్రమంగా నమోదు చేసు కొనేలా అవగాహన కల్పించాలని తెలిపారు. ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియ నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాలని, ఈ గడువు లోపల బి యల్ ఓ లు వారికి అందిన ఎన్యూమరేషన్ ఫారాలను పూర్తిగా పరిశీలించి డిజిటలైజేషన్ ప్రక్రియను పూర్తి చేయాలన్నారు.. మ్యాపింగ్ ప్రక్రియ వేగంగా చేపట్టాలని తెలిపారు. ప్రతి బూత్ పరిధిలో ప్రత్యేక సహాయ కేంద్రాలు ఏర్పాటు చేయడమైనదని,ఓటర్లు సహాయ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.ఓటర్లు వారికి సమీపంలోని 'సర్ 'సహాయ కేంద్రాన్నిసందర్శించి,ఎన్యూమరేషన్ ఫారం (ఈ ఎఫ్)ను పూరించి అందజేయాలని తెలిపారు.ఫారం పూరించడం లో మరియు డిజిటలైజేషన్ ప్రక్రియలో ఓటర్లు సహాయం పొందవచ్చునని,పూర్తిగా నింపిన ఎన్యూమరేషన్ ఫారం( ఎఫ్)ను మీ బూత్ లెవల్ ఆఫీసర్( ఎల్ ఓ)కు వెంటనే అందజేయాలని తెలిపారు..ఓటర్లు ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకొని, తమ ఎన్యూమరేషన్ ఫారాన్ని వీలైనంత త్వరగా సమర్పించవలసిందిగా తెలిపారు.

## గోకవరంలో ఉచిత వైద్య శిబిరం



**కొత్తపల్లి – నంది పత్రిక :** మండలంలోని గోకవరం గ్రామంలో ఉన్న సోమేపల్లి సోమయ వనవాసి వికాస సేవా కేంద్రం ,గుణంపల్లి నారాయణమ్మ వైద్యశాల మరియు స్వామి నేత్రాలయము నంద్యాల వారి సహకారంతో ఆదివారం గోకవరం నందు జరిగిన ఉచిత కంటి ,చర్మ ,దంత, వైద్య శిబిరం చేశామని నిర్వాహకులు మునీశ్వర్ అన్నారు ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ శిబిరం లో 20 గ్రామాల నుంచి దాదాపు 600 మంది రోగులు సేవలను వినియోగించుకున్నారు అందులో కంటి చికిత్స కొరకు290 మంది, చర్మ సంబంధిత చికిత్స కొరకు 198 మంది, దంత సంబంధిత చికిత్స కొరకు 151మంది వైద్య సేవలను వినియోగించుకున్నారు. కంటి అద్దాలు ,కంటి ఆపరేషన్ కొరకు ఎంపిక చేయడం జరిగినది వారికి వైద్యశాల తరఫున ఉచితంగా అందజేయబడుతుంది.. ఈ వైద్య శిబిరంలో ప్రముఖ కంటి వైద్య నిపుణులు డాక్టర్ ఎన్ సి లక్ష్మయ్య ,చర్మవ్యాధి నిపుణురాలు. డాక్టర్ సుసుమ ,దంత వైద్య నిపుణులు డాక్టర్ కిషోర్ కుమార్ , తదితర ప్రముఖ వైద్యులచే ఉచితంగా వైద్యపరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను అందజేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో ఆవాస సహకార దర్శి రామకృష్ణారెడ్డి , వైద్యశాల కోఆర్డినేటర్ , సి వాసుదేవ రెడ్డి , వై మల్లికార్జున రెడ్డి, బి వాసుదేవుడు, సి అశోక్, కే మహేశ్వర చారి, జి వెంకటరమణ, ఆవాస ప్రముఖ్ రామకృష్ణ తదితరులు కార్యక్రమంలో పాల్గొనడం జరిగినది.

## పి ఆర్ సి కమిటీ మరియు ఐ ఆర్ ప్రకటించాలని జూలై 14 న ర్యాలీ ,జిల్లా కలెక్టరేట్ ఎదుట నిరసన కార్యక్రమం – ఫ్యాప్టో



**కర్నూలు సిటీ నందిపత్రిక** ఆదివారం సాయంత్రం జిల్లా యు టి ఎఫ్ కార్యాలయం లో కర్నూలు జిల్లా ఫ్యాప్టో కార్యవర్గ సమావేశం రాష్ట్ర ఫ్యాప్టో కో చైర్మన్ కాకి ప్రకాష్ రావు నాయకత్వం లో జరిగింది.ఈ సందర్భంగా రాష్ట్ర ఫ్యాప్టో కో చైర్మన్ కాకి ప్రకాష్ రావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అధికారం లో రాక ముందు ఉపాధ్యాయ మరియు ఉద్యోగుల కు అన్ని విధాలుగా అనుకూలంగా ఉంటాం అని చెప్పారు. కానీ అధికారం లో వచ్చి రెండు సంవత్సరాల కాలం దాటి పోయిన ఇంత వరకు పి ఆర్ సి కమిటీ నియమించ లేదు ఐ ఆర్ ప్రస్తావన లేదు , అందుకే రాష్ట్ర ఫ్యాప్టో అన్ని జిల్లాల కలెక్టరేట్ ల ముందు నిరసన కార్యక్రమం నిర్వహించాలని నిర్ణయం తీసుకోవడం జరిగింది. కాబట్టి జిల్లా లోని ఉపాధ్యాయులు అందరు 14 తేదీ ఉదయం 9 గంటలకు జిల్లా కలెక్టర్ కార్యాలయం చేరుకోవాలి అని పిలుపు ఇచ్చారు.కర్నూలు జిల్లా ఫ్యాప్టో చైర్మన్ ఎం మధుసూదన్ రెడ్డి ఫ్యాప్టో నిరసన కార్యక్రమం లో మూడు ముఖ్యమైన డిమాండ్లను పెట్టడం జరిగింది 12 వ పి ఆర్ సి ప్రకటించాలి,30 శాతం ఐ ఆర్ ప్రకటించాలని,4 పెండింగ్ డి ఎ లను ప్రకటించాలి, ఇన్ సర్వీస్ టీచర్లకు టెట్ రద్దు చేయాలని ఈ కార్యక్రమం ప్రకటించడం జరిగింది అని చెప్పారు. ఫ్యాప్టో కర్నూలు జిల్లా సెక్రటరీ జనరల్ జి భాస్కర్ మాట్లాడుతూ ఈ నిరసన కార్యక్రమం లో కలిసి వచ్చే అన్ని ఉపాధ్యాయ సంఘాలు మరియు ఉద్యోగ సంఘాల ను ఈ కార్యక్రమం ను ఆహ్వానిస్తున్నాం అని తెలియ చేశారు. ఈ కార్యక్రమంలో లో యు టి ఎఫ్ అధ్యక్షుడు రవి కుమార్ మాట్లాడుతూఉపాధ్యాయులు అర్థిక అంశాలు పై అసంతృప్తి తో ఉన్నారు కాబట్టి ఈ నిరసన కార్యక్రమం లో అందరూ పాల్గొనాలి కోరారు. ఎస్ టి యు జిల్లా అధ్యక్షుడు జనార్దన్ మాట్లాడుతూ ఉపాధ్యాయులకు రావలసిన సరెండర్ లీవ్ లు గత కొన్ని సంవత్సరాలు గా పెండింగ్ లో ఉన్నాయని నిరసన విజయవంతం చేయాలి అని కోరారు. ఎ పి టి ఎఫ్ 257 జిల్లా ప్రధాన కార్యదర్శి ఖాసింజి మాట్లాడుతూ ఈ ప్రభుత్వం ఒకటో తేదీ జీతం తో సరి పెట్టుకుందని ఇతర అర్థిక అంశాలు పట్టించుకోవడం లేదు.ఈ నిరసన కార్యక్రమం ను విజయవంతంగా చేయాలని కోరారు. ఎ పి టి ఎఫ్ 1938 జిల్లా అధ్యక్షుడు ఇస్మాయిల్ మాట్లాడుతూ ఇన్ సర్వీస్ టీచర్లకు టెట్ పరీక్షలు రద్దు చేయాలని నిరసన కార్యక్రమం లు చేసిన పట్టించుకొని ప్రభుత్వం ను పట్టించుకొనని ప్రభుత్వం దిగి వచ్చే విధంగా ఉండాలని అని అన్నారు. ప్రధానోపాధ్యాయ సంఘము జిల్లా అధ్యక్షుడు నారాయణ మాట్లాడుతూ జిల్లా లోని అన్ని సంఘాలు కలిసి వచ్చి జూలై 14 వ తేదీ ర్యాలీ, కలెక్టరేట్ ఎదుట నిరసన కార్యక్రమం లో పాల్గొనాలి అని కోరారు. డి టి ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి భీమన్న మాట్లాడుతూ 14 వ తేదీ ఉదయం 9 గంటలకు అంతా కర్నూలు జిల్లా పరిషత్ కార్యాలయం వద్ద కు చేరుకోవాలి అని కోరారు. ఈ సమావేశం యందు నవీన్ పాటిల్ ( యు టి ఎఫ్), వెంకట్రాముడు (ఎస్ టి యు), మరియానందం (ఎ పి టి ఎఫ్ 1938) పాల్గొనడం జరిగింది.

## అహోబిలం శ్రీ లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకున్న మచిలీపట్టణం ఎంపీ బాలశౌరి

**ఆళ్లగడ్డ ప్రతినిధి జులై 5, నంది పత్రిక:** సుప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన అహోబిలం శ్రీ లక్ష్మీనరసింహ స్వామి వారిని ఆదివారం నంద్యాల పార్లమెంట్ జనసేన పార్టీ పరిశీలకులు, మచిలీపట్టణం జనసేన పార్టీ పార్లమెంట్ సభ్యులు వల్లభనేని బాలశౌరి దర్శించుకున్నారు. ఆలయ అధికారులు వల్లభనేని బాలశౌరిని మేళాలతో స్వాగతం పలికి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆనంతరం ఆయన మాట్లాడుతూ శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారిని దర్శించుకోవడం నా అదృష్టమని, అలాగే పవన్ కళ్యాణ్ కు ఆయురారోగ్యాలతో ఉండేలాగా శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి ఆశీస్సులు కలగాలని, అలాగే కూటమి ప్రభుత్వంలో రాష్ట్ర ప్రజలు కూడా సుఖ సంతోషాలతో ఉండాలని స్వామివారిని వేడుకున్నానని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆళ్ళగడ్డ నియోజకవర్గం జనసేన పార్టీ సీనియర్ నాయకులు ఇరిగేల రాంపుల్లారెడ్డి, ఇరిగేల నారాయణ రెడ్డి, జనసేన పార్టీ సమన్వయకర్త మైలేరి మల్లయ్య, టిడిపి సీనియర్ నాయకులు ఉమ్మడి కర్నూలు జిల్లా టిడిపి మాజీ ఉపాధ్యక్షుడు గూడూరు సంజీవరాయుడు, జనసేన పార్టీ నాయకులు వెంకటసుబ్బయ్య, దేవా ఆంజనేయులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ సమ సమాజం పార్టీ ముఖ్య నేతల సమావేశంలో పాల్గొన్న జాతీయ సమ సమాజం పార్టీ అధ్యక్షులు ఏపీ రామయ్య యాదవ్

**కర్నూల్ సిటీ నందిపత్రిక** ఆంధ్రప్రదేశ్ లో 2029 ఎన్నిక లలో ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీలకు అధిక ప్రాధాన్యం. జాతీయ సమాజం పార్టీ ముఖ్య నేతల సమావేశం. జూలై 12న మేధావుల సదస్సు 2029 జరగనున్న అసెంబ్లీ పార్లమెంట్ ఎన్నికలలో ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీలకు జాతీయ సమ సమాజం పార్టీ సమానంగా సీట్లు కేటాయిస్తుందని జాతీయ సమ సమాజం పార్టీ అధ్యక్షులు ఏపీ రామయ్య యాదవ్ తెలిపారు.

ఆదివారం కర్నూలు మండలం దీన్నే దేవరపాడు గ్రామ పరిధిలో రాగ మయూరి రిసార్ట్ లో జాతీయ సమ సమాజం పార్టీ ముఖ్య నేతల సమావేశం అధ్యక్షులు ఏపీ రామ యాదవ ఆధ్వర్యంలో జరిగింది. జూలై 12న అనంతపురంలో మేధా వుల సదస్సుపై చర్చ జరిగింది. 2029 జరిగే ఎన్నికలలో అన్ని నియోజక వర్గాలలో జాతీయ సమాజం పార్టీ పోటీ చేసేందుకు సమాయత్త మవుతుందని, జాతీయ సమ సమాజం పార్టీకి ప్రజలు అందరూ అండగా నిలవాలని ఏపీ రామయ్య యాదవ్ కోరారు.





# రావణ్‌పై రాజద్రోహం కేసు అప్రజాస్వామికం

**కూటమి కక్ష సాధింపులకు నిదర్శనం**
**తక్షణమే ఉపా చట్టం కేసు ఉపసంహరించాలి**
**-మీడియా సమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య**

**కర్నూలు సిటీ నందిపత్రిక** యుట్యూబర్ ప్రశ్న రావణ్‌పై అత్యంత నిరంకుశ ఉపాచట్టం కేసు నమోదు చేయడంఅప్రజాస్వామికమని, కేవలం ప్రశ్నించారనే నెపంతోనే కక్ష పూరితంగా పెట్టిన ఈ కేసులను తక్షణమే ఉపసంహరించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య డిమాండ్ చేశారు. కడపలోని సీఆర్ ఫౌండేషన్‌లో ఆదివారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈశ్వరయ్య మాట్లాడుతూ, ఈ కేసు ఆధారంగా తమకు ఎదురు మాట్లాడితే ఎంతకైనా తెగించి వారిని జైల్లో పెడతామనే హెచ్చరికను చంద్రబాబు ప్రభుత్వం ఆదేశించినట్లుగా కన్పిస్తోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం, పోలీసు యంత్రాంగం ఇలాంటి చర్యలకు దిగడం తగదని, ఇది కక్ష సాధింపు చర్యలేనని ఆయన తప్పుపట్టారు. దేశంలో ఎక్కడైనా విమర్శలు చేసిన వారిపై ఉపా చట్టం ఉపయోగించిన దాఖలాలు లేవని, దీనిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. అధికారంలో ఉన్న పవన్ కల్యాణ్ ఇతరులను ప్రశ్నించవచ్చుగానీ, ఆయన్ను మాత్రం ప్రశ్నించినా, విమర్శలు చేసినా, ఇలా ఉపా చట్టాలతో జైళ్లకు పంపుతారా? అని నిలదీశారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారన్న ఆరోపణలపై ఇప్పటికే ప్రశ్న రావణ్‌పై పిఠాపురం, ఆ తర్వాత సర్పవరం, మచిలీపట్నం, పాయకారావుపేటలో జనసేన నేతలు కేసులు నమోదు చేశారు. నాలుగు పోలీస్‌స్టేషన్లలో కేసులు పెట్టడం, వాటికి బెయిల్ రావడంతో..ఐదో కేసు కింద ఉపా చట్టాన్ని గన్నవరం పోలీస్‌స్టేషన్‌లో 147, 148, 152, 197, 197(1డి), 353(1బి) బీఎన్ఎస్ సెక్షన్లతో పాటు 1967 ఉపా చట్టం సెక్షన్ 39 కింద కేసులు నమోదు చేశారని వివరించారు. ఒక వ్యక్తిపై ఒకే అంశంపై ఇన్ని కేసులు వరుస వారీగా పెట్టడమంటే అది కక్ష సాధింపు చర్య కాదా? అని నిలదీశారు. ఏడేళ్లలోపు శిక్ష వర్తించే కేసులకు కోర్టులు బెయిల్ ఇస్తుండడంతో దానికి ఎలాంటి అవకాశం లేకుండా 10 సంవత్సరాలకు పైబడి శిక్ష వర్తించే రాజద్రోహం, ఉపా లాంటి అక్రమ కేసులు పెట్టడం అత్యంత అమానుషం. కేసులతో ప్రశ్నించే విమర్శకుల గొంతునొక్కాలనుకోవడం దారుణమని తెలిపారు. గన్నవరం జనసేన నాయకుడు గరికపాటి



శివశంకర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఈ కేసు నమోదు చేశారన్నారు. దీని వెనుక కూటమి పెద్దల హస్తం ఉన్నట్లు స్పష్టంగా కన్పిస్తోందని తెలిపారు. ఉపా చట్టం ఏ రకంగా వర్తిస్తుందో పోలీసు ఉన్నతాధికారులే సమాధానం చెప్పాలని నిలదీశారు. రాజకీయాల్లోగానీ, సమాజంలోగానీ పరస్పర విమర్శలు చేయవచ్చునీ, అలా కాకుండా ఉపా చట్టాన్ని నమోదు చేయడాన్ని ఆయన తప్పుపట్టారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా తప్పుపట్టాయని తెలిపారు. సీఎం చంద్రబాబు తక్షణమే జోక్యం చేసుకుని.. ప్రశ్న రావణ్‌పై పెట్టిన ఉపా చట్టం కేసులను తక్షణమే తొలగించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## అయోధ్య రామ మందిరంలో జరిగిన కనుక ల అవినీతి పై సిబిఐ విచారణ జరగాలి కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు మీసాల సుమలత



**కర్నూలు సిటీ నందిపత్రిక** అయోధ్య రామ మందిరం లో పక్కదారి పట్టిన విరాళాలు. జేబు లేని యూనిఫామ్ కాదు కావలసింది, వ్యక్తిగత ప్రయోజనాల కొరకు నీతిని తప్పి ప్రవర్తించడం, మోసం చేయడం అక్రమ మార్గాల కు అడ్డుకట్ట వేయడం, విరాళాల దుర్వినియోగం కాకుండా చూడాలి.అయోధ్యలోని రామ మందిరానికి భక్తులు ఇచ్చిన కానుకలు పక్కదారి పట్టాయని కర్నూలు జిల్లా కాంగ్రెస్ పార్టీ మహిళా అధ్యక్షురాలు మీసాల సుమలత ఆరోపించారు. శ్రీ రామ మందిర తీర్థ క్షేత్ర ట్రస్ట్ లో కొందరు నీతిని తప్పి వ్యక్తిగత ప్రయోజనాల కోసం వారికున్న అధికారాన్ని దుర్వినియోగం చేస్తూ నిధులను కాజేశారు అని, ఆ తప్పును కప్పిపుచ్చేందుకు శ్రీ రామ మందిర తీర్థ క్షేత్ర ట్రస్ట్ కుయుక్తులు చేస్తుందని, ఓవైపు సిబ్బంది కి జేబులు లేని యూనిఫామ్ ఇవ్వనున్నామని చెబుతున్నారని, మరోవైపు శ్రీ రామ మందిరం తీర్థ క్షేత్ర ట్రస్ట్ ఇద్దరు సభ్యులు వైదొలగడం వంటి సంఘటన లు చూస్తే విరాళాలు పక్క దారి పట్టినట్లు అనుమానాలు తలెత్తుతున్నాయి అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం లు అయోధ్యలో భక్తులతో పాటు ప్రజల మనోభావాలు కాపాడాలని కోరారు. రామ మందిరానికి ఇచ్చిన కానుకలు రికార్డులు పక్కాగా నిర్వహించాలని, జేబులు లేని యూనిఫామ్ తో పాటు అక్రమ మార్గాలను అనుసరించే ట్రస్ట్ సభ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని విరాళాలు పక్కదారి పట్టాకుండా సమూల మార్పులు ప్రభుత్వాలు తీసుకురావాలని కోరుతూ జిల్లా అధ్యక్షులు న్యాయవాది బోయ క్రాంతి నాయుడు ఆదేశాల మేరకు జూలై8 వ తేదీన కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తామని జిల్లా అధ్యక్షురాలు మీసాల సుమలత తెలిపారు.

## పాణ్యం జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదం

**ఆళ్లగడ్డ రూరల్ ఏఎస్ఐ సురేష్ రెడ్డి మృతి**



**ఆళ్లగడ్డ ప్రతినిధి జూలై 5 నంది పత్రిక:** నంద్యాల జిల్లా పాణ్యం మండలం తమ్మరాజు పల్లె సమీపంలో జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆళ్లగడ్డ రూరల్ పోలీస్ స్టేషన్లో ఏఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న సురేష్ రెడ్డి (56) మృతి చెందారు.. అనంతపురంలో జరిగిన వివాహ వేడుకల్లో పాల్గొని తిరిగి ఆళ్లగడ్డకు వస్తుండగా తమ్మరాజు పల్లె గ్రామ పరిసరాల్లోకి రాగానే కారు టైరు ఒక్కసారిగా పేలిపోవడంతో వాహనం నియంత్రణ కోల్పోయి రోడ్డు పక్కకు దూసుకెళ్లింది. ఈ ప్రమాద తీవ్రతకు కారులో ఉన్న ఏఎస్ఐ సురేష్ కుమార్ అక్కడక్కడే మృతిచెందగా మరో కానిస్టేబుల్ నాగేంద్ర ప్రసాద్ రెడ్డి తీవ్రంగా గాయపడ్డారు. అలాగే మరో ఇద్దరు మహిళలు గాయపడ్డారు. ప్రమాదంపై సమాచారం అందుకున్న పాణ్యం పోలీసులు వెంటనే సంఘటన స్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన వారిని చికిత్స కోసం శాంతిరాం ఆసుపత్రికి తరలించారు. సురేష్ రెడ్డి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. కాగా మృతి చెందిన సురేష్ రెడ్డికి భార్య ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఆళ్లగడ్డ రూరల్ ఏ ఎస్ ఐ సురేష్ మృతి పట్ల ఆళ్లగడ్డ డిఎస్పి శ్రీనివాసరావు సిఐలు నాగరాజు, బివి రమణ ఎస్సైలుపోలీస్ సిబ్బంది సంతాపాన్ని వ్యక్తం చేశారు.

# అభివృద్ధే కూటమి సర్కార్ ధ్యేయం

**ఎటపాక మండలంలో పలు శంకుస్థాపనలు చేసిన ఎమ్మెల్యే శిరీషాదేవి**
**రూ;6.17 /- కోట్ల వ్యయంతో మాధవరావు పేట - గౌరీదేవి పేట గ్రామాల మధ్య బీటీ రోడ్డు నిర్మాణం**
**రాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిటి చైర్ పర్సన్,ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి**

**చింతూరు బ్యూరో చీఫ్ జులై 5 నంది పత్రిక** అభివృద్ధే ప్రధాన ధ్యేయంగా కూటమి ప్రభుత్వం చిత్త శుద్ధితో పని చేస్తోందని రాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిటి చైర్ పర్సన్ ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి అన్నారు. చింతూరు డివిజన్ లోని ఎటపాక మండలంలో ఆమె పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. ఆయా గ్రామాల్లో మండల పార్టీ అధ్యక్షులు బొల్లా




పుల్లయ్య సౌజన్యంలో పాల్గొన్న ఆమెకు హారతులతో కూటమి శ్రేణులు ఘన స్వాగతం పలికారు.

అనంతరం ఆమె తొలుత మాధవరావు పేట నుండి గౌరీదేవిపేట వరకు మంజూరు అయిన 10.2 కిలోమీటర్ల మేర తారు రోడ్డు నిర్మాణ పనులకు కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన చేశారు. పి ఐ యు శాఖ ఆధ్వర్యంలో రూ ;6.17 కోట్ల వ్యయంతో చేపట్టే ఈ పనులను సక్రమంగా చేయాలని సూచించారు . తోటపల్లి గ్రామంలో రూ:56 లక్షల వ్యయంతో నూతనంగా ఏర్పాటు చేసిన 11 కె.వి ఫీడర్ విద్యుత్ లైన్ ప్రారంభోత్సవం చేశారు. దీని వలన తోటపల్లి నుండి మురుమూరు వరకూ 7.5 కిలోమీటర్ల మేర సౌలభ్యం కలిగినట్లు పేర్కొన్నారు. అలాగే పి ఐ యు శాఖ ద్వారా చేపట్టబోయే బీటీ రోడ్డు నిర్మాణ పనులను కూటమి శ్రేణులు దగ్గరుండి పూర్తి నాణ్యతతో చేయించు కోవాలని సూచించారు. ఆయా నిర్మాణాల పర్యవేక్షణ చేసే శాఖల అధికారులు కూడా సకాలంలో ఆయా నిర్మాణ పనులు పూర్తి చేయాలని, పూర్తి నాణ్యతతో చేయాలని ఆదేశించారు.

ఆయా నిర్మాణ పనుల్లో ఎలాంటి తాత్సారం లేకుండా సక్రమంగా చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆమె వెంట మండల పార్టీ అధ్యక్షులు బొల్లా పుల్లయ్య,మండల పార్టీ కార్యదర్శి కనితి మధుబాబు, వైస్ ఎంపీపీ దొంతు మంగేశ్వర రావు, కానూరి బుల్లబ్బాయి, తెదేపా సీనియర్ నాయకులు మువ్వ శ్రీనివాస్, రాష్ట్ర తెలుగు యువత కార్యదర్శి వల్లభనేని చందు, ఎంపీటీసీ పాయం దేవి చైర్మన్ మాచినేని రాజేష్, ,మాజీ వైస్ ఎంపీపీ రవి మాధవరావు. బీసీ సెల్ నాయకులు ముత్యం సురేష్ గౌడ్, పెనుబల్లి సాయిబాబు, సీనియర్ నాయకులు అమరవరపు రాము, గ్రామ కమిటీ అధ్యక్షులు చంద్ర రఘు, మండల తెలుగు యువత అధ్యక్షులు నలజాల మధు, యూనిట్ ఇంచార్జి ఏలూరి వెంకటేశ్వర్లు , మాజీ సర్పంచ్ శివ, మాజీ ఎంపీపీ శ్యామల, మండల తెలుగు మహిళా అధ్యక్షురాలు రూప లక్ష్మీ, మాజీ ఎంపీటీసీ.సూర్యనారాయణ చౌదరి, మడకం నరసింహారావు, తహసీల్దార్ శ్రీనివాసరావు, మండల పరిషత్ అభివృద్ధి అధికారి విజయ దత్తు, విద్యుత్ శాఖ ఏ ఈ సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

## దానాలలో కెల్లా రక్తదనం గొప్పది

**ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేయాలి**
**ఆళ్లగడ్డ డీఎస్పీ శ్రీనివాసరావు**




**ఆళ్లగడ్డ ప్రతినిధి జూలై 5 నంది పత్రిక** దానాలలో కెల్లా రక్తదానం గొప్పదని ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేయాలని ఆళ్లగడ్డ డీఎస్పీ శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. పట్టణంలోని టీబి రోడ్డులో ఆళ్లగడ్డ బ్లడ్ డోనర్స్ టీమ్ రెండవ వార్షికోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన స్వచ్ఛంద మెగా రక్తదాన శిబిరాన్ని డీఎస్పీ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ రక్తదానం ద్వారా అనేకమంది ప్రాణాలను కాపాడే అవకాశం ఉంటుందని, అందువల్ల యువత స్వచ్ఛందంగా రక్తదాన సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలన్నారు. అత్యవసర పరిస్థితుల్లో స్వచ్ఛంద రక్తదాతలే ఎంతోమంది ప్రాణాలకు ఆధారంగా నిలుస్తారన్నారు. రక్తదానం చేయడం వల్ల దాత ఆరోగ్యానికి ఎలాంటి హాని ఉండదని, ఆరోగ్యవంతులైన ప్రతి ఒక్కరూ క్రమం తప్పకుండా రక్తదానం చేసే అలవాటు పెంపొందించుకోవాలని సూచించారు. సమాజ సేవా దృక్పథంతో నిరంతరం రక్తదాన శిబిరాలు నిర్వహిస్తూ అవసరమైన వారికి రక్తం అందిస్తున్న ఆళ్లగడ్డ బ్లడ్ డోనర్స్ టీమ్ సేవలను ఆయన అభినందించారు.ఈ కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ శబరీష్, డాక్టర్ బండారు గిరీష్ కుమార్, రిటైర్డ్ ఫార్మసిస్ట్ ఆఫీసర్ బండారు దస్తగిరి, ప్రజ్ఞ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ శివరామిరెడ్డి, ఆళ్లగడ్డ బ్లడ్ డోనర్స్ టీమ్ అధ్యక్షులు మహమ్మద్ హుస్సేన్, ట్రెజరీలు హరీష్, సుబ్బారెడ్డి, నంద్యాల ప్రభుత్వ బ్లడ్ బ్యాంక్ భరత్, సిబ్బంది పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



# మచిలీపట్నం ట్రాఫిక్ ఎస్సై బాలాజీకి సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా ప్రమోషన్



**మచిలీపట్నం బ్యూరో చీఫ్ జులై 5 నంది పత్రిక**ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ఏలూరు ప్రాంతానికి చెందిన అన్నంరెడ్డి బాలాజీ 2009 బ్యాచ్‌కు చెందినవారు. 16 సంవత్సరాల కఠోర శ్రమతో పోలీస్ శాఖలో ఉన్నత స్థానాన్ని అధిరోహించారు. తాజాగా ఆయనకు ఎస్సై నుండి సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా ప్రమోషన్ లభించింది.ప్రస్తుతం కృష్ణా జిల్లా మచిలీపట్నం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న బాలాజీకి ప్రమోషన్ వార్త తెలియగానే స్వగ్రామంలో సంబరాలు వెల్లువెత్తాయి. బంధువులు, స్నేహితులు, స్థానికులు ఆయన ఇంటికి వెళ్లి శుభాకాంక్షలు తెలిపారు.

**సుదీర్ఘ ప్రస్థానం**2009వ సంవత్సరంలో పోలీస్ శాఖలో కానిస్టేబుల్‌గా ఉద్యోగంలో చేరిన బాలాజీ, తన నిజాయితీ, క్రమశిక్షణతో ఎస్సై గా పదోన్నతి పొందారు. తన సర్వీస్‌లో ఆయన ఎక్కడా వివాదాలకు తావివ్వకుండా, అవివాద రహితుడిగా పేరు తెచ్చుకున్నారు.ఆయన తొలి పోస్టింగ్ అల్లూరి సీతారామరాజు జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతమైన గంగవరం పోలీస్ స్టేషన్‌లో జరిగింది. అక్కడ మావోయిస్టు ప్రభావిత ప్రాంతంలో కూడా ధైర్యంగా విధులు నిర్వర్తించారు. అనంతరం తూర్పు గోదావరి జిల్లాలోని కాకినాడ 1 టౌన్, కిర్లపూడి, పెద్దాపురం, ప్రత్తిపాడు, తుని వంటి కీలకమైన పోలీస్ స్టేషన్లలో ఎస్సా పనిచేశారు. ప్రతి చోటా ఆయన ప్రజలతో మంచి పేరు సంపాదించారు.

గత కొంత కాలంగా కృష్ణా జిల్లా మచిలీపట్నం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో ఎస్సై గా పనిచేస్తూ, ట్రాఫిక్ క్రమబద్ధీకరణలో, రోడ్డు ప్రమాదాల నివారణలో కీలక పాత్ర పోషించారు.

**అధికారుల ప్రశంసలు**విధి నిర్వహణలో చూపిన నిబద్ధత, నిజాయితీ కారణంగా ఉన్నతాధికారుల మన్ననలు పొందిన బాలాజీకి ఈ ప్రమోషన్ లభించింది. ఈ సందర్భంగా పోలీస్ ఉన్నతాధికారులు, సహోద్యోగులు ఆయనను అభినందించారు.

**బాలాజీ మాటలు** ప్రమోషన్ పొందిన సందర్భంగా బాలాజీ మాట్లాడుతూ "నాపై నమ్మకంతో ఇంతటి పెద్ద బాధ్యతను అప్పగించిన ఏలూరు రైజ్ ఐజి జి.వి. జి అశోక్ కుమార్ గారికి కృష్ణా జిల్లా ఎస్పీ శ్రీ విద్యాసాగర్ నాయుడు గారికి హృదయపూర్వక ధన్యవాదాలు. తెలుపుతున్నాను నా కుటుంబ సభ్యులు, గురువులు, సీనియర్ అధికారుల ఆశీస్సులే ఈ విజయానికి కారణం. ప్రజల సమస్యల పరిష్కారంలో నా వంతు కృషి చేస్తూ, ఇకపై మరింత బాధ్యతగా, నిష్టగా విధులు నిర్వర్తిస్తాను" అని తెలిపారు. ఆయన ప్రమోషన్ ఏలూరు జిల్లా యువతకు స్ఫూర్తిదాయకంగా నిలిచింది. కష్టపడితే ఏదైనా సాధించవచ్చని బాలాజీ జీవితం నిరూపిస్తోందని స్థానికులు అంటున్నారు


## ఇంటెన్సీ రివిజన్ ఎస్ ఐ ఆర్ 2006లో జిల్లాలో 11 లక్షల 24,848 ఫారాలు డిజిటైజేషన్ చేయడం జరిగింది

**జిల్లా కలెక్టర్ వెట్రి సెల్వి**

**ఏలూరు, బ్యూరో చీఫ్ జూలై , 5 నంది పత్రిక** ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ ఎస్ ఐ ఆర్ -2026లో భాగంగా జిల్లాలో ఇంతవరకు 11 లక్షల 24 వేల 848( 68.41%) ఎన్యూమరేషన్ ఫారంలు డిజిటైజేషన్ చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి తెలిపారు. జిల్లాలో 16 లక్షల 44 వేల 194 మంది ఓటర్లు ఉన్నరని, వారిలో 16 లక్షల 39వేల 426 (99.71%) ఎన్యూమరేషన్ ఫారంలు పంపిణి చేయడం జరిగిందన్నారు. ఈ ప్రక్రియ జూలై-14, 2026వరకు కొనసాగుతుందన్నారు. జిల్లాలో 1744 మంది బిఎల్ ఓ లు ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన -2026 కార్యక్రమంలో విధులు నిర్వర్తిస్తున్నారన్నారు . ఓటర్లు గణన ఫారం యందు తమ వివరాలు నమోదు చేసి, తిరిగి బూత్ లెవెల్ అధికార్లకు ఓటర్లు గణన ఫారం అందజేయాలన్నారు. తదుపరి బూత్ లెవెల్ అధికారి వాటిని పరిశీలించి బి ఎల్ ఓ యాప్ యందు అప్ లోడ్ చెయ్యడం జరుగుతుందని ప్రజలు తమకు అందిన ఎన్యూమరేషన్ ఫారాలను పూర్తిచేసి, బిఎల్ఓ లకు అందించి నిర్దేశించిన సమయంలోగా ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ -2026 కార్యక్రమం పూర్తి అయ్యేందుకు సహకరించాలని కలెక్టర్ వెట్రిసెల్వి విజ్ఞప్తి చేశారు.



## హర్మ్యూజ్ లో ప్రయాణించే నౌకలకు రుసుం.. మిత్రదేశాలకు ఇరాన్ రాయితీ!



ప్రపంచ ఇంధన వాణిజ్యంలో అత్యంత కీలకమైన హర్మ్యూజ్ జలసంధిలో ప్రయాణించే వాణిజ్య నౌకలపై సేవా రుసుములు వసూలు చేయనున్నట్లు ఇరాన్ ప్రకటించింది. అమెరికాతో కుదుర్చుకున్న 60 రోజుల ఉచిత ప్రయాణ ఒప్పందం ముగిసిన తర్వాత ఈ నిర్ణయం అమల్లోకి వస్తుందని స్పష్టం చేసింది. అయితే, కష్టకాలంలో తమకు మద్దతుగా నిలిచిన స్నేహపూర్వక దేశాలకు ప్రత్యేక రాయితీలు కల్పిస్తామని తెలిపింది. చైనాలోని ఇరాన్ రాయబారి అబ్దొల్‌రెజా రహ్మానీ ఫజ్లీ శనివారం బీజింగ్‌లో జరిగిన వరల్డ్ పీస్ ఫోరంలో ఈ వివరాలు వెల్లడించారు. ఈ రుసుములను టోల్ ఫీజుగా పరిగణించరాదని, నౌకల భద్రత, ట్రాఫిక్ పర్యవేక్షణ, పర్యావరణ పరిరక్షణ వంటి సేవలు అందించినందుకు మాత్రమే వసూలు చేస్తున్నామని ఆయన వివరించారు. ఈ కొత్త ఏర్పాట్ల కోసం ఒమన్‌తో కలిసి పనిచేస్తున్నట్లు తెలిపారు. "హర్మ్యూజ్ మా ప్రాదేశిక జలాల్లో భాగం కాబట్టి, మేము కచ్చితంగా సేవా రుసుములను వసూలు చేస్తాం" అని ఆయన అన్నారు. ఈ ఏడాది ప్రారంభంలో అమెరికా-ఇరాన్ మధ్య జరిగిన యుద్ధం తర్వాత ఇరు దేశాల మధ్య సయోధ్య కుదిరింది. ఇందులో భాగంగా 60 రోజుల పాటు హర్మ్యూజ్ జలసంధిలో నౌకల ఉచిత ప్రయాణానికి జూన్ మధ్యలో ఒప్పందం కుదిరింది. అయితే, ఈ జలసంధిలో ఎలాంటి రుసుములను అంగీకరించబోమని, అంతర్జాతీయ నౌకాయానానికి స్వేచ్ఛగా అందుబాటులో ఉండాలని అమెరికా వాదిస్తోంది.

printed and published by M.Mahesh babu on behaly of m/s mahesh publications # 13-36A, Nelliveedhi, Nandyal District, Nadyal printed at sai Aishwayam Apartment, Near Bharatha Matha Temple B-Block, Flat no 105, Tekke, Nandyal (Dist) AP pin-code 518501 GST No:-37ACDFM5465G1Z1 EDITOR; Mahesh Babu RNI No: Aptel/2023/88162 Phone No 9849499960,9059696959 Email id: Nandi patrika @gmail.com

# ఆహార కల్తీ, డ్రగ్స్ నియంత్రణకు రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం

- ఒకే గొడుగు కింద ఫుడ్ సేఫ్టీ,డ్రగ్ కంట్రోల్..
- గ్రేహౌండ్స్,అక్టోపస్ తరహా ప్రత్యేక దళాలు





ప్రజలు తినే తిండి నుంచి వాడే మందు వరకు నాణ్యతపై తెలంగాణ ప్రభుత్వం కొరడా ఝుళిపించేందుకు సిద్ధమైంది. రాష్ట్రంలో రోజురోజుకు పెరుగుతున్న ఆహార కల్తీ, నకిలీ ఔషధాల బెడదకు చెక్ పెట్టేందుకు పరిపాలనా వ్యవస్థలోనే పెద్ద మార్పు తెచ్చేందుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. క్యాన్సర్‌తో పాటు కిడ్నీ,లివర్,గుండె సంబంధిత దీర్ఘకాలిక వ్యాధులు పెరగడానికి ఆహార కల్తీ ఒక ప్రధాన కారణమని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్న నేపథ్యంలో, ప్రజారోగ్యాన్ని ప్రభుత్వం ప్రతిష్టాత్మక అంశంగా తీసుకుంది. ఇప్పటివరకు విడివిడిగా పనిచేస్తున్న ఆహార భద్రతా శాఖ, డ్రగ్ కంట్రోల్ శాఖలను ఒకే సంస్థగా విలీనం చేయాలని నిర్ణయించింది. ఈ కొత్త సమగ్ర సంస్థ ఒకే ఉన్నతాధికారి,హెచ్‌ఓడీ ఆధ్వర్యంలో పనిచేస్తుంది.ఈ విలీనం వెనుక ప్రభుత్వ ఉద్దేశం స్పష్టం. ఆహార పదార్థాల తయారీ నుంచి విక్రయం వరకు,ఔషధాల ఉత్పత్తి నుంచి పంపిణీ వరకు మొత్తం గొలుసుపై ఒకేసారి నిఘా పెట్టడం.ప్రస్తుతం రెండు శాఖల మధ్య సమన్వయ లోపం, బాధ్యతల పరస్పర తోపులాట వల్ల అనేక కేసులు నీరుగారిపోతున్నాయి. ఇక పై అలాంటి అంతరాలకు తావు ఉండదు.నిబంధనలు ఉల్లంఘించే వారిపై వేగంగా,కఠినంగా చర్యలు తీసుకునేందుకు ఈ కొత్త వ్యవస్థ దోహదపడుతుందని అధికారులు చెబుతున్నారు.అమలును మరింత పటిష్టం చేసేందుకు ప్రభుత్వం మరో సంచలన నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో మావోయిస్టు వ్యతిరేక కార్యకలాపాల్లో అనుభవం ఉన్న గ్రేహౌండ్స్,నగర భద్రత కోసం పనిచేసే ఆక్టోపస్ బలగాల తరహాలో ఆహార,ఔషధ నియంత్రణకు ప్రత్యేక దళాలను ఏర్పాటు చేయనున్నారు.ఈ దళాలు ఆకస్మిక తనిఖీలు, దాడులు,గోడౌన్లలో నిఘా,ఆన్‌లైన్ విక్రయాల పర్యవేక్షణ వంటి బాధ్యతలు చేపడతాయి. కల్తీ ముఠాలు,నకిలీ మందుల మాఫియాపై వేటు వేయడానికి ఈ బలగాలకు పూర్తి స్థాయి అధికారాలు ఇవ్వాలని ప్రభుత్వం యోచిస్తోంది.ప్రజలకు నాణ్యమైన ఆహారం, సురక్షితమైన ఔషధాలు అందించడం తమ ప్రాథమిక బాధ్యత అని అధికారులు పేర్కొంటు న్నారు. హోటళ్లు,ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు,మెడికల్ షాపులు,హోల్‌సేల్ మార్కెట్ల పై ఇకపై మరింత కఠిన పర్యవేక్షణ ఉంటుందని స్పష్టం చేస్తున్నారు. కల్తీదారులకు ఇక ఉపేక్ష లేదనే సంకేతాలు ఇస్తున్నారు.త్వరలోనే ఈ ప్రతిపాదనల కు సంబంధించిన పరిపాలనా ఉత్తర్వులు జారీ కానున్నాయి. కార్యాచరణ విధానం ఖరారైన వెంటనే కొత్త వ్యవస్థ అమల్లోకి వస్తుంది.విలీనం వల్ల సిబ్బంది కొరత తీరడం,నిధుల సద్వినియోగం,సాంకేతికత వినియోగం పెరగడం వంటి ప్రయోజనాలు ఉంటాయని ప్రభుత్వం ఆశిస్తోంది.అయితే ఈ నిర్ణయం కాగితాల పైనే ఆగిపోకుండా ,క్షేత్రస్థాయిలో ఎంత కఠినంగా అమలు అవుతుందనే దానిపై ప్రజల ఆశలు ఆధారపడి ఉన్నాయి.ఎందుకంటే ప్రజల పొట్టలోకి వెళ్లే ప్రతి మెతుకు, శరీరంలోకి వెళ్లే ప్రతి మాత్ర నాణ్యతగా ఉండాల్సిన అవసరం ఉంది.ఆ బాధ్యతను ప్రభుత్వం ఇప్పుడు మరింత గట్టిగా భుజానికెత్తుకున్నట్లు కనిపిస్తుంది.

# ఆన్‌లైన్ బెట్టింగ్ వ్యసనంతో దారుణం...!

- బంగారం,నగదు తీసుకొని వృద్ధురాలిని బావిలోకి తోసిన వైనం
- బావిలోకి తోసేసిన డిగ్రీ విద్యార్థి అరెస్ట్ చేసిన పోలీసులు

ఆన్‌లైన్ గేమ్స్, బెట్టింగ్‌లకు బానిసై అప్పుల ఊబిలో చిక్కుకున్న ఓ డిగ్రీ విద్యార్థి దొంగతనానికి పాల్పడి, వృద్ధురాలిని బావిలోకి తోసేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ కేసులో ప్రధాన నిందితుడి తో పాటు బంగారం కొనుగోలు చేసిన వ్యాపారిని కూడా పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, జగిత్యాల జిల్లా గుల్లపేట గ్రామాని కి చెందిన దమ్మ దినేష్ రెడ్డి (21) కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ కళాశాలలో డిగ్రీ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. ఆన్‌లైన్ గేమ్స్, బెట్టింగ్‌లకు అలవాటు పడి సుమారు రూ.4 లక్షల వరకు నష్టపోయాడు. లోన్ యాప్‌ల ద్వారా తీసుకున్న రుణాలను చెల్లించాలంటూ నిర్వాహకులు ఒత్తిడి చేయడంతో డబ్బు కోసం దొంగతనానికి పథకం రచించినట్లు పోలీసులు తెలిపారు. ఈ నెల 1వ తేదీన కూలి పని కోసం లేబర్ అడ్డా వద్ద నిలబడి ఉన్న గంగాధర లక్ష్మి అనే వృద్ధురాలిని పని ఇప్పిస్తానని నమ్మించి నసుల్తాపూర్ శివారుకు తీసుకెళ్లాడు. అక్కడ ఆమె వద్ద ఉన్న అర తులం బంగారం ,సుమారు 20 గ్రాముల వెండి ఆభరణాలను లాక్కొని, అనంతరం వృద్ధురాలిని బావిలోకి తోసి అక్కడి నుంచి పరారైనట్లు విచారణలో వెల్లడైంది. బావిలో పడిన వృద్ధురాలు సుమారు 21 గంటల పాటు అక్కడే చిక్కుకుపోయింది. మరుసటి రోజు ఉదయం స్థానిక గ్రామస్తులు ఆమె అరుపులు విని బావి నుంచి సురక్షితంగా బయటకు తీసి పోలీసులకు సమాచారం అందించారు.వృద్ధురాలిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు సీసీటీవీ ఫుటేజ్, అలాగే నిందితుడు ర్యాపిడో సేవ వినియోగించిన మొబైల్ నంబర్ ఆధారంగా దర్యాప్తు చేపట్టారు. కరీంనగర్ అమరవీరుల స్థూపం వద్ద దినేష్ రెడ్డిని అదుపులోకి తీసుకుని విచారించగా నేరాన్ని అంగీకరించినట్లు తెలిపారు. దొంగిలించిన బంగారా న్ని కరీంనగర్ టవర్ సర్కిల్ ప్రాంతంలో వేణు మనోహరాచారి అనే బంగారం వ్యాపారికి విక్రయించి రూ.30 వేలు తీసుకున్నట్లు పోలీసులు వెల్లడించారు. ఈ



వ్యవహారంలో బంగారం కొనుగోలు చేసిన వ్యాపారిని కూడా అరెస్ట్ చేసినట్లు తెలిపారు.ఈ ఘటన పై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగి స్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.

# నిరుద్యోగుల గుండె చప్పుడు వినిపిస్తోందా..?

ఉద్యోగం కోసం పుస్తకం పట్టిన యువకుడు... చివరకు ప్లకార్డు పట్టాల్సి వస్తోంది.కలెక్టర్ కావాలని కలలు కన్న యువతి... పరీక్షలు,వాయిదాలు, న్యాయపోరాటాల మధ్య తన భవిష్యత్తు కోసం కోర్టుల చుట్టూ తిరగాల్సి వస్తోంది. పిల్లల చదువుల కోసం అప్పులు చేసిన తల్లిదండ్రులు...ఉద్యోగ నియామకాల కోసం సంవత్సరాల తరబడి ఎదురు చూస్తున్నారు.ఇది ఒక్కరి కథ కాదు. తెలంగాణతో పాటు దేశవ్యాప్తంగా వేలాది మంది నిరుద్యోగ యువత అనుభవిస్తున్న వాస్తవం. నిరుద్యోగ యువత అడుగుతున్న ప్రశ్న ఒకటే. చదవడం తప్పా? పోటీ పరీక్షలు రాయడం నేరమా? ప్రభుత్వ ఉద్యోగం సాధించి ప్రజలకు సేవ చేయాలని కలలు కనడం తప్పా? ఈ ప్రశ్నలకు సమాధానం కోసం వారు ప్రభుత్వాల వైపు చూస్తున్నారు. తెలంగాణ ఉద్యమంలో విద్యార్థులు, యువత కీలక పాత్ర పోషించారు .ప్రత్యేక రాష్ట్రం ఏర్పడితే ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయని, స్థానిక యువతకు ప్రాధాన్యం లభిస్తుందని ఎంతోమంది ఆశించారు.అయితే రాష్ట్ర ఏర్పాటుకు తర్వాత కూడా ఉద్యోగ నియామకాల ప్రక్రియలో ఆలస్యం, పరీక్షల వాయిదాలు,కొన్ని పరీక్షల్లో ప్రశ్నపత్రాల లీకేజీ వంటి పరిణామాలు వేలాది మంది అభ్యర్థులను తీవ్ర నిరాశకు గురి చేశాయి.రాజకీయ పార్టీలు ఎన్నికల సమయంలో ఉద్యోగాలపై భారీ హామీలు ఇస్తుంటాయి. అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీల అమలు పై మాత్రం ప్రతిపక్షాలు ప్రశ్నలు లేవనెత్తడం, ప్రభుత్వం తన వాదన వినిపించడం ప్రతి ఎన్నికల తర్వాత కనిపించే దృశ్యంగా మారింది. దీంతో రాజకీయ వాదోపవాదాల మధ్య నిరుద్యోగుల సమస్యలు మరుగున పడుతున్నాయనే అభిప్రాయం పలువురిలో వ్యక్తమవుతోంది.ఇదే సమయంలో ప్రపంచం వేగంగా మారుతోంది. కృత్రిమ మేధస్సు (ఏఐ), ఆటోమేషన్, డిజిటల్ టెక్నాలజీలు ఉద్యోగాల స్వరూపాన్నే మార్చేస్తున్నాయి. ఒకవైపు సంప్రదాయ ప్రభుత్వ ఉద్యోగాల కోసం పోటీ పెరుగుతుండగా,మరోవైపు కొత్త నైపుణ్యాలు ఉన్న వారికి ప్రైవేట్ రంగం,స్టార్టప్‌లు, డిజిటల్ సేవలు, ఫ్రీలాన్సింగ్ వంటి రంగాల్లో అవకాశాలు విస్తరిస్తున్నాయి.ఈ నేపథ్యంలో యువత ముందున్న ప్రశ్న కేవలం “ప్రభుత్వ ఉద్యోగం ఎప్పుడు వస్తుంది?” అనేది మాత్రమే కాదు. ”మారుతున్న ప్రపంచానికి అనుగుణంగా నేను ఎలా సిద్ధమవ్వాలి?” అన్నది కూడా అంతే ముఖ్యమైంది.నిపుణుల అభిప్రాయం ప్రకారం... ప్రభుత్వాలు పారదర్శకంగా, వేగంగా ఉద్యోగ నియామకాలు పూర్తి చేయడం ఒకవైపు అవసరమైతే,మరోవైపు నైపుణ్యాభివృద్ధి, డిజిటల్ శిక్షణ, పరిశ్రమలతో అనుసంధానమైన ఉపాధి అవకాశాలు కల్పించడం కూడా అత్యంత కీలకం. ప్రభుత్వ ఉద్యోగాలు పరిమితంగా ఉండే పరిస్థితుల్లో స్వయం ఉపాధి, స్టార్టప్‌లు, ప్రైవేట్ రంగం,సాంకేతిక నైపుణ్యాల పై కూడా యువత దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని వారు సూచిస్తున్నారు. ఉద్యోగం ఒక యువకుడి వ్యక్తిగత అవసరం మాత్రమే కాదు.అది ఒక కుటుంబ ఆర్థిక భద్రత, ఒక సమాజ అభివృద్ధి,ఒక రాష్ట్ర భవిష్యత్తుతో ముడిపడి ఉంటుంది.అందుకే నిరుద్యోగుల సమస్యను రాజకీయ కోణంలో మాత్రమే కాకుండా అభివృద్ధి,విద్య, నైపుణ్యం, ఉపాధి అనే సమగ్ర దృష్టితో చూడాల్సిన సమయం ఆసన్నమైంది. ప్రశ్న ఇంకా అలాగే ఉంది. నిరుద్యోగ యువత ఎదురుచూపులకు ముగింపు ఎప్పుడు? ప్రభుత్వ ఉద్యోగాలే పరిష్కారమా? లేక మారుతున్న ప్రపంచానికి అనుగుణంగా కొత్త అవకాశాలను అందిపుచ్చుకోవడమే భవిష్యత్తు దారినా? ఈ ప్రశ్నలకు సమాధానం వెతకాల్సింది కేవలం ప్రభుత్వాలు మాత్రమే కాదు, సమాజం మొత్తం.

## కాళేశ్వరం బ్యారేజీల పునరుద్ధరణ తప్పనిసరి

- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి




కాళేశ్వరం ఎత్తిపోతల పథకం (కేఎల్ఐఎస్) బ్యారేజీల పరిస్థితిపై నీటిపారుదల,పౌర సరఫరాల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆదివారం రాష్ట్ర సచివాలయంలో మీడియా సమావేశంలో కీలక వ్యాఖ్యలు చేశారు.కాళేశ్వరం ఎత్తిపోతల పథకం పరిధిలోని బ్యారేజీల కార్యకలాపాల ను తిరిగి ప్రారంభించాలంటే వాటిని శాస్త్రీయ పద్ధతిలో పునరుద్ధరించడం అత్యవసరమని మంత్రి స్పష్టం చేశారు. ఇంజనీరింగ్ ప్రమాణాలు, భద్రతా అంశాలను పూర్తిగా పరిశీలించిన తర్వాతే తదుపరి నిర్ణయాలు తీసుకుంటామని తెలిపారు. రాజకీయ ప్రయోజనాల కోసం గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఇంజనీరింగ్ భద్రత విషయంలో రాజీ పడిందని ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆరోపించారు.ఈ నేపథ్యంలో మూడు కాళేశ్వరం బ్యారేజీల పునాదులు బలహీనంగా ఉన్నాయని, వాటి నిర్మాణ నాణ్యత పై తీవ్ర అనుమానాలు వ్యక్తమ వుతున్నాయని పేర్కొన్నారు. బ్యారేజీల నిర్మాణానికి సంబంధించిన సాంకేతిక అంశాలను నిపుణుల కమిటీలు ఇప్పటికే పరిశీలిస్తు న్నాయని, వారి నివేదికల ఆధారంగా అవసరమైన పునరుద్ధరణ చర్యలు చేపడతామని మంత్రి తెలిపారు. ప్రజల ప్రాణాలు,ప్రభుత్వ ఆస్తుల భద్రత విషయంలో ఎలాంటి రాజీ ఉండదని స్పష్టం చేశారు. కాళేశ్వరం వంటి భారీ సాగునీటి ప్రాజెక్టులు రాష్ట్ర వ్యవసాయానికి కీలకమైనవని, అందువల్ల వాటి భద్రత, పనితీరును దీర్ఘకాలిక దృష్టితో పరిశీలిస్తున్నామని చెప్పారు. శాశ్వత పరిష్కారం దిశగా శాస్త్రీయ ప్రమాణాలతోనే పునర్నిర్మాణం, మరమ్మతు పనులు చేపడతామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు.

## మున్నూరు కాపులు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలి



మున్నూరు కాపులు విద్యా, ఉపాధి, రాజకీయ రంగాలన్నింటిలో అభివృద్ధి చెందాలని మునగాల మండల కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు కాసర్ల కోటేశ్వరరావు అన్నారు. మండల కాంగ్రెస్ కమిటీ కి ఇటీవల నూతన అధ్యక్షుడిగా ఎంపికైన సందర్భాన్ని పురస్కరించుకొని గ్రామ మున్నూరు కాపు సంఘ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత పూర్వకాలము నుండి కుల సంఘాలు ఉండేవని కులంలో ఏదైనా సమస్య లుంటే కుల పెద్ద ఆధ్వర్యంలో అవి పరిష్కరించబడేవని, తమ హక్కుల సాధన కోసం కుల సంఘాల ఏర్పాటు ఎంతైనా అవసరమని ఆయన అన్నారు. వివిధ రాజకీయ పార్టీలలో ఉన్న మున్నూరు కాపు సంఘ ప్రజా ప్రతినిధులు రాజకీయాలకతీతంగా తమ సంఘ అభివృద్ధికి స్వచ్ఛందంగా కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కుల సంఘంలో ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు రాష్ట్ర మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి తో పాటు స్థానిక ఎమ్మెల్యే ఎన్. పద్మావతి ల సహాయ సహకారాలతో నిధులు మంజూరు చేయించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఈ సందర్భంగా ఆయన హామీ ఇచ్చారు. తాటికొండ శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ కాసర్ల వెంకట్, సంఘ గ్రామ అధ్యక్షుడు తాటికొండ సురేష్, సంఘ పెద్దలు శాఖ ముడి అప్పారావు, కాసర్ల రంగారావు, గుంటుపల్లి శ్రీనివాస్, పరమాత్ముల సత్య నారాయణ, దండి పుల్లయ్య లతోపాటు మున్నూరు కాపు కులస్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎంపికైన కాసర్ల కోటేశ్వరరావు ను శాలువాలతో పూలమాలలతో ఘనంగా సత్కరించారు.

# బిజినెస్

## ఏఐ హైరింగ్ జోరు



దేశీయ ఐటీ సేవల రంగంలో నియామకాల వేగం మందగించినప్పటికీ, కృత్రిమ మేధ (ఏఐ) నైపుణ్యాలకు డిమాండ్ మాత్రం వేగంగా పెరుగుతోంది. మారుతున్న సాంకేతిక అవసరాలకు అనుగుణంగా తమ వ్యాపార నమునాలను పునర్ వ్యవస్థీక రిస్తుండటంతో ఏఐ నిపుణుల భర్తీకి కంపెనీలు అధిక ప్రాధాన్యమిస్తున్నట్లు నౌకరీ.కామ్ తన తాజా జాబ్‌సీక్ నివేదికలో వెల్లడించింది. జూన్ నెలలో ఐటీ రంగంలో మొత్తం నియమాకాలు వార్షిక ప్రాతిపదికన 3 శాతం తగ్గగా, ఏఐ సంబంధిత నియామకాలు 16 శాతం పెరిగినట్లు తెలిపింది. దేశవ్యాప్తంగా 1.5 లక్షలకు పైగా కంపెనీల ఉద్యోగ ప్రకటనల ఆధారంగా నౌకరీ.కామ్ ఈ నివేదికను రూపొందించింది. కాగా ఏఐ ఇప్పుడు అదనపు నైపుణ్యం మాత్రమే కాకుండా సంస్థలకు కీలక సామర్థ్యంగా మారుతుండటంతో భవిష్యత్‌లో ఈ ప్రత్యేక సాంకేతిక నైపుణ్యాలు కలిగిన సిబ్బందికి డిమాండ్ మరింత పెరిగే అవకాశముందని ఇన్ఫో ఎడ్జ్ (నౌకరీ మాతృ సంస్థ) సీఈఓ హితేష్ ఒబెరాయ్ తెలిపారు. దీర్ఘకాలంలో ఐటీ రంగంలో నియామకాలు మరింత మందగించే అవకాశముందని దేశంలోనే అతిపెద్ద ఐటీ సేవల సంస్థ అయిన టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ పేర్కొంది. సంస్థల్లో సంప్రదాయ ఉద్యోగుల సంఖ్య, ఏఐ ఏజెంట్ల సంఖ్య దాదాపు సమాన స్థాయిని చేరుకునే దిశగా పరిశ్రమ కదులుతోందని టీసీఎస్ అభిప్రాయపడింది. ఏఐ డేటా సెంటర్లతో ఇంజనీర్లకు భారీ డిమాండ్: ఏఐ డేటా సెంటర్లు ఇతర మౌలిక వసతుల నిర్మాణం వేగం పుంజుకోవడంతో మెకానికల్, ఎలక్ట్రికల్, ఇండస్ట్రియల్ ఇంజనీరింగ్ వంటి కోర్ విభాగాలకూ భారీ డిమాండ్ ఏర్పడుతోంది. ముఖ్యంగా విద్యుత్ వ్యవస్థలు, కూలింగ్ టెక్నాలజీ, థర్మల్ మేనేజ్‌మేంట్, డేటా సెంటర్ నిర్మాణ రూపకల్పనలో నైపుణ్యం కలిన ఇంజనీర్లను కంపెనీలు పెద్దఎత్తున నియమించుకుంటుండంతో ఈ విభాగాల్లో వేతనాలు గణనీయంగా పెరుగుతున్నాయి. అలాగే, ఏఐ రంగంలో ఉద్యోగ అవకాశాలు కేవలం సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లకే పరిమితం కాకుండా విద్యుత్, శీతలీకరణ, పారిశ్రామిక మౌలిక సదుపాయాల రంగాలకు కూడా విస్తరిస్తున్నాయి. దేశంలో డేటా సెంటర్ల నిర్వహణ సామర్థ్యం 2025లో 1.6 గిగావాట్లు ఉండగా, ఇది 2030 నాటికి 5 గిగావాట్లకు పెరగనుందని అంచనా.

## టాటా ఈవీ కార్లపై భారీ డిస్కౌంట్లు.. జూలైలో రూ.3.35 లక్షల వరకు ఆఫర్లు!



దేశీయ ఆటోమొబైల్ దిగ్గజం టాటా మోటార్స్, తన ఎలక్ట్రిక్ వాహనాల (ఈవీ) విక్రయాలను పెంచుకునే దిశగా జూలై నెలలో భారీ డిస్కౌంట్లను ప్రకటించింది. విస్తరిస్తున్న ఈవీ మార్కెట్లో తన ఆధిపత్యాన్ని నిలబెట్టుకునే లక్ష్యంతో, ఎంపిక చేసిన మోడళ్లపై గరిష్టంగా రూ. 3.35 లక్షల వరకు ప్రయోజనాలను కల్పిస్తోంది. ఈ ఆఫర్లలో నగదు తగ్గింపు, ఎక్స్ఛేంజ్ బోనస్, స్క్రాపేజ్ ప్రయోజనాలు మరియు లాయల్టీ ఇన్సెంటివ్‌లు అంతర్భాగంగా ఉన్నాయి. ముఖ్యంగా టాటా కర్వ్ ఈవీ (Curvv EV)పై గరిష్టంగా రూ. 3.35 లక్షల వరకు ప్రయోజనాలను అందిస్తోంది. ఇందులో భాగంగా, ఎంపిక చేసిన నాన్-ఎక్స్ సిరీస్ వేరియంట్లపై రూ. 3 లక్షల వరకు నగదు తగ్గింపుతో పాటు ఎక్స్ఛేంజ్ లేదా స్క్రాపేజ్ బోనస్‌లు లభించనున్నాయి. ఇతర మోడళ్లపై అందుబాటులో ఉన్న ఆఫర్ల వివరాలు ఇలా ఉన్నాయి: టాటా హారియర్ ఈవీ: ఈ మోడల్‌పై ప్రత్యక్ష నగదు తగ్గింపు లేనప్పటికీ, ఎక్స్ఛేంజ్/స్క్రాపేజ్ మరియు లాయల్టీ బోనస్‌ల రూపంలో రూ. 2.75 లక్షల వరకు ప్రయోజనాలను పొందవచ్చు. టాటా పంచ్ ఈవీ: లాంగ్ రేంజ్ (LR) వేరియంట్లపై రూ. 1.45 లక్షల వరకు, మిడ్ రేంజ్ (MR) వేరియంట్లపై రూ. 1.25 లక్షల వరకు ఆదా చేసుకునే అవకాశం ఉంది. టాటా టియాగో ఈవీ: పాత మోడళ్లపై రూ. 1.45 లక్షల వరకు, MR మరియు LR వేరియంట్లపై రూ. 65,000 నుంచి రూ. 1 లక్ష వరకు ప్రయోజనాలు అందుబాటులో ఉన్నాయి. టాటా నెక్సాన్ ఈవీ: ఈ మోడల్‌పై రూ. 15,000 నగదు తగ్గింపుతో పాటు ఇతర ఆఫర్ల ద్వారా కలిపి మొత్తం రూ. 50,000 వరకు ప్రయోజనాలను కంపెనీ అందిస్తోంది. గత జూన్ నెలలోనూ ఇలాంటి ఆఫర్లనే ప్రకటించిన టాటా మోటార్స్, పోటీ మార్కెట్లో అమ్మకాల జోరును కొనసాగించాలని లక్ష్యంగా పెట్టుకుంది. అయితే, ఈ ఆఫర్లు షోరూం, భౌగోళిక ప్రాంతం మరియు స్టాక్ లభ్యతను బట్టి మారే అవకాశం ఉంటుంది. కాబట్టి, కొనుగోలుదారులు పూర్తి వివరాల కోసం సమీపంలోని అధీకృత డీలర్‌షిప్‌ను సంప్రదించవలసిందిగా సూచించడమైనది.

## అదానీ గ్రూప్ భారీ ఆసుపత్రి.. 1,000 బెడ్లు పేదలకు ఉచితం

- కోల్‌కతాలో 2,000 పడకల ఆసుపత్రి ఏర్పాటు చేయనున్న అదానీ గ్రూప్
- ఇందులో 1,000 పడకలు పేదలకు ఉచితంగా కేటాయింపు
- ఈ విషయాన్ని అధికారికంగా ప్రకటించిన బెంగాల్ సీఎం సువేందు అధికారి
- దేశవ్యాప్తంగా ఆరోగ్య రంగంలో అదానీ గ్రూప్ పలు సీఎస్ఆర్ కార్యక్రమాలు




పారిశ్రామిక దిగ్గజం అదానీ గ్రూప్ ఆరోగ్య రంగంలో మరో భారీ ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టింది. పశ్చిమ బెంగాల్ రాజధాని కోల్‌కతా సమీపంలోని న్యూ టౌన్ ప్రాంతంలో 2,000 పడకల సామర్థ్యంతో ఒక అత్యాధునిక ఆసుపత్రిని ఏర్పాటు చేయనున్నట్లు ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి సువేందు అధికారి వెల్లడించారు. ఇందులో సగం పడకలను అంటే 1,000 బెడ్లను పేద రోగులకు పూర్తిగా ఉచితంగా కేటాయించనున్నట్లు ఆయన తెలిపారు. గత శనివారం తన నియోజకవర్గం భవానీపూర్‌లో పౌర సమాజ ప్రతినిధులతో జరిగిన ఒక సమావేశంలో సీఎం సువేందు అధికారి మాట్లాడారు. తమ ప్రభుత్వం గత రెండు నెలల్లో చేపట్టిన కార్యక్రమాలను వివరిస్తూ, అదానీ గ్రూప్ ఆసుపత్రి ఏర్పాటుకు లిఖితపూర్వక హామీ ఇచ్చిందని స్పష్టం చేశారు. ఈ ఆసుపత్రిలో 1,000 పడకలను పేదల ఉచిత వైద్యానికి, మిగిలిన 1,000 పడకలను వాణిజ్య కార్యకలాపాలకు వినియోగిస్తారని ఆయన వివరించారు. అదానీ గ్రూప్ సామాజిక బాధ్యతలో (సీఎస్ఆర్) భాగంగా దేశవ్యాప్తంగా ఆరోగ్య రంగంలో పలు కార్యక్రమాలు చేపడుతోంది. గతంలో బీహార్‌లో అఖండ జ్యోతి ఆసుపత్రితో కలిసి 'అదానీ సెంటర్ ఫర్ ఐ డిసీజెస్'ను ప్రారంభించింది. ఢిల్లీలోని లేడీ హార్డింగ్ మెడికల్ కాలేజీలో కిడ్నీ సంబంధిత వ్యాధుల చికిత్స ప్రాజెక్టును కూడా విస్తరించింది. ఈ సందర్భంగా అదానీ గ్రూప్ ఛైర్మన్ గౌతమ్ అదానీ మాట్లాడుతూ.. "ఒక వ్యక్తికి కంటిచూపు ఇవ్వడమంటే కేవలం వైద్యం అందించడం కాదు, వారి జీవితంలోకి ఆశ, ఆత్మవిశ్వాసం, గౌరవాన్ని తిరిగి తీసుకురావడం" అని అన్నారు. కోల్‌కతాలో ఏర్పాటు చేయనున్న ఈ కొత్త ఆసుపత్రి, అదానీ గ్రూప్ ఆరోగ్య సేవల విస్తరణలో ఒక ముఖ్యమైన ముందడుగుగా నిలవనుంది.

## భారత్-ఇంగ్లండ్ మ్యాచ్‌లో కండోమ్ యాడ్.. బీసీసీఐ పై కీర్తి ఆజాద్ ఆగ్రహం

- ఇండియా-ఇంగ్లండ్ టీ20 మ్యాచ్‌లో కండోమ్ యాడ్ రావడంపై కీర్తి ఆజాద్ అభ్యంతరం
- కుటుంబంతో కలిసి చూసే మ్యాచ్‌లలో ఇలాంటివి తగవని వ్యాఖ్య
- బీసీసీఐ వెంటనే ఈ విషయంపై దృష్టి పెట్టాలని డిమాండ్
- స్పందించకపోతే పార్లమెంటులో ఈ అంశాన్ని ప్రస్తావిస్తానని హెచ్చరిక
- ఆల్కహాల్, సిగరెట్ యాడ్స్ నిషేధించినప్పుడు ఇవి ఎందుకని ప్రశ్న




భారత్, ఇంగ్లండ్ మధ్య జరిగిన రెండో టీ20 మ్యాచ్ ప్రసారం సందర్భంగా ఒక అడల్ట్ కంటెంట్ (కండోమ్ యాడ్) ఉన్న ప్రకటన రావడంపై టీమిండియా మాజీ క్రికెటర్, తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ కీర్తి ఆజాద్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. కోట్లాది మంది పిల్లలు, కుటుంబ సభ్యులు చూసే మ్యాచ్‌లో ఇలాంటి ప్రకటనలు ప్రసారం చేయడం సిగ్గుచేటని ఆయన మండిపడ్డారు. ఈ విషయంపై బీసీసీఐ వెంటనే దృష్టి సారించాలని డిమాండ్ చేశారు. ఈ అంశం పై ఐఏఎన్ఎస్ వార్తా సంస్థతో మాట్లాడుతూ, "ఇది ఒక అడల్ట్ యాడ్. పిల్లలు తమ తల్లిదండ్రులతో కలిసి మ్యాచ్ చూస్తుంటారు. వారి వయసు 16 ఏళ్ల లోపే ఉంటుంది. నేను చూస్తున్నప్పుడే 44 కోట్ల మంది ఈ మ్యాచ్‌ను వీక్షిస్తున్నారు. అలాంటి సమయంలో ఇలాంటి యాడ్ రావడం సరికాదు" అని ఆజాద్ అన్నారు. ఇలాంటి ప్రకటనల వల్ల తల్లిదండ్రులు ఇబ్బందికరమైన పరిస్థితిని ఎదుర్కొంటారని, పిల్లల నుంచి వచ్చే ప్రశ్నలకు ఏం సమాధానం చెప్పాలో తెలియని గందరగోళం ఏర్పడుతుందని ఆయన వివరించారు. ఆల్కహాల్, సిగరెట్ ఉత్పత్తుల ప్రకటనలను నిషేధించినప్పుడు, అడల్ట్ కంటెంట్ ఉన్న యాడ్స్‌ను ఎందుకు అనుమతిస్తున్నారని ఆయన బీసీసీఐని ప్రశ్నించారు. మ్యాచ్ జరుగుతున్న సమయంలో దీని పై సోషల్ మీడియా వేదికగా స్పందించిన ఆజాద్.. "ఓల్డ్ ట్రాఫోర్డ్‌లో జరుగుతున్న అంతర్జాతీయ టీ20 మ్యాచ్‌ను పిల్లలు ప్రత్యక్షంగా చూస్తున్నారు. డ్యూరెక్స్ కండోమ్ కు సంబంధించిన అడల్ట్ యాడ్ స్క్రీన్‌పై రావడం సిగ్గుచేటు. బీసీసీఐ ఈ విషయాన్ని గమనించాలి" అని ఎక్స్ లో పోస్ట్ చేశారు. ఈ విషయంపై బీసీసీఐ సరైన రీతిలో స్పందించకపోతే, అవసరమైతే పార్లమెంటులో కూడా ఈ అంశాన్ని ప్రస్తావిస్తానని కీర్తి ఆజాద్ హెచ్చరించారు.

## దశాబ్దాల వివాదానికి తెర.. దినేశ్ కార్తీక్ పై భావోద్వేగంతో మాట్లాడిన మురళీ విజయ్

- దినేశ్ కార్తీక్‌పై భావోద్వేగంతో ప్రసంగించిన మాజీ క్రికెటర్ మురళీ విజయ్
- తమిళనాడు అత్యుత్తమ క్రికెటర్లలో కార్తీక్ ఒకరంటూ ప్రశంసలు
- దశాబ్దానికి పైగా ఉన్న వ్యక్తిగత వివాదాల నేపథ్యంలో ఈ వ్యాఖ్యలకు ప్రాధాన్యత
- టీఎన్‌సీఏ వార్షికోత్సవ కార్యక్రమంలో చోటుచేసుకున్న అరుదైన ఘటన



భారత క్రికెట్‌లో ఒకప్పుడు తీవ్ర చర్చనీయాంశమైన వ్యక్తిగత వివాదానికి దశాబ్దం తర్వాత తెరపడే సూచనలు కనిపిస్తున్నాయి. ఒకప్పటి ప్రాణ స్నేహితులు, సహచర ఆటగాళ్లు, ఆ తర్వాత వ్యక్తిగత కారణాలతో దూరమైన మురళీ విజయ్, దినేశ్ కార్తీక్‌ల మధ్య సయోధ్యకు సూచనగా ఓ అరుదైన ఘటన చోటుచేసుకుంది. తమిళనాడు క్రికెట్ అసోసియేషన్ (టీఎన్‌సీఏ) వార్షికోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న మురళీ విజయ్.. దినేశ్ కార్తీక్‌పై భావోద్వేగంతో ప్రశంసల వర్షం కురిపించాడు. ఈ కార్యక్రమంలో మాట్లాడుతూ మురళీ విజయ్ భావోద్వేగానికి గురయ్యాడు. ఒకప్పుడు తన సహచర ఆటగాడిగా ఉన్న దినేశ్ కార్తీక్‌తో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నాడు. "నేను దినేశ్ కార్తీక్ గురించి మాట్లాడాలనుకుంటున్నాను. ఇది కాస్త వింతగా అనిపించవచ్చు, కానీ నేను చిన్నప్పటి నుంచి అతడిని చూస్తున్నాను. తమిళనాడు క్రికెట్ చరిత్రలోనే అత్యుత్తమ క్రికెటర్, బ్యాటర్, వికెట్ కీపర్‌లలో డీకే ఒకరని నేను భావిస్తున్నాను" అని విజయ్ అన్నాడు. విజయ్ తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ.. "అతను ఒక డైనమిక్ పర్సనాలిటీ, నా ఆప్త మిత్రుడు. నాన్-స్ట్రైకర్ ఎండ్‌లో ఉండి అతని ఆటను ఎన్నోసార్లు ఆస్వాదించాను. అతనిలా ఆడటం నేను ఎప్పుడూ చూడలేదు. అతను అద్భుతమైన క్రికెటర్. తనకున్న పరిజ్ఞానంతో నాకు ఎంతో సహాయం చేశాడు. అందుకు ఇప్పుడు అతనికి ధన్యవాదాలు చెప్పాలనుకుంటున్నాను" అంటూ కన్నీళ్లు పెట్టుకున్నాడు. విజయ్ చేసిన ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి.

# స్పోర్ట్స్

## పాకిస్థాన్ క్రికెట్‌లో నాటకీయ పరిణామం.. మళ్లీ టెస్టు కెప్టెన్‌గా బాబర్ ఆజం




పాకిస్థాన్ క్రికెట్ జట్టు టెస్టు కెప్టెన్సీ పగ్గాలు మరోసారి స్టార్ బ్యాటర్ బాబర్ ఆజంకే దక్కాయి. గతంలో కెప్టెన్సీకి వీడ్కోలు పలికిన అతడిని, రాబోయే వెస్టిండీస్, ఇంగ్లండ్ పర్యటనలకు సారథిగా నియమిస్తూ పాకిస్థాన్ సెలెక్షన్ కమిటీ నిర్ణయం తీసుకుంది. లాహోర్‌లోని గడ్డాఫీ స్టేడియంలో జరిగిన ప్రెస్ కాన్ఫరెన్స్‌లో నేడు ఈ కీలక ప్రకటన చేసింది. వెస్టిండీస్‌తో రెండు టెస్టుల సిరీస్, ఆ తర్వాత ఇంగ్లండ్‌తో మూడు టెస్టుల సిరీస్‌లలో బాబర్ ఆజం జట్టును నడిపించనున్నాడు. జులై 25 నుంచి ఆగస్టు 6 వరకు వెస్టిండీస్ పర్యటన, ఆగస్టు 19 నుంచి సెప్టెంబర్ 13 వరకు ఇంగ్లండ్ పర్యటన జరగనుంది. ఈ పర్యటనల కోసం వేర్వేరు జట్లను ప్రకటించారు. వెస్టిండీస్ టూర్‌కు 16 మంది సభ్యులతో కూడిన జట్టును ఎంపిక చేయగా, ఇంగ్లండ్ సిరీస్ కోసం 17 మందిని ఎంపిక చేశారు. ఇంగ్లండ్ జట్టులో సౌద్ షకీల్ పేరును చేర్చినా, అతని ఎంపిక ఫిట్‌నెస్‌పై ఆధారపడి ఉంటుందని సెలెక్టర్లు స్పష్టం చేశారు. బాబర్ కెప్టెన్సీ ప్రస్థానంలో ఇది ఒక ముఖ్యమైన మలుపు. 2023లో భారత్ వేదికగా జరిగిన వన్డే ప్రపంచకప్‌లో పాకిస్థాన్ గ్రూప్ దశలోనే నిష్క్రమించడంతో బాబర్ నైతిక బాధ్యత వహిస్తూ అన్ని ఫార్మాట్ల కెప్టెన్సీ నుంచి తప్పుకున్న విషయం తెలిసిందే. ఆ తర్వాత షాన్ మసూద్ టెస్టు కెప్టెన్‌గా బాధ్యతలు చేపట్టాడు. అయితే, 2024 మార్చిలో బాబర్‌ను మళ్లీ వన్డే, టీ20 కెప్టెన్‌గా నియమించారు. కానీ, ఆ ప్రయాణం కేవలం ఆరు నెలలకే ముగిసింది. 2024 అక్టోబర్‌లో అతను మళ్లీ వైట్-బాల్ కెప్టెన్సీ నుంచి తప్పుకున్నాడు.

నంది పత్రిక
సోమవారం 06 - 07 -2026



## ఘనంగా ప్రారంభమైన నార్నే నితిన్ కొత్త సినిమా ఇద్దరు హీరోయిన్లతో!

-నార్నే నితిన్ హీరోగా కేవీఎన్ ప్రొడక్షన్స్ కొత్త సినిమా
-పూజా కార్యక్రమాలతో ప్రారంభం
-అనిఖా సురేంద్రన్, మేఘా శెట్టి హీరోయిన్లుగా ఎంపిక
-రాధా కృష్ణ రెడ్డి దర్శకత్వం
-ప్రముఖ సినిమాటోగ్రాఫర్ సెంథిల్ కుమార్ కెమెరామెన్‌గా బాధ్యతలు

యంగ్ టైగర్ ఎన్టీఆర్ బావమరిది, యువ హీరో నార్నే నితిన్ తన కొత్త చిత్రాన్ని అధికారికంగా ప్రారంభించారు. ఇంకా పేరు పెట్టని ఈ సినిమాకు ఎచీచీ5 అనే వర్కింగ్ టైటిల్‌తో హైదరాబాద్‌లో ఆదివారం పూజా కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. ఈ చిత్రంలో నితిన్ సరసన ఇద్దరు హీరోయిన్లు నటిస్తున్నారు. 'బుట్టబొమ్మ' ఫేమ్ అనిఖా సురేంద్రన్, కన్నడ నటి మేఘా శెట్టి కథానాయికలుగా ఎంపికయ్యారు.ప్రముఖ నిర్మాణ సంస్థ కేవీఎన్ ప్రొడక్షన్స్ ఈ చిత్రాన్ని నిర్మిస్తుండగా, రాధా కృష్ణ రెడ్డి దర్శకత్వ బాధ్యతలు చేపట్టారు. యూత్‌ఫుల్ రొమాంటిక్ ఎంటర్‌టైనర్‌గా ఈ సినిమా తెరకెక్కనుంది. ముహూర్తపు షాట్‌కు నిర్మాత వెంకట్ కె. నారాయణ క్లాప్ కొట్టగా, ప్రముఖ సినిమాటోగ్రాఫర్ కె.కె. సెంథిల్ కుమార్ కెమెరా స్విచ్ ఆన్ చేశారు. కళ్యాణ్ శంకర్ తొలి షాట్‌కు గౌరవ దర్శకత్వం వహించారు. ఈ చిత్రానికి వివేక్–మెర్విన్ సంగీతం అందిస్తుండగా, 'బాహుబలి', 'ఆర్ఆర్ఆర్' వంటి చిత్రాలకు పనిచేసిన సెంథిల్ కుమార్ సినిమాటో గ్రాఫర్‌గా వ్యవహరించనుండటం విశేషం. పూజా కార్యక్రమాల అనంతరం చిత్ర యూనిట్ త్వరలోనే మరిన్ని అప్‌డేట్స్ అందిస్తామని ప్రకటించింది. ఈ వేడుకకు పలువురు సినీ ప్రముఖులు హాజరై చిత్ర బృందానికి శుభాకాంక్షలు తెలిపారు.

## మూడోసారి ఓ ఇంటివాడైన ఆమిర్ ఖాన్... గౌరీ స్ప్రాట్ తో నిరాడంబరంగా వివాహం



బాలీవుడ్ మిస్టర్ పర్‌ఫెక్ట్ ఆమిర్ ఖాన్ తన జీవితంలో కొత్త అధ్యాయాన్ని ప్రారంభించారు. ఆయన తన స్నేహితురాలు గౌరీ స్ప్రాట్‌ను ఆదివారం వివాహం చేసుకున్నారు. అతికొద్ది మంది కుటుంబ సభ్యులు, సన్నిహితుల సమక్షంలో ముంబైలో ఈ వేడుక నిరాడంబరంగా జరిగింది. ఇది ఆమిర్ ఖాన్‌కు మూడో వివాహం. ఈ వేడుకలో ఆమిర్ ఖాన్, గౌరీ స్ప్రాట్ క్రీమ్, లేత గోధుమ రంగు సంప్రదాయ దుస్తుల్లో మెరిశారు. వివాహ పత్రాలపై ఆమిర్ సంతకం చేస్తున్న ఫోటోను ఆయన ప్రతినిధి విడుదల చేశారు. ఈ పెళ్లికి ఆమిర్ మొదటి భార్య పిల్లలు జునైద్ ఖాన్, ఇరా ఖాన్‌తో పాటు, రెండో భార్య కుమారుడు ఆజాద్ రావు ఖాన్ కూడా హాజరయ్యారు. నగరంలో భారీ వర్షాలు కురుస్తున్నా, దర్శకుడు అశుతోష్ గోవారికర్, నటుడు వీర్ దాస్, రాజకీయ నాయకుడు రాజ్ థాకరే వంటి ప్రముఖులు ఈ వేడుకకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. గత మార్చిలో తన 60వ పుట్టినరోజున గౌరీతో పెళ్లి విషయాన్ని ఆమిర్ ఖాన్ అధికారికంగా ప్రకటించారు. "జులై 5న ఇంట్లోనే చాలా సింపుల్‌గా పెళ్లి చేసుకుంటున్నాం. ఇరు కుటుంబాలు, కొద్దిమంది స్నేహితులు మాత్రమే హాజరవుతారు" అని ఆయన అప్పుడు తెలిపారు. ఆమిర్ ఖాన్ 1986లో రీనా దత్తాను వివాహం చేసుకుని, 2002లో విడిపోయారు. ఆ తర్వాత 2005లో కిరణ్ రావును పెళ్లి చేసుకుని, 2021లో విడాకులు తీసుకున్నారు. ఇక గౌరీ స్ప్రాట్ ఫ్యాషన్ రంగంలో పనిచేశారు. గతంలో ఆమెకు వివాహమై ఒక కుమారుడు ఉన్నాడు. గౌరీ, తాను 25 ఏళ్లుగా స్నేహితులమని, ఇటీవలే ప్రేమలో పడ్డామని అమీర్ కొంతకాలం కిందట వెల్లడించారు.

## అందరూ ఎదురుచూస్తున్న మెలోడీ- అఖిల్ 'లెనిన్' నుంచి 'జయమంగళం' పాట రిలీజ్

-అక్కినేని అఖిల్ 'లెనిన్' చిత్రం నుంచి ఆసక్తికరమైన పాట విడుదల
'-జయమంగళం' పేరుతో లిరికల్ వీడియోను రిలీజ్ చేసిన మేకర్స్
-తమన్ స్వరపరిచిన ఈ మెలోడీకి మంచి స్పందన
-జులై 10న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి రానున్న 'లెనిన్'
-నేడు తిరుపతిలో ప్రీ రిలీజ్ ఈవెంట్



అక్కినేని అఖిల్ కథానాయకుడిగా నటిస్తున్న కొత్త చిత్రం 'లెనిన్'. ఈ సినిమా నుంచి అభిమానులు ఎంతో ఆసక్తి గా ఎదురుచూస్తున్న పాటను చిత్రబృందం విడుదల చేసింది. 'జయమంగళం' పేరుతో వచ్చిన ఈ మెలోడీ సాంగ్ పూర్తి లిరికల్ వీడియోను ఆదివారం రిలీజ్ చేశారు. "అందరూ అడిగిన మెలోడీ... అందరూ ఎదురుచూస్తున్న మెలోడీ" అంటూ చిత్ర యూనిట్ ఈ పాటను ప్రేక్షకులకు అందించింది. ప్రముఖ సంగీత దర్శకుడు తమన్ స్వరపరిచిన ఈ మెలోడీ పాటకు శ్రోతల నుంచి మంచి స్పందన లభిస్తోంది. పాటలోని సాహిత్యం, ట్యూన్ సంగీత ప్రియులను ఆకట్టుకుంటున్నాయి. మురళి కిశోర్ అబ్బూరు దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై నాగార్జున అక్కినేని, సూర్యదేవర నాగవంశీ నిర్మిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా ప్రమోషన్ కార్యక్రమాలు జోరుగా సాగుతున్నాయి. అందులో భాగంగా విడుదలైన ఈ ఫస్ట్ సింగిల్ సినిమాపై అంచనాలను మరింత పెంచింది. ఈ చిత్రానికి నవీన్ నూలి ఎడిటర్‌గా, లియోన్ బ్రిట్టో సినిమాటోగ్రాఫర్‌గా పనిచేస్తున్నారు. 'లెనిన్' చిత్రాన్ని జులై 10న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేసేందుకు నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు. నేడు 'లెనిన్' చిత్రం ప్రీరిలీజ్ ఈవెంట్ తిరుపతిలో గ్రాండ్ గా నిర్వహించనున్నారు.

## కల్యాణ్ రామ్ బర్త్‌డే ట్రీట్.. 'వెంకీ-అనిల్ రావిపూడి' మూవీ నుంచి ఫస్ట్‌లుక్ విడుదల!

- కల్యాణ్ రామ్ పుట్టినరోజు సందర్భంగా కొత్త సినిమా పోస్టర్ విడుదల
- వెంకటేశ్, కల్యాణ్ రామ్ మల్టీస్టారర్ నుంచి ఫస్ట్ లుక్
- సంప్రదాయ గెటప్‌లో ఆకట్టుకుంటున్న నందమూరి హీరో
- తన మొదటి హీరో కల్యాణ్ రామ్ అంటూ దర్శకుడి భావోద్వేగ పోస్ట్



నందమూరి కల్యాణ్ రామ్ పుట్టినరోజు సందర్భంగా ఆయన అభిమానులకు అదిరిపోయే అప్‌డేట్ వచ్చేసింది. విక్టరీ వెంకటేశ్, కల్యాణ్ రామ్ కలిసి నటిస్తున్న భారీ మల్టీస్టారర్ సినిమా నుంచి స్పెషల్ పోస్టర్‌ను చిత్రబృందం విడుదల చేసింది. ఇందులో కల్యాణ్ రామ్ పూర్తి సంప్రదాయ గెటప్‌లో పంచెకట్టుతో కనిపిస్తూ ఫ్యాన్స్‌ను ఎంతగానో ఆకట్టుకుంటున్నారు. ప్రస్తుతం ఈ పోస్టర్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఈ సందర్భంగా దర్శకుడు అనిల్ రావిపూడి సోషల్ మీడియా వేదికగా కల్యాణ్ రామ్‌కు శుభాకాంక్షలు తెలుపుతూ ఓ భావోద్వేగ పోస్ట్ చేశారు. "నా మొదటి సినిమా 'పటాస్'కు అవకాశం ఇచ్చి, ఒక కొత్త దర్శకుడిని నమ్మిన నా మొదటి హీరో, నా బెస్ట్ బడ్డీ కల్యాణ్ రామ్‌కు థ్యాంక్స్. ఈ సినిమాలో ఆయన్ను కొత్త అవతారంలో చూపించబోతున్నందుకు ఎగ్జైటింగ్‌గా ఉంది" అని పేర్కొన్నారు. అంతేగాక ఈ క్రేజీ ప్రాజెక్ట్‌ను 2027 సంక్రాంతి పండుగకు థియేటర్లలోకి తీసుకురానున్నట్లు అనిల్ రావిపూడి అధికారికంగా ప్రకటించారు. 'పటాస్' వంటి బ్లాక్‌బస్టర్ తర్వాత వీరిద్దరి కాంబినేషన్‌లో వస్తున్న సినిమా కావడం, దీనికి విక్టరీ వెంకటేశ్ కూడా తోడవడంతో సినిమాపై అంచనాలు భారీగా ఉన్నాయి. షైన్ స్క్రీన్స్, సురేష్ ప్రొడక్షన్స్, జీ స్టూడియోస్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రంలో కీర్తి సురేశ్, కృతి శెట్టి కీలక పాత్రలు పోషిస్తుండగా, జి.వి. ప్రకాశ్ కుమార్ సంగీతం అందిస్తున్నారు.

## నాకు విజయాలే కొత్త.. ఫెయిల్యూర్స్ కాదు



టాలీవుడ్ విలక్షణ నటుడు సత్యదేవ్ తన సినీ ప్రయాణంపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తనకు అపజయాలు కొత్తేమీ కాదని, విజయాలే కొత్తగా అనిపిస్తాయని ఆయన పేర్కొన్నారు. తన తాజా చిత్రం 'రావు బహదూర్' ప్రచార కార్యక్రమాల్లో భాగంగా హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో సత్యదేవ్ ఈ విషయాలను వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. "నాకు అపజయాలు కొత్త కాదు, విజయాలే కొత్తగా అనిపిస్తాయి. నేను నటించిన చిత్రాల్లో కొన్ని మాత్రమే ఆశించిన విజయాన్ని అందుకున్నాయి. ఫలితంతో సంబంధం లేకుండా ప్రతి సినిమాకూ పూర్తి నిబద్ధతతో పనిచేశాను. కొన్ని చిత్రాలపై భారీ అంచనాలు ఉన్నప్పటికీ, విడుదల తర్వాత ఫలితాలు నిరాశపరిచిన సందర్భాలు ఉన్నాయి" అని గుర్తుచేసుకున్నారు. ప్రస్తుతం 'రావు బహదూర్' చిత్రానికి లభిస్తున్న ఆదరణ పట్ల సత్యదేవ్ హర్షం వ్యక్తం చేశారు. వెంకటేష్ మహా దర్శకత్వంలో తెరకెక్కిన 'రావు బహదూర్' జూలై 3న ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఈ చిత్రానికి మిశ్రమ స్పందన లభిస్తున్నప్పటికీ, బాక్సాఫీస్ వద్ద నిలకడైన వసూళ్లను సాధిస్తోంది. జి.ఎం.బి. ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై అనురాగ్ రెడ్డి, శరత్ చంద్ర అంకారపు, చింతా గోపాలకృష్ణ రెడ్డి ఈ చిత్రాన్ని సంయుక్తంగా నిర్మించారు. సూపర్ స్టార్ మహేష్ బాబు, నమ్రత శిరోద్కర్ ఈ చిత్రానికి సమర్పకులుగా వ్యవహరించడం విశేషం. చిత్ర పరిశ్రమలో ఉండే తీవ్రమైన పోటీ, ఒత్తిడి నేపథ్యంలో సత్యదేవ్ చేసిన ఈ వ్యాఖ్యలు ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి.

## ఆన్‌లైన్ ఆర్డర్‌లో దుర్గంధం: ఫ్యాషన్ బ్రాండ్ జారా పై నటి త్రిష ఫైర్



ప్రముఖ నటి త్రిష కృష్ణన్ అంతర్జాతీయ ఫ్యాషన్ బ్రాండ్ 'జారా'పై సోషల్ మీడియా వేదికగా తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ఆన్‌లైన్‌లో తాను ఆర్డర్ చేసిన దుస్తులు దుర్వాసన వస్తున్నాయని, ఇలా జరగడం ఇది వరుసగా మూడోసారని ఆమె పేర్కొన్నారు. ఈ అనుభవం అత్యంత అసహ్యంగా ఉందని ఆవేదన వ్యక్తం చేస్తూ, సదరు సంస్థ తన నాణ్యతా ప్రమాణాలను మెరుగు పరచుకోవాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో జారా సంస్థను ట్యాగ్ చేస్తూ త్రిష ఒక పోస్ట్ చేశారు. "ప్రియమైన జారా.. దయచేసి మేం హోమ్ డెలివరీ కోసం ఆర్డర్ చేసిన దుస్తులు దుర్వాసన రాకుండా చూసుకోండి. వరుసగా ఇది మూడోసారి కావడం గమనార్హం. ఇది చాలా అసహ్యంగా ఉంది. కనీసం వాటిని ప్యాక్ చేసే ముందైనా నాణ్యతను తనిఖీ చేయండి" అంటూ ఆమె తన పోస్ట్‌లో రాసుకొచ్చారు. ప్రస్తుతం 'కరుప్పు' వంటి చిత్రాలతో వార్తల్లో ఉన్న త్రిష చేసిన ఈ పోస్ట్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఆన్‌లైన్ షాపింగ్‌లో నాణ్యతా నియంత్రణ లోపాలపై ఈ పోస్ట్ సరికొత్త చర్చకు దారి తీసింది.

printed and published by M.Mahesh babu on behaly of m/s mahesh publications # 13-36A, Nelliveedhi, Nandyal District, Nadyal printed at sai Aishwayam Apartment, Near Bharatha Matha Temple B-Block, Flat no 105, Tekke, Nandyal (Dist) AP pin-code 518501 GST No:-37ACDFM5465G1Z1 EDITOR; Mahesh Babu RNI No: Aptel/2023/88162 Phone No 9849499960,9059696959 Email id: Nandi patrika @gmail.com